అక్టోబర్
2021

186

సంపుటి : 16 సంచిక : 5 వెల రు. 10/-

## ఈ సంచికలో........

నగదీకరణ ముసుగులో ప్రైవేటీకరణ

విప్లవ పార్టీలో ఆగ్జిలరీల నిర్మాణం నాయకత్వ సమస్యే

1905 రష్యన్ విప్లవం నుండి1917 అక్టోబర్ విప్లవం వరకూ

ప్రత్యామ్నాయ సంస్కృతి: ఆచరణ సమస్యలు

జనపదాలు- మహా జనపదాలు

లేబర్ కోడ్‌లు: కార్మికవర్గంపై దాడి

ఉన్నతస్థాయి సమాజ నిర్మాణం దిశగా చైనా పురోగమనం

ఆఫ్ఘన్ నుండి 'ఆకుస్' వరకు

పెట్టుబడిదారీ విధానంపై పోరాడితేనే వాతావరణ ప్రమాదం నుండి రక్షణ

పెట్టుబడిని వేగంగా సమీకరించుకోడానికి క్రోనీయిజం ఒక మార్గం

1958 పార్టీ ప్రత్యేక (5వ) మహాసభ

# 1958 పార్టీ ప్రత్యేక (5వ) మహాసభ

**1957**వ సంవత్సరం నుండి కమ్యూనిస్టు పార్టీలో మౌలిక సైద్ధాంతిక సమస్యలపై చర్చ తీవ్రమయింది. అయితే ఈ సమస్యలను పక్కన పెట్టి 1957లో జరిగిన రెండో సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్‌ని ఓడించడమే ధ్యేయంగా కమ్యూనిస్టు పార్టీ పనిచేసింది. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోను, కేరళ తప్ప మిగిలిన అన్ని రాష్ట్రాలలోను విజయం సాధించినప్పటికీ దేశంలోని రాజకీయ రంగంలో అతి పెద్ద మార్పులు సంభవించాయి.

52లో జరిగిన ఎన్నికలలో కంటే 1957లో కమ్యూనిస్టు పార్టీ రెట్టింపు ఓట్లు సంపాదించి, ఓట్లు, సీట్లలో రెండో అతి పెద్ద పార్టీగా అవతరించింది. కేరళలో మెజారిటీ సాధించింది. ఆంధ్రా, పశ్చిమ బెంగాల్‌లలో ప్రధాన ప్రతిపక్షంగా వచ్చింది. ఇదివరకు అనేక రాష్ట్రాల శాసనసభలలో ఉదాహరణకు బీహార్, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్ లలో పార్టీకి సీట్లు ఉండేవి కావు. కానీ ఇప్పుడు దేశంలోని ప్రతి రాష్ట్ర శాసనసభలో ఎన్నోకొన్ని స్థానాలు సంపాదించింది. చాల పారిశ్రామిక కార్మిక కేంద్రాలలో పార్టీ మంచి ఫలితాలు సాధించింది. పార్టీకి ఏ మాత్రం బలం లేని చోట కూడా స్థానాలు సంపాదించ గలిగింది. దేశం మొత్తం మీద 11శాతం, 1.2 కోట్ల ఓట్లు పొందింది. దామాషా పద్ధతి గనక అమలులో ఉండి ఉంటే పార్టీకి మరిన్ని ఎక్కువ స్థానాలు వచ్చి ఉండేవి.

ఎన్నికల ఫలితాలను సమీక్షిస్తూ ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకానికి పార్టీ కృతజ్ఞతలను తెలిపింది. అదే సమయంలో కొన్ని ఆందోళనకరమైన అంశాలను కూడా గుర్తించింది. ఫ్యూడల్ శక్తుల ఆధిపత్యం ఉన్న మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలలో జనసంఘ్‌కి అధిక సీట్లు వచ్చిన విషయాన్ని గమనించింది. కమ్యూనిస్టు ఉద్యమం, ఇతర ప్రజాస్వామిక, అభివృద్ధి కాముక శక్తులు బలహీనంగా ఉన్న ఒరిస్సా లాంటి రాష్ట్రాలలో అది శక్తి పుంజుకున్నది. చాలా గ్రామీణ ప్రాంతాలలో పార్టీ సీట్లు గెలుచుకోలేక పోయింది. రైతాంగంలో పార్టీని, కిసాన్ సభ ను బలపరుచుకోవలసిన అవసరాన్ని గుర్తించింది.

'ప్రజాపార్టీగా' రూపొందించాలనే సంకల్పంతో రెండో సాధారణ ఎన్నికలు జరిగిన వెంటనే పార్టీ సభ్యత్వాన్ని రెట్టింపు చేయాలని కేంద్రకమిటి పిలుపునిచ్చింది. సాధారణ ఎన్నికలు ఉండడం వలన అనేక రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణ సమస్యలను చర్చించడానికి కేంద్ర కమిటీ నిర్ణయించిన ప్లీనం నిర్వహించలేక పోయింది. ప్లీనం బదులుగా ప్రత్యేక మహాసభను నిర్వహించాలని రెండో సాధారణ ఎన్నికలు జరిగిన వెంటనే పార్టీ నిర్ణయించింది. అందువల్ల 1958 ఏప్రిల్ 6-13 తేదీల మధ్య అమృత్‌సర్‌లో పార్టీ అయిదవ మహాసభ ప్రత్యేక మహాసభగా జరిగింది.

ప్రత్యేక మహాసభ రాజకీయ తీర్మానం, నిర్మాణ నివేదిక చర్చించి ఆమోదించడంతో పాటు, పార్టీ నిబంధనావళిని కూడా చర్చించి ఆమోదించింది. సోషలిజం, కమ్యూనిజం సాధించడం కోసం 'కార్మికవర్గ నాయకత్వంలో కార్మికవర్గం, రైతాంగ మిత్రత్వాన్ని బలపరిచి జనతా ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పరచడం తన లక్ష్యంగా నిబంధనావళిలోని ఉపోద్ఘాతంలో పార్టీ ప్రకటించింది. 'మతతత్వం, కులతత్వం, అంటరానితనం, మహిళల పట్ల అసమానవత వంటి అన్ని అభివృద్ధి నిరోధక భావాలు, ఆచరణలను సంపూర్ణంగా వ్యతిరేకించాని' ప్రకటించింది. సోషలిస్టు సమాజాన్ని నిర్మించే క్రమంలో 'అన్ని రూపాలలో ఉన్న సంస్కరణవాదం, పిడివాదం, ఒంటెత్తుపోకడలపై కూడా పోరాడుతుందని నిబంధనావళిలో పేర్కొంది. భారతదేశ చరిత్ర, జాతీయ ప్రత్యేకతలను దృష్టిలో ఉంచుకుని, భారత ప్రజల సుసంప్రదాయాలను కొనసాగిస్తూ, భారతదేశ పరిస్థితులకు మార్క్సిజం లెనినిజాన్ని అన్వయిస్తుందని, అందుకను గుణంగా విధానాలను రూపొందిస్తామని పేర్కొంది.

సంస్కరణవాదం, పిడివాదం, ఒంటెత్తుపోకడలపై పోరాడుతుందని ప్రకటించినప్పటికీ పార్టీలోని ఒక తరగతిలో ఉన్న ఈ ధోరణులు నిబంధనావళిలో ప్రతిబింబించాయి. 'పార్లమెంటులో మెజారిటీ స్థానాలలో విజయం సాధించి, ప్రజల ఐక్య కార్యాచరణతో 'మితవాద శక్తుల ప్రతిఘటనను ఎదుర్కొని, పార్లమెంటును ప్రజల ఆకాంక్షలకు సాధనంగా మలిచి, 'ఆర్థిక, సామాజిక, దేశ నిర్మాణంలో మౌలిక మార్పులు తీసుకుని రావచ్చునని' దానిలో చెప్పారు. ఇది పార్టీలో ఉన్న పార్లమెంటరీ భ్రమలను, ముఖ్యంగా 1957 తరువాత పెరిగిన భ్రమలను తెలియచేస్తుంది.

కమిటీల ఏర్పాటులో చేసిన మార్పులు పార్టీ నిబంధనావళిలోని సంస్కరణవాద అంశాలను ప్రతిబింబించాయి. మూడంచెల నిర్మాణం - జాతీయ కౌన్సిల్, కేంద్ర ఎక్సిక్యూటివ్ కమిటీ, సెక్రటేరియట్ - ఏర్పాటు చేశారు. దీని వలన నిర్ణయాలను అమలు చేయడం కన్నా, వివిధ అంచెలలో ఉన్న కమిటీల సమావేశాలలో పాల్గొనడానికి సభ్యులు ఎక్కువ సమయం వెచ్చించవలసి వచ్చేది. విప్లవోద్యమ లోతుపాతులు, స్వభావం, స్వరూపాలతో సంబంధం లేకుండా కేవలం సభ్యత్వం, ప్రాంతీయ ప్రాతినిధ్యాన్ని మాత్రమే పరిగణన లోకి తీసుకుని పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం పేరుతో సభ్యుల రాజకీయ, సైద్ధాంతిక స్థాయితో నిమిత్తం లేకుండా కమిటీలలో సభ్యుల సంఖ్యను పెంచారు. ఫలితంగా ఆచరణలో పార్టీ నిర్మాణంలో సంస్కరణవాద ధోరణులు వేళ్ళూను కున్నాయి.

పార్టీ సభ్యులు 12 విధులను ఆచరించాలని పార్టీ నిబంధనావళి నిర్దేశించింది. పార్టీ కార్యకలాపాలలో క్రమం తప్పకుండా పాలుపంచుకోవడం, మార్క్సిస్టు-లెనినిస్టు సైద్ధాంతిక అవగాహన పెంచుకోవడం, పార్టీ పత్రికలకు చందాదారులుగా ఉండడం, పార్టీ సాహిత్యాన్ని చదవడం, పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండడం, ప్రజల కోసం పనిచేయడం, పార్టీ సభ్యులు ఒకరితో ఒకరు సత్సంబంధాలు కలిగి ఉండడం, విమర్శ ఆత్మవిమర్శ, భారతదేశ ప్రజల సుసంపన్న సాంస్కృతిక వారసత్వాన్ని, సాంప్రదాయాలను లోతుగా అవగాహన చేసుకోవాలని పేర్కొన్నారు. అదే సమయంలో పార్టీ ప్రతి సభ్యునికి ఏడు హక్కులను ఇచ్చింది- పార్టీ కమిటీలకు ఎన్నికవటం, చర్చలలో స్వేచ్ఛగా పాల్గొనడం, పార్టీ విధాన రూపకల్పనలో భాగస్వాములు కావడం, పార్టీ సమావేశాలలో పార్టీ కార్యకర్తలను, కమిటీలను విమర్శించడం, పై కమిటీలకు తమ అభిప్రాయాలు తెలియచేయటం వీటిలో ఉన్నాయి. కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని పార్టీలో ఎలా అన్వయించాలో వివరంగా తెలిపింది. ప్రజలు తమ జీవితాలను మెరుగుపరుచుకునేందుకు చేస్తున్న పోరాటాలలో పార్టీ మౌలిక విభాగమైన శాఖ నాయకత్వ పాత్ర నిర్వహించాలని చెప్పింది. ప్రజాసంఘాల కార్యక్రమాలు, పనితీరులో కొన్ని

(మిగతా 34వ పేజీలో)

## ఈ సంచికలో...


1. 1958 పార్టీ ప్రత్యేక (5వ) మహాసభ ..... 2

2. నగదీకరణ ముసుగులో ప్రైవేటీకరణ
బివి రాఘవులు ............ 4

3. విప్లవ పార్టీలో ఆగ్జిలరీల నిర్మాణం నాయకత్వ సమస్యే
పెనుమల్లి మధు .......... 7

4. 1905 రష్యన్ విప్లవం నుండి 1917 అక్టోబర్ విప్లవం వరకూ
తమ్మినేని వీరభద్రం ........ 10

5. ప్రత్యామ్నాయ సంస్కృతి: ఆచరణ సమస్యలు
ఎస్ వీరయ్య .......... 13

6. జనపదాలు- మహా జనపదాలు
ఎంవిఎస్ శర్మ.......... 15

7. లేబర్ కోడ్‌లు: కార్మికవర్గంపై దాడి
టికె రాజలక్ష్మి.......... 18

8. ఉన్నతస్థాయి సమాజ నిర్మాణం దిశగా చైనా పురోగమనం
ఆర్ అరుణ్ కుమార్ ........... 22

9. ఆఫ్ఘన్ నుండి 'ఆకుస్' వరకు
ఎస్ వెంకట్రావు........... 26

10. పెట్టుబడిదారీ విధానంపై పోరాడితేనే వాతావరణ ప్రమాదం నుండి రక్షణ .......... 30

11. పెట్టుబడిని వేగంగా సమీకరించుకోడానికి క్రోనీయిజం ఒక మార్గం
బివి రాఘవులు........... 33



సంపాదకుడు:
**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
ఫోన్: ఎడిటర్ : 9490099333

ముద్రణ: ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
మేనేజర్: కె.హరికిషోర్: 9490098977
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com


# ప్రజా నిరసన

భారత దేశ రైతాంగానికి వ్యతిరేకంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేసిన మూడు నల్ల చట్టాలు భారత రైతాంగానికే కాదు మొత్తం దేశానికే వ్యతిరేకమైనవని ప్రముఖ పాత్రికేయులు పాలగుమ్మి సాయినాథ్ చెప్పారు. అవి దేశానికి వ్యతిరేకమైనవి గనుకనే మొత్తం దేశమంతా ఏకమై ఆ చట్టాలకు నిరసనగా గత నెల 27న భారత్ బంద్ జరిపింది. గతంలో భారత దేశంలో చాలా బంద్‌లు జరిగాయి. కానీ వాటన్నిటికీ భిన్నమైన ఒక చారిత్రక ప్రాధాన్యత ఈ బంద్‌కు ఉన్నదన్న వాస్తవాన్ని గ్రహించకపోతే మనం దీన్నికూడా అన్ని బంద్‌ల మాదిరిగానే పరిగణించి నిర్ధారణలకు వచ్చే అవకాశం ఉంది. అన్ని బంద్‌లకు మాదిరిగానే బంద్ ఎంత జయప్రదంగా జరిగింది, ఎక్కడెక్కడ ఎంతెంత ప్రభావ వంతంగా జరిగింది అనే లెక్కలకు పరిమితమయ్యే ప్రమాదమూ ఉంది.


300 రోజుల క్రితం మూడు రైతు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ప్రారంభించిన పోరాటం అనేక దశలు దాటుకుంటూ పరిణామం చెందిన క్రమాన్ని పరిశీలిస్తే ఈ పోరాటం ప్రాధాన్యత అర్ధమవుతుంది. ప్రధానంగా పంజాబ్ రైతులు ప్రారంభించిన ఆందోళన క్రమంగా హర్యానా, యుపి దాటి దేశంలోని అన్ని ప్రాంతాలకూ విస్తరించింది. దేశంలోని ప్రధాన వ్యవసాయ సంఘాలను, ధనిక రైతుల నుండి కింది స్థాయిలోని వ్యవసాయ కార్మికుల వరకు రైతాంగంలోని అన్ని సెక్షన్లను ఐక్యం చేసింది. కార్మిక వర్గం మద్దతు పొందడం ద్వారా కార్మిక-కర్షక ఐక్యతను పెంపొందించింది. హిందువులు, ముస్లింలు ఏకమై పోరాటంలో పాల్గనడం ద్వారా స్వాతంత్ర్య పోరాటాన్ని తలపించే రీతిలో హిందూ-ముస్లిం ఐక్యతకు వేదికైంది. ఆ విధంగా ఉత్తరాది రాష్ట్రాల్లో రైతాంగాన్ని, ప్రజలను మతాల వారీ విడగొట్టడానికి ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి చేపట్టిన ఎజెండాకు చెక్ పెట్టింది. బిజెపి ప్రభుత్వ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నిటినీ నిలపడం ద్వారా ఉద్యమం రాజకీయ ప్రాముఖ్యతను కూడా సంతరించు కున్నది. నల్లచట్టాలను రద్దు చేయడమో, లేక బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించడమో జరిగేదాకా పోరాటాన్ని విరమించేది లేదన్న గట్టి పట్టుదలతో దాదాపు పదిమాసాలకు పైగా పోరాటాన్ని కొనసాగుతున్నది.

ఈ క్రమంలోనే భారత్ బంద్ జరిగింది. బంద్‌లో రైతాంగానికి మద్దతుగా కార్మికులు సమ్మెచేయడం చిన్న వృత్తిదారులు, ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు వగైరా అన్ని సెక్షన్ల ప్రజలు మద్దతివ్వడం ప్రాధాన్యత సంతరించుకున్న అంశం. బహుశా ఇటీవలి కాలంలో గ్యాసు, పెట్రోల్, ఇతర నిత్యావసర సరుకుల ధరలు పెంచడం, కోవిడ్ నేపథ్యంలో ప్రజల జీవన ప్రమాణాలు పడిపోవడం వంటి కారణాలు కూడా ఈ మద్దతు వెనుక ఉండవచ్చు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరించేస్తున్న రీత్యా ఈ బంద్‌పిలుపుకు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీతో సహా అనేక రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న అధికారంలో లేని ప్రాంతీయ పార్టీలు మద్దతివ్వడం కూడా ప్రాధాన్యతగల అంశమే. ఇదంతా భారత దేశంతో సహా పెట్టుబడిదారీ ప్రపంచాన్ని మొత్తంగా కుదిపేస్తున్న సంక్షోభానికి, ఈ సమయంలో సైతం కార్పొరేట్లకే కొమ్ముకాసే హిందూత్వ మితవాద భావజాలానికి వ్యతిరేకంగా లౌకికతత్వం, స్వావలంబన, ఫెడరలిజం, సామాజికన్యాయం వంటి సూత్రాల ప్రాతిపదికన ఒక ప్రత్యామ్నాయం ఏర్పాటుకు దారితీయాల్సి ఉంది. అందుకు కావలసిన సామాజిక రాజకీయ మథనంలో ఈ బంద్ ఒక కీలక ఘట్టం కాగలదు.

మతతత్వంతో కూడిన పచ్చి మితవాద రాజకీయాలు, ఆర్థికం రంగంలో బడా కార్పొరేట్లకు దేశ సంపదను బాహాటంగా దోచిపెట్టే విధానాలు, మరోవైపు భారత దేశాన్ని విదేశీ సామ్రాజ్యవాదుల ముందు మోకరిల్లింప జేసే విదేశాంగా విధానాలతో బిజెపి ప్రభుత్వం గత ఏడేళ్ల కాలంలో దేశాన్ని పెనం మీద నుండి పొయ్యిలోకి తోసేసింది. పూర్తి మెజారిటీతో రెండవసారి అధికారంలోకి వచ్చిన తరువాత అది మరింత బరితెగించి వ్యవహరిస్తోంది. అటువంటి ప్రజావ్యతిరేక ప్రభుత్వానికి అన్ని సెక్షన్ల ప్రజలు, దాదాపు అన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు పాల్గన్న భారత్ బంద్ ఒక హెచ్చరికగా పనిచేయాలి. ఈ హెచ్చరికను పాలకులు ఖాతరు చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రభుత్వాన్ని గద్దె దించడమొక్కటే తమ డిమాండ్ల సాధనకు మార్గం అవుతుంది.

ఈ మాసం ముఖ్యాంశం

# నగదీకరణ ముసుగులో ప్రైవేటీకరణ



రచయిత సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు

**బివి రాఘవులు**

కేంద్ర ఆర్థికశాఖా మంత్రి శ్రీమతి నిర్మలాసీతారామన్ గత నెల 23వ తేదీన ప్రభుత్వ ఆస్తుల నగదీకరణ పైప్‌లైన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు 2021-22 బడ్జెట్టులో చేసిన ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలకు అనుగుణంగా 'నీతి ఆయోగ్' ఆస్తుల నగదీకరణకు సంబంధించి రెండు సంపుటాలతో కూడిన ప్రతిపాదనలు జేసింది. ఇందులో రోడ్లు, విద్యుత్తు, సహజవాయువు, పెట్రోలియం ఉత్పత్తుల పైపులైన్లు, గోడౌన్లు, రైల్వే ఆస్తులు, టెలికాం టవర్లు, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్, విమానాశ్రయాలు, ఓడరేవులు, స్టేడియంలకు సంబంధించిన ఆస్తులు వున్నాయి. ఈ ఆస్తులను 2021తో ప్రారంభించి నాలుగు సంవత్సరాలలో నగదీకరణ జేస్తారు. దీని మూలంగా 6 లక్షల కోట్ల ఆదాయం సమకూరుతుందని, ఆ మొత్తాన్ని మౌలిక సదుపాయాలకు ఖర్చుచేస్తామని, నిరర్థక ఆస్తులను ఉపయోగంలోకి తేవడానికి వీలవుతుందని, ప్రైవేటురంగ పెట్టుబడులు తరలివస్తాయని, ఆర్థిక అభివృద్ధి, ఉపాధి కల్పన జరుగుతుందని ప్రకటించారు.

నగదీకరణను సమర్థించుకుంటూ ఆర్థిక మంత్రి చెప్పినవన్నీ ప్రజలను మభ్య పెట్టటానికి ఉద్దేశించిన కల్లబొల్లి కబుర్లు. నగదీకరణ అనేది "ప్రైవేటీకరణ"కు మరొక రూపం మాత్రమే. కాకపోతే చేదు మాత్రకు తీపిపూయడం లాంటిది. నగదీకరణ అంటే ఆస్తులను అమ్మడం కాదని, ఆస్తుల యాజమాన్యం ప్రభుత్వం వద్దే వుంటుందని బిజెపి చెబుతున్నది. 20, 30, 50 సంవత్సరాలకు లీజుకిస్తూ, లీజు కాలం అయిపోయిన తర్వాత మరల లీజును పొడిగిస్తూ వుంటే ఆస్తుల యాజమాన్యం నామకా ప్రభుత్వం పేరుతో ఉన్నా వాస్తవంలో అవి ప్రైవేటు పరమైనట్టే. అందుకే నగదీకరణ ప్రైవేటీకరణకు ముద్దు పేరు అంటున్నాం.

'నగదీకరణ' కార్యక్రమం ద్వారా 6 లక్షల కోట్లు వస్తాయని గొప్పలు చెప్పుకోవడం పెద్ద మోసం. 'నగదీకరణ' చెయ్యదల్చుకున్న ఆస్తుల విలువ ఎంత, వాటి నుండి ఆదాయం ఇంత వరకు ఎంత వస్తున్నది, ఇప్పుడు మార్కెట్టులో ఆస్తులను లీజుకిస్తే ఎంత రాబడి వస్తుంది అన్న వివరాలు బహిరంగ పర్చలేదు. ఎంతో రాబడి రాగల ఆస్తులను కారుచౌకగా పెట్టుబడిదారులకు అప్పగించి, తమ అనుంగు మిత్రులకు దోచిపెట్టే స్కీం కాబట్టే ఇంత గోప్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. ఈ స్కీం గురించి పార్లమెంటులో చర్చించలేదు. నిపుణులతో అధ్యయనం జేయించలేదు. ఏ మాత్రం పారదర్శకత లేకుండా ప్రభుత్వం ముందుకు పోతున్నది.

ఈ పథకం మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పడుతుందని ప్రభుత్వం చెబుతున్నది. ఆస్తులను లీజుకు తీసుకున్న ప్రైవేటు సంస్థలు భారీగా పెట్టుబడులను పెడతాయని, తద్వారా నిరర్థకంగా, నిరుపయోగంగా వున్న ఆస్తులు పూర్తిగా వినియోగంలోకి వస్తాయని, వాటి నాణ్యత పెరుగుతుందని ప్రభుత్వం చెబుతున్నది. కాని పెట్టుబడిదారులు లాభం కోసం వస్తారు. ఆస్తుల నుండి ఎంతలాభం, ఎంత తొందరగా గ్రహిద్దామా అని ఆలోచిస్తారు. లాభం పిండుకుని ఆస్తులను నిరర్థకం జేసి, ఆ తర్వాత వాటిని వదిలేస్తారు. అన్ని దేశాల అనుభవం ఇదే.

నగదీకరణ ద్వారా వచ్చే డబ్బును మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఖర్చుజేస్తామని చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన దాని ప్రకారం మౌలిక సదుపాయాల కల్పనకు 111 లక్షల కోట్లు కావాలి. అందులో 6 లక్షల కోట్లు ఏ మూలకు చాలవు. ఈ పేరుతో 'నగదీకరణ'ను సమర్థించు కోవడం 'హాస్యాస్పదం'. వున్న మౌలిక సదుపాయాలను ప్రైవేటు పెట్టుబడి కప్పగించి, కొత్త మౌలిక సదుపాయాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మిస్తామని చెప్పడం విడ్డూరంగా వుంది. వాటిని కూడా ప్రైవేటు కప్పగించడానికైతే ప్రభుత్వం నిర్మించడమెందుకు? ప్రైవేటు రంగాన్నే మౌలిక సదుపాయాలను నిర్మించమని అడగవచ్చు కదా!

వాస్తవ మేమిటంటే మౌలిక సదుపాయాల నిర్మాణానికి ప్రైవేటు రంగం ముందుకు రాదు. కాని ఈ రంగంలో కూడా దానికి లాభం కావాలి. అందుకు ప్రజల సొమ్ముతో ప్రభుత్వం నిర్మించి సిద్ధం చేస్తే బరువు బాధ్యత లేకుండా ప్రైవేటు సంస్థలు లాభం జేసుకోవచ్చు. ఇదే నగదీకరణ అసలు స్వరూపం. ప్రభుత్వం 'నగదీకరణ' కిందకు తెచ్చిన ఆస్తులను 'బరువు బాధ్యతలు లేని' (రిస్క్‌ఫ్రీ) ఆస్తులని పేర్కొనడం లో ఆంతర్యం ఇదే. లీజుకు తీసుకున్న తర్వాత ప్రకృతి విపత్తుల కారణంగా (తుఫాను భూకంపాలు, వరదలు, పెనుగాలులు, లాక్‌డౌన్లు) మౌలిక సదుపాయాలకు నష్టం జరిగితే ఈ ప్రైవేటు సంస్థలు బాధ్యత తీసుకోవు. వాటిని అత్యవసరంగా పునరుద్ధరించే పని ప్రభుత్వం మీద పడుతుంది. అంటే ఖర్చు ప్రభుత్వానిది, సంపాదన పెట్టుబడిదార్లది.

పై రంగాలు తరతమ భేదాలు లేకుండా ప్రజలందరికీ అవసరమైన సేవలు అందించేవి. సామాన్య ప్రజలకు కూడా నిత్యం అవసరమైనవి. వీటిని కూడా వదిలి పెట్టకుండా లాభాలు జేసుకోవడానికి ఈ రంగాలలోని అత్యంత లాభదాయకంగా వుండే భాగాలను మోడి ప్రభుత్వం ప్రైవేటు కార్పొరేట్లకు అప్పగిస్తున్నది. ఈ రంగాల స్వభావం రీత్యా గుండుగుత్తగా కొనడానికి ప్రైవేటు పెట్టుబడి ముందుకు రాదు. కాబట్టి దొడ్డిదారిన 'నగదీకరణ' పేరుతో పెట్టుబడిదార్లకు ధారాదత్తం జేస్తున్నది.

❝ ఇప్పుడు కూడా రోడ్లను ప్రైవేటు వారికి అప్ప గించటం, వారు టోల్‌టాక్స్ వసూలు చేయటం ఉంది. కాని తాజాగా లీజుకిచ్చే విధానంలో లీజుకు తీసుకున్న వారు ఎన్ని టోల్‌గేట్లు అయినా ఏర్పాటు చేసుకోవచ్చు. ఎంతైనా రుసుం వసూలు చేసుకోవచ్చు. ఎవరి వద్ద వసూలు చేయాలి, ఎవరి వద్ద చేయకూడ దనేది వారి ఇష్టాన్ని అనుసరించి ఉంటుంది. ❞




జాతీయ నగదీకరణ పైప్‌లైన్‌లో మౌలిక సదుపాయాలన్నీ ప్రయివేటీకరించబడతాయి

మౌలికసదుపాయాల విస్తరణకు 'నగదీ కరణ' అవసరం అని కొంతమంది మేధావులు ప్రభుత్వంతో గొంతు కలుపుతున్నారు. విమర్శకులను మౌలిక సదుపాయాల అభివృద్ధికి, దేశ ప్రయోనాలకు వ్యతిరేకులుగా చిత్రీకరిస్తు న్నారు. ఈ సందర్భంగా చైనాతో పోలిక జేస్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పన విషయంలో చైనా ఎంతో ముందుకు పోయిం దని, చైనాను అధిగమించాలంటే మౌలిక సదుపాయాల నగదీకరణ అవసరమని వాదిస్తున్నారు. ఈ వాదన బోడిగుండుకు మోకాలిచిప్పకు ముడి పెట్టడంలా వుంది. మౌలికంగా దేశం అభివృద్ధి చెందాలంటే మౌలిక సదుపాయాల అభివృద్ధి అవసరం అనేదాంట్లో సందేహం లేదు. కాని దానికి 'నగదీకరణ' పరిష్కారం కాదు. చైనాలో మౌలిక సదుపాయాలు కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల ఆధ్వర్యంలో, వాటి పెట్టుబడులతో అభివృద్ధి చెందాయి. ప్రైవేటురంగ ప్రమేయం నామ మాత్రం. చైనాయే కాదు, ప్రపంచంలో అనేక దేశాలు మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వరంగానికి పెద్ద పీట వేశాయి. మన పాలకులు వున్న ప్రభుత్వ రంగాన్ని కూడా 'నగదీకరణ' పేరుతో వదిలించు కుంటున్నారు. ఇది ఆత్మహత్యా సదృశం.

### రంగాలవారీగా నగదీకరణ

ఇప్పుడు నగదీకరణ ప్రతిపాదనలను రంగాలవారీగా క్లుప్తంగా పరిశీలిద్దాం. 26 వేల కిలోమీటర్ల నాలుగు లైన్ల రోడ్లను లీజుకిస్తున్నారు. ఆంధ్రాలో విజయవాడ–చిలక లూరిపేట, తెలంగాణాలో హైదరాబాద్– బెంగ ళూరు, కడ్తల్ – ఆర్మూర్, అడ్లూరు – ఎల్లారెడ్డి, చేగుంట–బోయినపల్లి రోడ్లు లీజుకిస్తున్న వాటిలో ఉన్నాయి. ఇప్పుడు కూడా రోడ్లను ప్రైవేటు వారికి అప్పగించటం, వారు టోల్‌టాక్స్ వసూలు చేయటం ఉంది. కాని తాజాగా లీజుకిచ్చే విధానంలో లీజుకు తీసుకున్న వారు ఎన్ని టోల్‌గేట్లు అయినా ఏర్పాటు చేసుకోవచ్చు. ఎంతైనా రుసుం వసూలు చేసుకోవచ్చు. ఎవరి వద్ద వసూలు చేయాలి, ఎవరి వద్ద చేయకూడ దనేది వారి ఇష్టాన్ని అనుసరించి ఉంటుంది. దానిపై ప్రభుత్వానికి ఎటువంటి అదుపు ఉ ండదు. రోడ్లన్ని ప్రజలవని మనం అనుకుం టాం. కాని ఇపుడు ప్రజల ఆస్థిని ఒక్క పైసా కూడా ఖర్చు లేకుండా లాభం చేసుకోవటానికి ప్రైవేటు వారికి ఇస్తున్నారు. మైనారిటీలను ద్వితీయశ్రేణి పౌరులుగా చూస్తున్నారని మనం అనుకుంటున్నాం. ఇపుడు ఈ రోడ్లను వాడు కోవడానికి ప్రజలందరికీ సమాన అవకాశాలు ఉండవు.

29 వేల కిలోమీటర్ల విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్లను ప్రైవేటీకరిస్తున్నారు. అవి పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ వద్ద ఉన్నాయి. కేంద్రం తీసుకుం టున్న ఈ చర్యలతో విద్యుత్ ప్రైవేటీకరణ సంపూర్ణమౌతుంది. ప్రజలపై విపరీతమైన భారాలు పడతాయి. భారాలు పడినా చెల్లించ గలిగినవారుంటారు. కాని చెల్లించలేని వారు విద్యుత్‌కు దూరమై పాతకాలంలో వలె దీపాలు పెట్టుకొని, పొద్దుగూకగానే పడుకొనే పరిస్థితి వస్తుంది.

ప్రభుత్వం ఇప్పటి వరకు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల జోలికిరాలేదు. ఇపుడు 600 మెగావాట్ల సామర్థ్యం గల జల విద్యుదుత్పత్తి కేంద్రాలను కూడా ప్రైవేటీకరణ చేస్తామంటు న్నారు. జల విద్యుత్ ఉత్పత్తికి ఖర్చేమీ ఉ ండదు. కాబట్టి ఆ కేంద్రాలను ప్రైవేటు వారికిస్తే వారికి విపరీతమైన లాభాలొస్తాయి. కాని మన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలన్నీ వ్యవసాయంతో ముడిపడివున్నాయి. ఇపుడు జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ప్రభుత్వం చేతిలో ఉన్నాయి కాబట్టి వ్యవసాయ అవసరాలను పరిగణనలోకి తీసుకొని, విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండే సమయంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నది. జలవిద్యుత్ ఉ త్పత్తి కేంద్రాలు ప్రైవేటు వారి చేతిలోకి వెళితే వ్యవసాయ అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా, తమ లాభాల కోసం జలవిద్యు త్‌ను ఉత్పత్తి చేసి నీటిని కిందికి వదులుతారు. సాగర్, పులిచింతల నిండుగా ఉన్నపుడు శ్రీశైలంలో జలవిద్యుత్‌ను ఉత్పత్తి చేసి, నీటిని కిందికి వదిలితే నీరంతా సముద్రం పాలవటమే కదా! ఆ విధంగానే సాగర్‌లో కూడా చేస్తే జలాశయాలు ఖాళీ అవుతాయి. ఉదాహరణకు సాగర్, శ్రీశైలం ఖాళీ అయిన తర్వాత వ్యవసాయ అవసరాలకు నీరు లేకుండా పోతుంది. ఆ విధంగా ఇది కేవలం విద్యుత్ సమస్య మాత్రమే కాకుండా వ్యవసాయం, రైతాంగ సమస్య కూడా అవుతుంది.

తర్వాత పెట్రోలియం ఉత్పత్తులను రవాణా చేసే 3,930 కి.మీ పైప్‌లైన్‌లను, 8,154 కి.మీ సహజవాయు పైప్‌లైన్లను లీజుకు ఇస్తున్నారు. ఆంధ్రలోని ఐదు వందల కిలో మీటర్ల పైప్‌లైన్‌లు కూడా దీనిలో ఉన్నాయి. వీటిలో

> **❝ ఇవన్నీ ప్రైవేటు వారికి ఇచ్చిన తర్వాత ఏం జరుగుతుంది? మొదటిది ధరలు విపరీతంగా పెరుగుతాయి. రెండవది వీటిలోని లక్షలాది మంది ఉద్యోగులను ఉంచుతారని గ్యారంటీ లేదు. మూడవది ఇప్పటి వరకు ఇవన్నీ ప్రభుత్వరంగంలో ఉన్నాయి కాబట్టి ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రిజర్వేషన్లు అమలు జరిగాయి. ప్రైవేటు వారి చేతిలోకి పోతే రిజర్వేషన్లు ఉండవు. ❞**

నుండి పెట్రోలు, గ్యాస్‌ను తీసుకెళితే ప్రైవేటు వారికి ఛార్జీలు చెల్లించాల్సివస్తుంది. ఇప్పటికే పెట్రోలు, డీజిల్, గ్యాస్ తదితరాల ధరలు విపరీతంగా పెరిగాయి. దీనితో మరింతగా పెరుగుతాయి.

400 రైల్వేస్టేషన్లను ప్రైవేటీకరిస్తున్నారు. 90 పాసింజరు రైళ్ళు, 265 గూడ్స్‌షెడ్‌లు ప్రైవేటువారికి ఇవ్వబోతున్నారు. ప్రతి పట్టణంలోనూ రైల్వే కాలనీలను గుర్తించి, డెవలప్‌మెంట్ పేరుతో వాటిని తీసుకొని, ఉద్యోగులను అక్కడ నుండి పంపివేస్తారు. రైల్వేస్టేడియంలను ప్రైవేటువారికి ఇస్తారు. వారికిచ్చిన తర్వాత రైల్వే ఉద్యోగులతో పాటు సాధారణ పౌరులకు కూడా డబ్బు ఇస్తేనే ప్రవేశం ఉండవచ్చు. లేదా వాటిని మాల్స్‌గా తయారు చేయవచ్చు. దురంతో, శతాబ్ది, రాజధాని లాంటి బాగా లాభాలొచ్చే 90 రైళ్ళను ప్రైవేటీకరిస్తున్నారు. రైల్వే రూట్లలో కొన్ని లాభాలొచ్చేవి, కొన్ని నష్టాలొచ్చేవి ఉన్నాయి. ఇపుడు లాభాలొచ్చే వాటి నుండి నష్టాలొచ్చే వాటికి క్రాస్ సబ్సిడీ ఇస్తున్నారు. లాభాలొచ్చేవన్నీ ప్రైవేటు వారికి వెళ్ళిన తర్వాత నష్టాలొచ్చేవి ప్రభుత్వం వద్ద మిగులుతాయి. కాబట్టి క్రాస్ సబ్సిడీ ఇవ్వగలిగిన శక్తి రైల్వేలకు ఉండదు.

మూడు లక్షల కిలోమీటర్ల ఆప్టిక్ ఫైబర్ నెట్‌వర్క్‌ను14,917 టెలికాం టవర్లను లీజుకు ఇవ్వబోతున్నారు. జియో వారు వాటిని తీసుకోవటానికి సిద్ధంగా ఉన్నారు. 25 విమానాశ్రయాలను, ఇందులో ఆంధ్ర ప్రదేశ్‌లోని రాజమండ్రి, విజయవాడ, తిరుపతిలను ప్రైవేటువారికి ఇవ్వబోతున్నారు. నాలుగు వేల టవర్లను కూడా లీజుకు ఇవ్వబోతున్నారు. 9 పెద్ద ఓడరేవులలో 31 బెర్తులను, అందులో విశాఖపోర్టులో తొమ్మిది బెర్తులను లీజుకు ఇవ్వబోతున్నారు.

తర్వాత 2 కోట్ల10 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన ఎఫ్‌సిఐ, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌ల గోడౌన్లను ప్రైవేటీకరిస్తున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం రైతాంగం నుండి సేకరించిన ఆహారధాన్యాలను ఈ గోడౌన్లలో నిల్వచేసి, ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. గోడౌన్లు ప్రైవేటు పరమైతే ప్రభుత్వం ఆహార ధాన్యాలను సేకరించటం ఉండదు. ప్రభుత్వం వద్ద ఆహారధాన్యాలు ఉండవు కాబట్టి ప్రజలకు తక్కువ ధరలకు అందించటం ఉండదు. ఒకవేళ ప్రజలకు అందించాల్సి వస్తే ప్రభుత్వం వద్ద ఉండవు కాబట్టి పెట్టుబడిదారుల నుండి కొనుగోలు చేసి, పంపిణీ చేస్తుంది. అపుడు ప్రజలకు పంపిణీ చేసినట్లూ ఉంటుంది. పెట్టుబడిదారులకు లాభాలూ వస్తాయి. ఇపుడు ప్రజలకు పంపిణీ అవుతున్నా, పెట్టుబడిదారులకు లాభాలు రావటం లేదు. ఈ గోడౌన్లన్నింటినీ తీసుకోవటానికి అదాని వంటివారు సిద్ధంగా ఉన్నారు. వారు వ్యవసాయరంగం, వ్యవసాయ మార్కెట్లలోకి ప్రవేశించాలను కుంటున్నారు. గోడౌన్లు నిర్మించే శ్రమలేకుండా ఇవన్నీ వారి చేతిలోకి వెళ్ళిపోతాయి. వీటిలో పనిచేస్తున్న హమాలీలు, రైల్వేలలో పనిచేస్తున్న ఉద్యోగుల ఉపాధికి ప్రమాదం వస్తుంది.

త్వరలో జాతీయ భూ నగదీకరణ కార్పొరేషన్‌ను ఏర్పాటు జేయనున్నారు. కేంద్ర ప్రభుత్వశాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల వద్ద వున్న ఖాళీ భూమిని ఈ కార్పొరేషన్ తీసుకుంటుంది. ఈ భూమిని రియల్ ఎస్టేటు ఇతర అవసరాలకు ప్రైవేటు సంస్థలకు, వ్యక్తులకు అమ్ముతుంది లేదా లీజుకిస్తుంది. ఈ సంస్థ సేవలను కేంద్రమే కాకుండా రాష్ట్రాలు కూడా వినియోగించుకోవచ్చు. టెలికాం కంపెనీలు, హెచ్.ఎం.టిల వద్ద వున్న 2,000 ఎకరాల భూమితో ఈ కార్పొరేషన్ పని ప్రారంభమయ్యే అవకాశం వుది.

నగదీకరణ కార్యక్రమాన్ని కేంద్రస్థాయికే పరిమితం జేయ్యాలని మోడీ ప్రభుత్వం అనుకోవడం లేదు. తమతమ రాష్ట్రాలలో నగదీకరణ చేపట్టమని రాష్ట్ర ప్రభుత్వాలకు సలహా ఇచ్చింది. ఇందుకోసం రాష్ట్రస్థాయి నోడల్ ఆఫీసర్లను నియమించాలని కోరింది. ఇప్పటికే రాష్ట్రాల నోడల్ ఆఫీసర్లకు నీతి ఆయోగ్ వారు 'నగదీకరణ' పై ఒక కార్యశాలను కూడా నిర్వహించారు.

రాష్ట్ర స్థాయితో ఆగకుండా, పంచాయితీ స్థాయిలో వనరుల నగదీకరణను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం గ్రామ సభల సంవత్సర పని కాలెండర్ వివరిస్తూ ఒక సూచన ప్రతాన్ని పంపింది. అందులో గ్రామ స్థాయిలో పంచాయితీ ఆధీనంలో వున్న ఆస్తులను నగదీకరించు కోవానికి పూనుకోవాలని కోరింది.

పైన వివరించిన అంశాలను గమనిస్తే బి.జె.పి ప్రభుత్వం ప్రైవేటీకరణ, నగదీకరణ పేరుతో దేశంలో అన్ని స్థాయిల్లోని ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు పెట్టుబడి వశం జేయడానికి సాధ్యమయినంత వేగంగా అన్ని రంగాలలో ప్రభుత్వ పాత్రను ఉపసంహరించడానికి పూనుకున్నదని విదితం అవుతున్నది.

**నగదీకరణ పర్యవసానాలు**

ఇవన్నీ ప్రైవేటు వారికి ఇచ్చిన తర్వాత ఏం జరుగుతుంది? మొదటిది ధరలు విపరీతంగా పెరుగుతాయి. ప్రైవేటు వారు లాభం కోసం లీజుకు తీసుకున్నారు కాబట్టి యూజర్ ఛార్జీలు వేస్తారు. అందువలన ధరలు పెరుగుతాయి.

రెండవది వీటిలో లక్షలాది మంది ఉద్యోగులు ఉన్నారు. ప్రైవేటు వారు ఉద్యోగులను ఉంచుతారని గ్యారంటీ లేదు. పదిమందికి ఉద్యోగాలు పోతే ఇరవై మందికి కొత్తగా ఉద్యోగాలు వస్తాయని కేంద్రమంత్రి చెబుతున్నాడు. అంటే ఉద్యోగులను ప్రైవేటు వారు ఉంచరని స్పష్టమౌతున్నది.

మూడవది ఇప్పటి వరకు ఇవన్నీ ప్రభుత్వరంగంలో ఉన్నాయి కాబట్టి ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రిజర్వేషన్లు అమలు జరిగాయి. ప్రైవేటు వారి చేతిలోకి పోతే రిజర్వేషన్లు ఉండవు. పర్మినెంటు ఉద్యోగాలు ఉండవు. అన్నీ కాంట్రాక్టు ఉద్యోగాలే ఉంటాయి.

ఈ అమ్మకం ద్వారా ఎవరు లబ్దిపొందా తారు? సాధారణ పౌరులు, మనలాంటి వారు వీటిని లీజుకు తీసుకోవటం, కొనటం చేయగలరా? కార్పొరేట్ సంస్థలు మాత్రమే వీటిని కొనగలవు. వీటిని కొనుగోలు చేసిన తర్వాత ప్రతిరంగంలోనూ కొద్దిమంది గుత్తాధిపత్యం సాధించటానికి అవకాశం ఏర్పడుతుంది. టెలికాం రంగంలో జియో, ఎయిర్

(మిగతా 9వ పేజీలో)

**పార్టీ నిర్మాణం**

# విప్లవ పార్టీలో ఆగ్జిలరీల నిర్మాణం నాయకత్వ సమస్యే



రచయిత సిపిఐ(ఎం) ఆంధ్ర ప్రదేశ్ కమిటీ కార్యదర్శి

**పెనుమల్లి మధు**

రాష్ట్రంలో అఖిల భారత మహాసభలకు సన్నాహాలు జరుగుతున్నాయి. వివిధ స్థాయిల్లో పార్టీ శాఖా మహాసభలు పూర్తికావస్తున్నాయి. ఈ సందర్భంగా అనేక జిల్లాల్లో పార్టీలో శాఖల నిర్వహణలోనూ, ఆగ్జిలరీ శాఖల ఏర్పాటులోనూ అనేక బలహీనతలు కనిపిస్తున్నాయి. ఈ బలహీనతలు ఎందువల్ల ఏర్పడుతున్నాయి, పరిష్కారం కాకుండా ఎందువల్ల కొనసాగుతున్నాయి అని లోతుగా పరిశీలించినప్పుడు ఈ ఇది ప్రధానంగా మన పార్టీలో నాయకత్వ సమస్యే తప్ప మరొకటికాదని అర్ధమవుతుంది.

వస్తుగతంగా పరిశీలిస్తే శాఖల పని సరిగా లేకపోవడం, అసలు వార్షిక సమావేశాలు నామమాత్రంగా ఉండడం లాంటి వైఫల్యాలకు నాయకత్వమే బాధ్యత వహించాలి. శాఖల బాధ్యత ఏమిటి అని ప్రశ్నించుకోవచ్చు. శాఖ కార్యదర్శి, శాఖ సభ్యులు తమ బాధ్యతలు సరిగా నిర్వహించనప్పుడు నాయకత్వ పర్యవేక్షణ కీలకమన్నది కలకత్తా ప్లీనం ఆదేశం. ఇలాంటి లోపానికి కారణాన్ని గుర్తించకపోవడమే ఎక్కువ శాఖల్లో పని క్షీణించడానికి కారణం. స్థానిక ప్రజా సమస్యలు తీసుకోవడం, కృషిని కొనసాగించడం, ఫలితాలు సాధించడం, కొత్తగా వస్తున్న వారికి బాధ్యతలు అప్పగించడం నిరంతరాయంగా సాగించాల్సిన పని. ఈ పనిలో లోపం జరిగితే దాన్ని చక్కదిద్దాల్సిన బాధ్యత జిల్లా కమిటీలదీ, మధ్యంతర కమిటీలదీ. అందువల్లనే శాఖలు, ఆగ్జలరీ శాఖలు సరిగ్గా పనిచేయడం, చేయకపోవడం అనేది నాయకత్వ సమస్య తప్ప మరొకటి కాదు.

**ఉద్యమాలు, పోరాటాలతోనే ఆగ్జిలరీల నిర్మాణం**

ఆగ్జిలరీల నిర్మాణం కోటాలు ఇచ్చి పనిచేయించేదికాదు. కర్తవ్య ప్రబోధంతోనే జరిగేది కాదు. ఇప్పటికే లూజ్ సభ్యత్వం బెడద పార్టీని పట్టి పీడిస్తోంది. కనుక ఇది ఉద్యమాలు, పోరాటాలతో పాటు రాజకీయ నిర్మాణ కృషితో ముడిపడి ఉంటుంది. ఈ వాస్తవాన్ని నాయకత్వం గుర్తించి వ్యవహరించాలి. పార్టీ సభ్యులు క్రియాశీలంగా లేకపోవడం, ప్రమాణాలు పాటించకపోవడం విప్లవపార్టీ నిర్మాణానికి సూటవ్వదు. కనుక కలకత్తా ప్లీనం పేర్కొన్నట్లు ప్రజా ఉద్యమాలకు ఇచ్చే ప్రాధాన్యతతో లింకయి ఉంది. వామపక్ష ప్రత్యామ్నాయం మొదటి ప్రాధాన్యత అన్న రాజకీయ అంశంతో ముడిపడి ఉంది.

ఆగ్జిలరీ గ్రూపులు సరిగా జరగడానికి శాఖలో ఒక సభ్యుడిని కార్యదర్శిగా పెట్టి శాఖలు నిర్వహించబడు తున్నాయి. ఈ ఆగ్జిలరీ శాఖ సరిగా జరుగుతుందా లేదా అన్న పర్యవేక్షణ శాఖదే అయినా పై కమిటీ బాధ్యుడు ఈ వైఫల్యానికి బాధ్యత వహించాల్సి ఉందన్న అంశాన్ని పార్టీ నాయకత్వం గుర్తించాలి. అప్పుడే ఆగ్జిలరీల పని కొంతవరకైనా మెరుగుపడుతుంది. ప్రజా ఉద్యమాల వైఫల్యానికి, ప్రజా పునాది దెబ్బ తినడానికి ప్రధాన బాధ్యత పార్టీ పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ స్వీకరించినట్లుగానే పార్టీ శాఖ సరిగా పనిచేయకపోవడానికి, ఆగ్జిలరీలు సరిగా జరగకపోవడానికి పై కమిటి బాధ్యత వహించాలి. జిల్లా కమిటీల పర్యవేక్షణ ఇందులో కీలకమే.

ప్రజాఉద్యమాలకూ, పార్టీ శాఖలు క్రియాశీలంగా పనిచేయడానికీ, యువత పార్టీలోకి రావడానికీ–ఆగ్జలరీ శాఖల ఏర్పాటుకూ మధ్య ఉన్న సంబంధాన్ని మనం అర్థం చేసుకోవాలి. ఇవన్నీ ఒకదానిపై మరొకటి ఆధారపడే అంశాలు. ఏది ఎప్పుడు ఎలా చేయాలో పై కమిటీలు పర్యవేక్షించినప్పుడు మాత్రమే పార్టీ నిర్మాణం విస్తరిస్తుంది. పార్టీలోకి కొత్త వారు వస్తారు. వారితో ఆగ్జలరీ గ్రూపులు ఏర్పడతాయి. అలాగే పార్టీ శాఖల్లో కూడా క్రియాశీలంగా పనిచేసే కొత్తవారిని శాఖా కార్యదర్శులుగా ఎన్నుకోవడం కూడా పార్టీ నిర్మాణ విస్తరణకు తోడ్పడుతుంది. ఈ విషయాన్ని అర్ధం చేసుకోడానికి నెల్లూరు పార్టీ మహాసభల్లో వచ్చిన అనుభవాలు కొంతవరకు ఉపయోగపడతాయి.

**(1) పార్టీ రెన్యువల్స్, శాఖా మహాసభలు :**

= నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో పార్టీని రెండు కమిటీలుగా విభ జించడం జరిగింది. అందులో నెల్లూరు నగర కమిటి 330 మంది పార్టీ సభ్యుల తోనూ, నెల్లూరు రూరల్ కమిటి 354 మంది తోనూ పని చేస్తున్నాయి. నెల్లూరు నగర మహాసభ పూర్తయింది. ఈ కమిటీ అనుభవాలను పరిశీలిద్దాం.

= కలకత్తా ప్లీనం డైరెక్షన్ ప్రకారం పార్టీలో లూజ్ మెంబర్‌షిప్ నివారించడం, 5 కనీస కర్తవ్యాలు అమలు జరిపేవారితోనే పార్టీ శాఖలు ఏర్పరచడం వంటి కర్తవ్యాల నిర్వహణకు ఈ కమిటి పరిధిలో ఈ కాలంలో ప్రయత్నాలు జరిగాయి.

= 330 మంది పార్టీ సభ్యులు నగరం లోని 14 నివాస ప్రాంత శాఖలు, 19 ప్రజా సంఘాల, వృత్తిసంఘాల శాఖల్లో ఉన్నారు.

= ప్రతి సంవత్సరం డిసెంబర్ మాసంలో సమీక్షలు జరిపే అలవాటు గత కొన్ని సంవత్సరాలుగా అమలులో వుంది. 2020 డిసెంబరులో వార్షిక సమీక్షా సమావేశాలు జరిగాయి. మరో 7 నెలల తరువాత శాఖా మహాసభలు జరిగాయి.

**(2) యువత శాఖా కార్యదర్శులుగా :**

= 2021 మహాసభల సందర్భంగా మొత్తం

> **"లూజ్ మెంబర్‌షిప్ కారణంగా కార్యక్రమాల్లో అందరూ పాల్గొనడం లేదు. ఈ రీత్యా పార్టీ సభ్యుల క్రియాశీలత పెంచడం ముఖ్యమని నగర కమిటి గత మహాసభలో భావించింది. ఈ రీత్యా స్థానిక సమస్యలపై కృషి ముమ్మరంగా సాగించడం అవసర మని పార్టీ శాఖలకు నగర కమిటీ దిశానిర్దేశం చేసింది. దీన్ని అమలు చేయడానికి నగర కమిటి (మధ్యంతర కమిటి) బాధ్యత వహించా లని నిర్ణయం జరిగింది. ఈ నేపథ్యంలో నగర కమిటీ శాఖల పని పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇచ్చింది."**

33 శాఖలకుగాను 28 శాఖలకు కొత్తవారు, యువకులు శాఖా కార్యదర్శులుగా ఎన్నిక య్యారు.

= శాఖాసభ్యులలో కూడా 56.7 శాతం మంది 35నుండి 45 సంవత్సరాలమధ్య వయస్సు ఉన్నవారు ఉన్నారు.

= 2021లో పార్టీ సభ్యుల్లో యువకులు 184 మంది, మహిళలు 56 మంది, ఎస్.సిలు 60 మంది, ఎస్.టిలు 18 మంది, ముస్లింలు 66 మంది, క్రిస్టియన్స్ నలుగురు ఉన్నారు.

= 2020 వార్షిక సమీక్షల సందర్భంగాను, జూన్, జులై, ఆగస్టులలో జరిగిన శాఖ మహాసభల సందర్భంగాను నగర కమిటీ నుండి ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున అన్ని మహాసభలకు హాజరైనారు.

= ప్రతి శాఖలో ప్రజాసంఘాల బాధ్యత పార్టీ సభ్యుల మధ్య పని విభజన ఎలా జరిగిందీ, ప్రజాసంఘాల పని సమీక్షలు జరిగాయి.

**(3) ఆగ్జిలరీ గ్రూపులు:**

= 2020 డిసెంబర్ వార్షిక సమీక్షల సందర్భం గా 70 మందితో 15 ఆగ్జిలరీ శాఖలు ఏర్పడ్డాయి. 2021 శాఖా మహాసభల సందర్భంగా మరొక 70 మంది ఆగ్జిలరీ గ్రూపుల్లోకి వచ్చారు.

**(4) స్థానిక సమస్యలపై కృషి:**

= స్థానిక సమస్యల మీద జరిగిన కృషిని శాఖ మహాసభలు ప్రధానంగా సమీక్షించాయి.

= బూర్జువా పార్టీలకు భిన్నంగా ప్రత్యామ్నాయ కృషి ఎలా జరిగిందీ, దాని ప్రత్యేకత ఏమిటీ అనే విషయాలపై సమీక్షల్లో పరిశీ లన జరిగింది.

= రాజకీయ అంశాలు, వాటిపై పార్టీ వైఖర్లు లాంటి వాటి మీద శాఖా సమావేశాల్లో చర్చలు కనీసం సంవత్సరానికి నాలుగు సార్లయినా జరిగినట్లు సమీక్షల్లో వెల్లడైంది.

= స్థానిక సమస్యల మీద కృషి బాగా జరిగిన ఒక శాఖ పరిధిలో బాలల సంఘం ఏర్పడింది. అందులో నుండి కొందరు విద్యార్థి సంఘం నగర కమిటీలోకి వచ్చారు. వీరి నుండి 10 మందితో ఆగ్జిలరీ శాఖ ఏర్పడింది.

**(5) పార్టీ సభ్యుల క్రియాశీలత:**

= 2019లో 27 మంది, 2020లో 5 మంది పార్టీసభ్యులు డ్రాపౌట్ అయ్యారు. రెండు సంవత్సరాల కాలంలో మరో 13 మంది చనిపోయారు. మొత్తం 46 సభ్యత్వం తగ్గింది. 45 మందిని కొత్తగా రిక్రూట్ చేసుకున్నారు. దీంతో సభ్యత్వం నిలకడగా మెయిన్‌టెయిన్ అయింది. ఇపుడు కొత్తగా ఏర్పాటు చేసిన సహాయక శాఖల ద్వారా సభ్యత్వ రిక్రూట్‌మెంటుకు కృషి జరుగుతున్నది.

= లూజ్ మెంబర్‌షిప్ కారణంగా కార్యక్రమాల్లో అందరూ పాల్గొనడం లేదు. ఈ రీత్యా పార్టీ సభ్యుల క్రియాశీలత పెంచడం ముఖ్యమని నగర కమిటి గత మహాసభలో భావించింది. ఈ రీత్యా స్థానిక సమస్యలపై కృషి ముమ్మరంగా సాగించడం అవసర మని పార్టీ శాఖలకు నగర కమిటీ దిశానిర్దేశం చేసింది. దీన్ని అమలు చేయడానికి నగర కమిటి (మధ్యంతర కమిటి) బాధ్యత వహించాలని నిర్ణయం జరిగింది. ఈ నేపథ్యంలో నగర కమిటీ శాఖల పని పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇచ్చింది. ఈ రెండు సంవత్సరాల్లో స్థాని కంగా ముందుకు వచ్చిన దాదాపు ఏ సమస్యనూ నగర కమిటీ నాయకత్వం వదిలిపెట్టలేదు. ఆ శాఖ పరిధిలో శాఖను భాగస్వామిని చేయడం (శాఖ సమావేశం జరిపి అందరూ పాల్గొనేటట్లు చర్చించడం), సమస్యలు చేపట్టడం ముమ్మరంగా జరిగిం ది. ఏరియా శాఖలు పద్నాలుగే అయినా ఆయా శాఖల పరిధిలో ఎక్కువగా ఇది అమలు జరిగింది. అందువల్లే కొత్త ఆగ్జిలరీ శాఖలు వచ్చాయి. మొత్తం నగరంలో 330 మంది పార్టీ సభ్యులుంటే ఇప్పుడు మరో 140 మంది కొత్త ఆగ్జిలరీలలో ఉన్నారు. ప్రస్తుతం 27 ఆగ్జిలరీ శాఖలు ఉన్నాయి.

= ఆగ్జిలరీ గ్రూపులు సరిగా జరగడానికి శాఖలో ఒక సభ్యుడిని దీనికి కార్యదర్శిగా పెట్టి వాటిని నిర్వహిస్తున్నారు. ఈ ఆగ్జిలరీ శాఖ సరిగా జరుగుతుందా లేదా అన్న పర్యవేక్షణ శాఖదే అయినా పై కమిటీ బాధ్యుడు ఈ వైఫల్యానికి బాధ్యత వహించాల్సి ఉందన్న అంశాన్ని పార్టీ నగర కమిటీ ప్రధానంగా చేపట్టింది.

**(6) స్థానిక కార్యక్రమాల ప్రభావం:**

= స్థానిక వెంకటేశ్వరపురం, బర్మాషెల్‌గుంట, పాత చెక్‌పోస్ట్, రంగనాయకులపేట ప్రాంతాల్లో 40 సంవత్సరాల నుండి రైల్వే స్థలాల్లో నివాసం ఉంటున్న వారిని తొలగిం చేందుకు అధికారులు రెండు సంవత్సరాల పాటు ప్రయత్నం చేశారు. బాధితులకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపేవరకు పార్టీ నాయకత్వంలో పోరాటం కొనసాగింది.

= 2019, 2020 సం॥లలో పెన్నానది వరద ప్రభావిత ప్రాంతాలైన భగత్‌సింగ్ కాలనీ, పాత చెక్‌పోస్టు, గాంధీ గిరిజన కాలనీ, ఉయ్యాల కాలువ కట్ట, మనుమసిద్ధినగర్, జయలలిత నగర్ ప్రాంతాలు వరద ముంపుకు గురయ్యాయి. వెంటనే పార్టీ నేతృత్వంలో రిలీఫ్ కేంద్రాలు ఏర్పాటు చేసి వంటలు, భోజనాల సౌకర్యం కల్పించ బడింది. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేసి బాధితులకు నష్ట పరిహారం ఇప్పించడం జరిగింది.

= గాంధీ గిరిజన కాలనీ నుండి 5వ నెంబరు జాతీయ రహదారి వరకు పెన్నానది రివిట్‌మెంట్ నిర్మాణం పేరుతో ఇళ్ళు తొలగించేందుకు అధికారులు మార్కింగ్ ఇచ్చారు. ధర్నాలు, దీక్షలు, నిరసన కార్యక్రమాలు చేపట్టి ఇళ్ళ తొలగింపు కార్యక్రమాన్ని అడ్డుకోవడం జరిగింది.

= బోడిగాడి తోట శ్మశాన వాటికలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు మునిసిపాలిటీ పూను కున్నది. చెత్త తెచ్చే ట్రాక్టర్లను అడ్డుకుని ఆందోళన చేయడం జరిగింది. దీంతో డంపింగ్ యార్డ్ చుట్టూ పెద్దగోడ కట్టి విస్తరణ ఆగింది.

= కరోనా లాక్‌డౌన్ కాలంలో భోజనం, వైద్యం అందించే సేవా కార్యక్రమాలు దాదాపు నగరమంతా విస్తృతంగా జరిగాయి.

= సర్వేపల్లి కాలువ కట్టపై ఇళ్ళ తొలగింపు

వ్యతిరేక పోరాటం, 16వ డివిజన్ చింతా రెడ్డి పాలెం జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి సాధనకై పోరాటం జరిగింది. బ్రిడ్జి మంజూరయ్యింది. నూతన ఆస్తిపన్ను విధానం, చెత్తపన్ను, యూజర్ ఛార్జీలకు వ్యతిరేకంగా ప్రతి శాఖ పరిధిలో కర పత్రాలు వేసి ఆందోళనలు జరిగాయి.

= అలాగే విద్యుత్ బిల్లుల పెంపుదలపై కూడా ప్రతిశాఖ విడి విడిగా కరపత్రాలు వేసి ఆందోళన చేశాయి. హౌస్‌ఫర్ ఆల్ పథకం లో నిర్మించిన ఇళ్ళను లబ్ధిదారులకు ఇమ్మని ఆందోళన జరిగింది. జనార్ధన్‌రెడ్డి కాలనీ లోని సి.జె.ఎఫ్.ఎస్. భూమికి అనాదిగా హక్కుదారులుగా ఉన్న గిరిజనులను తొలగించడానికి పూనుకున్నప్పుడు ఆందోళ నలు చేసి నష్టపరిహారం ఇప్పించడం జరిగింది. ఇలా స్థానిక సమస్యలమీద ప్రతిశాఖా చురుగ్గా పనిచేసింది. మచ్చుకు కొన్నిమాత్రమే ఇక్కడ పేర్కొనడం జరిగింది. స్థానిక సమస్యలపై కృషి మూలంగా కొత్త తరగతులు పార్టీలోకి వచ్చాయి.

**(7) పార్టీ నిధి:**

= పార్టీ నిధుల కోసం గత మూడు సంవత్స రాలుగా వ్యక్తులతో పాటు మాస్ క్యాంపె యిన్ కూడా సాగించడంతో క్రమంగా పార్టీ సభ్యుల భాగస్వామ్యం కూడా పెంచగలి గారు. ఇంకా 10 శాతం మంది పార్టీ సభ్యులు నిధుల వసూళ్ళలో పాల్గొనడం లేదు. లేదా సక్రమంగా బాధ్యతలు నిర్వహించడం లేదు.

**(8) సీనియర్స్ సేవలు:**

= యువతరాన్ని, మహిళలను ప్రోత్సహిస్తూనే పార్టీ నిర్మాణంలో కొందరు సీనియర్స్ అనుభవం, కమిట్‌మెంట్‌తో కూడిన సేవలు చాలా ముఖ్యమైన అంశం. దాన్ని పోగొట్టు కోకూడదు. వారి శక్తి సామర్ధ్యాలను బట్టి వారికి పని అప్పజెప్పి ఉపయోగించు కోవాలి. దీన్ని విస్మరించకూడదు. కానీ సీనియర్స్ వారి సేవలు అనే పేరుతో యువకులను, మహిళలను, సామాజిక తరగతులను నాయకత్వ స్థానాల్లోకి తీసుకురాకుండా నిర్లక్ష్యం చేయడం తీవ్రమైన లోపంగానే భావించాలి. సామర్థ్యం లేదు అని యువతను ప్రోత్సహించకపోతే పార్టీలో కొత్తదనం రాదు. ఉత్సాహం రాదు. కొత్త సెక్షన్స్ రాకుండా, యువత లేకుండా పోరాటాలు, ఉద్యమాలు అభివృద్ధి కావు. ప్రజాపంథా అభివృద్ధి కాదు. నెల్లూరు నగర పార్టీ సభ్యత్వ రెన్యువల్స్, పార్టీ శాఖా మహాసభలు సందర్భంగా యువత ఎక్కువ శాఖలకు కార్యదర్శులుగా ఎన్నికకావడానికి కలకత్తా ప్లీనం ఇచ్చిన డైరెక్షన్ తోడ్పడింది.

❊

**“ సీనియర్స్ వారి సేవలు అనే పేరుతో యువ కులను, మహిళలను, సామాజిక తరగతులను నాయకత్వ స్థానాల్లోకి తీసుకురాకుండా నిర్లక్ష్యం చేయడం తీవ్రమైన లోపంగానే భావించాలి. సామర్థ్యం లేదు అని యువతను ప్రోత్సహించకపోతే పార్టీలో కొత్తదనం రాదు. ఉత్సాహం రాదు. కొత్త సెక్షన్స్ రాకుండా, యువత లేకుండా పోరాటాలు, ఉద్యమాలు అభివృద్ధి కావు. ”**

# నగదీకరణ ముసుగులో ప్రైవేటీకరణ

(6వ పేజీ తరువాయి)

టెల్ ఉన్నాయి. పోర్టులు అదాని తీసుకొంటు న్నాడు. విమానాలు టాటాలు తీసుకోవచ్చు.

ప్రైవేటైజేషన్, మానెటైజేషన్ తదితర కార్యక్రమాలతో సంవత్సరాల తరబడి ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రభుత్వరంగాన్ని నాలుగు సంవత్సరాలలో మాయం చేస్తున్నారు. మూడు రైతాంగ వ్యతిరేక చట్టాలు, నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని తెచ్చారు. 370 అధికరణాన్ని రద్దుచేశారు. రాష్ట్రాల హక్కులను నాశనం చేస్తున్నారు.

ఇటువంటి విధానాలను అనుసరిస్తు న్నపుడు ప్రజలు చూస్తూ ఊరుకోరు. పోరాటాల లోకి వస్తారు. రైతులు పోరాటాలు చేస్తున్నారు. కార్మికులు పోరాటాలు చేస్తున్నారు. ఉద్యోగులు సమ్మె చేశారు. వీటిని అణచివేయటానికి తీవ్రమైన నిర్బంధాన్ని పాలకులు అమలు చేస్తున్నారు. మరీ వ్యతిరేకిస్తున్నవారిని దేశద్రోహి అని ముద్రవేస్తున్నారు. ఇపుడు వారూ వీరూ పోయి పెట్టుబడిదారులనే దేశద్రోహులుగా ముద్రవేస్తున్నారు. ఇన్ఫోసిస్ సంస్థకు ఒక సాఫ్ట్‌వేర్ తయారు చేయటం కోసం ప్రభుత్వం కాంట్రాక్టు ఇచ్చింది. దానిలో తప్పులు వచ్చాయి. దానితో ఆ సంస్థను దేశద్రోహి అని ముద్రవేశారు. ప్రభుత్వాన్ని, బిజెపి పెద్దలను విమర్శిస్తూ ఒక కార్టూన్ వేసినా, కవిత రాసినా, కథ రాసినా దేశద్రోహం అంటున్నారు. ఊపా చట్టాన్ని వినియోగించి, కేసులు పెట్టి జైళ్ళలోనే ఉ ండిపోయేలా చేస్తున్నారు. స్టాన్ స్వామినైతే వృద్ధుడైనా, కరోనా వచ్చి, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నా చనిపోయే వరకు జైలులోనే ఉంచారు. ఈ విధంగా ప్రశ్నించే వారిపై నిర్బం ధాన్ని ప్రయోగిస్తున్నారు. న్యూస్‌క్లిక్, వైర్ వెబ్‌పోర్టల్స్, దైనిక్ బజార్ పత్రికలు ప్రశ్నిస్తున్నా యని వాటిని వేధిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న సంస్థలన్నింటినీ ఇందుకోసం వినియో గిస్తున్నారు. మొదట ఇడి ని పంపుతారు. ఆ తర్వాత ఆదాయపన్ను వారిని, సిబిఐ, ఎన్ఐఎ తదితర సంస్థలన్నింటినీ పంపి వేధించటానికి పూనుకుంటున్నారు. పెగాసస్‌తో నిఘా వేయటం గురించి విన్నాం. బిజెపి మంత్రులతో సహా ఎవరైతే ప్రశ్నిస్తున్నారో వారందరి సంభాషణలను సేకరిస్తున్నారు. గతంలో ఎమర్జెన్సీ అని ప్రకటించి నిర్బంధాన్ని ప్రయోగించారు. ఈనాడు ప్రకటించకుండానే ఎమర్జెన్సీకి మించిన నిర్బంధాన్ని అమలుచేస్తున్నారు. భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఎందుకు ఇదంతా చేస్తున్నారు? ప్రైవేటీకరణ, నగదీకరణల ద్వారా సంపదలను పెట్టుబడిదారులకు అప్పగించాలంటే ప్రజలు ప్రశ్నించకుండా ఉ ండాలి. ప్రశ్నించే వారిని జైళ్ళలో నిర్బంధిం చాలి. జైళ్ళలో ఉండటం, బతికివుం డటం కూడా ప్రమాదం అనుకుంటే పైకి పంపాలి. పన్సారేను, మరికొందరిని అలాగే హత్యలు చేశారు. అందుకే ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటంలో భాగంగా ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం కూడా సాగాలి.

❊

కమ్యూనిస్టు ఉద్యమ ఆటుపోట్లు - శాస్త్రీయ అవగాహన -4

# 1905 రష్యన్ విప్లవం నుండి 1917 అక్టోబర్ విప్లవం వరకూ



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి

**తమ్మినేని వీరభద్రం**

**1905** రష్యా విప్లవం ఓటమి చెందింది. జార్ చక్రవర్తి జపాన్‌తో సంధి చేసుకుని తన దాడిని కమ్యూనిస్టులపై కేంద్రీకరించాడు. 14 వేల మంది విప్లవకారులను చంపారు. 94 పట్టణాలలో ఈ ఊచకోత సాగింది. మరో 75 వేల మందిని జైళ్లలో పెట్టారు. ఉద్యమం వెనకపట్టు పట్టింది. కానీ అంతరించి పోలేదు. ఈ ఓటమి నుండి లెనిన్ విలువైన గుణపాఠాలు తీసాడు. రష్యా విప్లవం ఓటమికి లెనిన్ తీసిన పాఠాలలో ముఖ్యమైనది 'పార్టీ ఉంటేనే చాలదు. అది ఉక్కుశిక్షణ గల పార్టీగా ఉండాలి' అనేది. ఎందుకంటే రష్యన్ విప్లవం ఓడిపోవటంలో పార్టీలో నిర్మాణ బలహీనతలే ప్రధాన పాత్ర వహించాయి.

రష్యా పార్టీలో తేడాలు ఎందుకు వచ్చాయి. ముందుకు వచ్చిన తప్పుడు సిద్ధాంతాలేమిటి? రష్యాలో పెట్టుబడిదారీ విధానం లేదని, రైతాంగమే విప్లవానికి నాయకత్వం వహించాలని 'నరోద్నిక్కులు' బలంగా వాదించేవాళ్లు. ఈ 'నరోద్నిక్కుల' వాదనలపైన ప్లెఖనోవ్, లెనిన్‌లు సైద్ధాంతిక పోరాటం సాగించారు. ఈ వాదన ఎలా తప్పో లెనిన్ సోదాహరణంగా వివరిస్తూ 'రష్యాలో పెట్టుబడిదారీ అభివృద్ధి' అనే ప్రఖ్యాత గ్రంథాన్ని రాసాడు. దానిలో రష్యాలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి ఏ రూపంలో జరుగుతోంది. దానికవసరమైన మార్కెట్టును ఎలా సృష్టించుకుంటోందీ వివరించాడు. 1879లోనే నరోద్నిక్కుల సిద్ధాంతం రష్యాలో ప్రారంభమైంది. 1. విప్లవానికి కార్మికవర్గం అవసరం లేదు. 2.గ్రామాల్లో రైతాంగాన్ని విముక్తి చేసి విప్లవాన్ని సాధించాలి. 3. పోరాటాలను వీరులు నడిపిస్తారు. 4. వ్యక్తిగత హింసావాదం తప్పుకాదు. ఇవీ నరోద్నిక్కులు నమ్మిన సిద్ధాంతాలు. వీటిపై బోల్షివిక్కులు పోరాటం చేసి ఓడించారు. ఆ తర్వాతనే 1898లో అన్ని విప్లవ గ్రూపులు కలిసి 'రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీ' ఏర్పరిచారు.

1903లో లండన్‌లో జరిగిన రష్యన్ పార్టీ రెండో మహాసభలోనే చీలికలేర్పడ్డాయి. బోల్షివిక్కులు, మెన్షివిక్కులుగా రెండు గ్రూపులుగా పార్టీ పనిజేసింది. ఇది విప్లవానికి హాని చేసింది. లెనిన్ బోల్షివిక్కులకు నాయకత్వం వహించాడు. బూర్జువా ప్రజాతంత్ర విప్లవ దశలో రష్యా ఉందని, విప్లవానికి కార్మికవర్గం నాయకత్వం వహించాలని లెనిన్ ప్రతిపాదించాడు. అలాగే పార్టీ అనేది గ్రూపులతో కాకుండా ఉక్కుశిక్షణతో ఉండాలన్నాడు. సభ్యులు, కార్యకర్తలకు ఖచ్చితమైన నిబంధనలుండాలని, పార్టీ కేంద్రీకృతమైనదిగా ఉండాలని ప్రతిపాదించాడు. మెన్షివిక్కులు మార్టొవ్ నాయకత్వాన ఈ ప్రతిపాదనలను వ్యతిరేకించారు. విప్లవానికి బూర్జువాలే నాయకత్వం వహించాలని, పార్టీ నిబంధనలు కఠినంగా ఉండకూడదని, చేరేవాళ్లందరినీ చేర్చుకునేలా ఉండాలని వాదించారు.

ఈ పొరపాటు వాదనలను తిప్పికొడుతూ లెనిన్ కృషి సాగింది. 1904లో లెనిన్ 'ఒకడుగు ముందుకు, రెండడుగులు వెనక్కు' అనే పుస్తకం రాశారు. దానిలో బోల్షివిక్కులను విప్లవకారులుగా, మెన్షివిక్కులను అవకాశవాదులుగా విశ్లేషిస్తూ పార్టీ నిర్మాణంలో ముందుకొచ్చిన అనేక విషయాలలో మెన్షివిక్కుల వాదనలు ఎలా తప్పో వివరించారు. ఒక సాధారణ కార్మికుడు, రైతు, టీచర్, ప్రొఫెసర్ లాంటి వారంతా పార్టీని అభిమానిస్తే వారందరినీ పార్టీ సభ్యులుగా గుర్తించాలని, వారు ఏదో ఒక ప్రజాసంఘంలో పనిచేయాలనే నిబంధన అవసరం లేదని, హోల్ టైమర్ అనే వ్యవస్థ అవసరం లేదని ఇలాంటి తప్పు వాదనలను ఖండించారు. అలాగే పార్టీ పత్రిక ఎలా నడపాలి? కేంద్రీకృత పార్టీగా ఉండటం ఎలా అవసరం అనే విషయాలలో సరైన పద్ధతులను లెనిన్ వివరించారు. మెన్షివిక్కుల పొరపాటు వైఖరులు పార్టీని ఎలా నిర్వీర్యం చేస్తాయో లెనిన్ ఆ పుస్తకంలో వివరించాడు. అలాగే కార్మికోద్య మం ఉంటేనే సరిపోదనీ దానికి రైతాంగం కూడా తోడవ్వాలని లెనిన్ సూత్రీకరించాడు. 'గ్రామీణ పేదలు' అనే పుస్తకం ఈ కాలంలోనే రచించాడు. రైతాంగంలో వర్గ విభజన ఎలా జరుగుతోందనేది దానిలో వివరించారు. కార్మికవర్గంతో రైతాంగ మైత్రికి ఉండే పునాదిని వివరించాడు.

రష్యన్ విప్లవం ఓటమిపై సరైన గుణపాఠాలు తీసి కార్మికోద్యమాన్ని పునర్నిర్మాణం చేసారు. మరోవైపు విప్లవాన్ని నీరుగార్చటానికి జార్ ఏర్పర్చిన పార్లమెంట్, దానికి జరిపిన ఎన్నికలు, చేసిన వాగ్దానాల అమలుపైన కార్మికవర్గానికి, రైతాంగానికి క్రమంగా భ్రమలు తొలగటం ప్రారంభమైంది. తిరిగి ఉద్యమాలు బలపడ్డాయి. 1912లో లీనా బంగారు గనుల్లో సమ్మెలు ప్రారంభమైనాయి. 7 లక్షల మందికి పైగా సమ్మెలో పాల్గొన్నారు. నిర్బంధం పెరిగింది. దాదాపు 5 వందల మంది హత్య చేయబడ్డారు. అయినా సమ్మె ఉధృతమైంది. 1914 నాటికి 15 లక్షల మంది సమ్మెలో పాల్గొన్నారు. 1910-14 మధ్య రైతులు భూముల కొరకు 13 వేల తిరుగుబాట్లు చేసారు. ఈ నేపథ్యంలో సామ్రాజ్యవాదుల మధ్య మార్కెట్ల కోసం ఏర్పడిన వైరుధ్యాల ఫలితంగా మొదటి ప్రపంచ యుద్ధం ముంచుకొచ్చింది. బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా, ఇటలీ, జపాన్, రష్యా ఒక కూటమిగా జర్మనీ, ఆస్ట్రియా, హంగరీ, బల్గేరియా, టర్కీ రెండో కూటమిగా యుద్ధంలోకి దిగాయి.

### యుద్ధం పట్ల వైఖరిపై కమ్యూనిస్టు ఉద్యమంలో మళ్లీ సంక్షోభం

1914 జులై 28న మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. ఈ యుద్ధం యొక్క స్వభావం ఏమిటి? దీనిని వ్యతిరేకించాలా? సమర్థించాలా? కార్మికోద్యమం, కార్మికవర్గ పార్టీలు ఏ వైఖరి తీసుకోవాలి అనే విషయంలో

కమ్యూనిస్టు ఉద్యమంలో మళ్లీ చీలిక ఏర్పడింది.

ఈ యుద్ధం ప్రజా వ్యతిరేకమైందని, దీనిని వ్యతిరేకించాలని 1912లో బాస్లేలో జరిగిన రెండవ ఇంటర్నేషనల్ సమావేశంలో కార్మికవర్గ పార్టీలన్నింటికీ లెనిన్ పిలుపు ఇచ్చాడు. యుద్ధం సామ్రాజ్యవాదుల మార్కెట్ల కోసం జరుగుతోందనీ అది కార్మికవర్గాన్ని, రైతాంగాన్ని, మొత్తం ప్రజానీకాన్ని పీల్చి పిప్పిచేయటానికి, మరింత దోపిడీ చేయటానికి ఉపకరిస్తుందే తప్ప మేలేమీ చేయదని, కాబట్టి యుద్ధాన్ని వ్యతిరేకించాలని, అవకాశమున్న చోట అంతర్యుద్ధంగా మార్చి కమ్యూనిస్టులు బలంగా ఉన్న దేశాలలో కార్మిక వర్గ రాజ్యాల ఏర్పాటుకు ప్రయత్నించాలని లెనిన్ వాదించాడు. జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ నాయకుడు కార్ల్ కాట్స్కీ లెనిన్ సూత్రీకరణను వ్యతిరేకించాడు. యుద్ధంలో జాతీయ ప్రభుత్వాలను కమ్యూనిస్టులు బలపర్చాలని, సోషలిస్టు విప్లవానికి ఇది సమయం కాదనీ వాదించాడు. రెండవ ఇంటర్నేషనల్‌లోని ఎక్కువ పార్టీలు లెనిన్ వాదనను తిరస్కరించాయి. కమ్యూనిస్టులు తమ, తమ దేశాలలో దేశభక్తులుగా వ్యవహరించాలని, యుద్ధంలో తమ ప్రభుత్వాలను సమర్థించాలని ఈ పార్టీలు వాదించాయి. ఆ విధంతా జర్మనీ తదితర దేశాలలో బలంగా ఉన్న సోషల్ డెమొక్రటిక్ పార్టీలన్నీ తమ తమ ప్రభుత్వాల తరఫున యుద్ధాన్ని సమర్థించటానికి నిర్ణయించుకున్నాయి. వారిలో ఎక్కువ మంది పార్లమెంటుల్లో, అసెంబ్లీ సభల్లో ప్రతినిధులుగా ఉన్నారు. వీరంతా 'పార్లమెంటరీ ఊబిలో చెడిపోయిన సరుకు' అని లెనిన్ వర్ణించాడు. ఆ విధంగా జాతీయ ప్రభుత్వాలను సమర్థించిన కమ్యూనిస్టు పార్టీలు తీవ్రంగా నష్టపోయాయి. బలహీన పడ్డాయి. ఈ చీలికలతో రెండవ ఇంటర్నేషనల్ 1916లో రద్దయింది. మరోవైపు లెనిన్ 'యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చాలనే' తన సిద్ధాంతాన్ని జయప్రదంగా అమలు జరిపి మొదటి సోషలిస్టు విప్లవాన్ని రష్యాలో విజయవంతంగా ముందుకు తీసుకుపోయాడు.

ఈ సమయంలోనే 1916లో 'సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధాన అత్యున్నత దశ' అనే ప్రఖ్యాత గ్రంథాన్ని లెనిన్ రచించాడు. దీనిలో సామ్రాజ్యవాద స్వభావాన్ని ఆయన వివరించాడు. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు తమ మార్కెట్ల కోసం ప్రపంచాన్ని వలసలుగా పంచుకోవటం, ప్రపంచ గుత్త సంస్థలు ఏర్పడటం, ఫైనాన్స్ పెట్టుబడి ఏర్పడటం, మారిన బలా బలాలను బట్టి ప్రపంచ పున:పంపకం కోసం యుద్ధాలకు తలపడటం సామ్రాజ్యవాద ప్రధాన లక్షణాలుగా లెనిన్ పేర్కొన్నారు. అందులో భాగంగానే మొదటి ప్రపంచ యుద్ధం జరిగిందని, ఈ యుద్ధోన్మాద దేశాలలో అత్యంత వెనకబడిన రష్యా ఈ గొలుసులో ఉన్న బలహీనమైన లింకు అనీ, దానిని తెంపటం తేలికవుతుందనీ, ఆ విధంగా రష్యన్ కార్మికవర్గం తిరగబడితే సోషలిస్టు విప్లవాన్ని జయప్రదం చేయవచ్చనీ లెనిన్ సూత్రీకరించాడు. సామ్రాజ్యవాద స్వభావాన్ని గురించి లెనిన్ విశ్లేషణను కాట్స్కీ తప్పుబట్టాడు. సామ్రాజ్యవాదానికి యుద్ధ స్వభావం ఉండదని వాదించాడు. లెనిన్ సిద్ధాంతం సరైనదని చరిత్ర రుజువు చేసింది.

> “ ఈ అంతర్యుద్ధ విప్లవంలో క్యాడెట్ పార్టీ, మెన్షివిక్, సోషలిస్టు రివల్యూషనరీ తదితర గ్రూపులన్నీ పాల్గొన్నాయి. బోల్షివిక్కులు నాయకత్వ పాత్ర వహించారు. ఈ తిరుగుబాట్లు దేశవ్యాప్తంగా బాగా పెరగటంతో 1917 ఫిబ్రవరిలో సార్వత్రిక తిరుగుబాటుగా మారి 'పెట్రోగ్రాడ్'లో జార్ చక్రవర్తి వింటర్ ప్యాలెస్ పైన ప్రజలు దాడిచేయటంతో జార్ ప్రభుత్వం కూలిపోయింది. ”



రష్యన్ విప్లవం: వింటర్ ప్యాలేస్ ముట్టడి

### 1917 అక్టోబర్ మహా విప్లవం

రష్యన్ జార్ చక్రవర్తి బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలతో చేతులు కలిపి ప్రపంచ యుద్ధంలో బాగా కూరుకుపోయాడు. ప్రజలపై యుద్ధ భారాలు పెంచివేశాడు. ఆయుధాల శిక్షణ లేకుండా ప్రజలను బలవంతంగా యుద్ధంలో చేర్చేవాళ్లు. పారిశ్రామిక సంక్షోభం తీవ్రమయింది. కార్మికుల సమ్మె పోరాటాలు ఉధృతమయ్యాయి. ఆహార ధాన్యాల కొరత ఏర్పడింది. యుద్ధరంగంలో జార్ సైన్యాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. యుద్ధానికి వ్యతిరేకంగా సైన్యంలో తిరుగుబాట్లు ప్రారంభమయ్యాయి. మరోవైపు కార్మికులు, రైతులు విప్లవ పోరాటాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలు ఖాతరు చేయటం లేదు. సైనికులలో, కార్మికులలో, రైతులలో సోవియట్లు ఏర్పరిచారు. పట్టణ సోవియట్లు, తాలూకా, జిల్లాల వారీ సోవియట్లకు ప్రజలు ఎన్నిక చేసిన ప్రతినిధులను పంపుతున్నారు. శాంతి, జాతుల స్వయంప్రతిపత్తి, రైతులకు భూమి ప్రధాన నినాదాలయ్యాయి.

ఈ అంతర్యుద్ధ విప్లవంలో క్యాడెట్ పార్టీ, మెన్షివిక్, సోషలిస్టు రివల్యూషనరీ తదితర గ్రూపులన్నీ పాల్గొన్నాయి. బోల్షివిక్కులు నాయకత్వ పాత్ర వహించారు. ఈ తిరుగుబాట్లు దేశవ్యాప్తంగా బాగా పెరగటంతో 1917 ఫిబ్రవరిలో సార్వత్రిక తిరుగుబాటుగా మారి 'పెట్రోగ్రాడ్'లో జార్ చక్రవర్తి వింటర్ ప్యాలెస్ పైన ప్రజలు దాడిచేయటంతో జార్ ప్రభుత్వం కూలిపోయింది. కేడెట్ పార్టీ నాయకత్వంలో 'కెరెన్స్కీ' ఆధ్వర్యాన పెట్టుబడిదారీ, భూస్వామ్య

> **"ఏప్రిల్‌లో సమావేశమైన కేంద్రకమిటీ యుద్ధం విరమిం చాలని, కార్మికవర్గానికి పరిశ్రమలలో ఆధిపత్యం, రైతులకు భూమి, జాతులకు స్వయంప్రతిపత్తి తదితర డిమాండ్లపై యావత్తు ప్రజలను విప్లవంలోకి రాబట్టాలని నిర్ణయం తీసుకు న్నారు. దీనినే ఏప్రిల్ థీసిస్ అంటున్నాం. 1917 ఫిబ్రవరిలో బోల్షివిక్కుల పలుకుబడిలో 7 లక్షలమంది కార్మికులు సమ్మెలు చేయగా, నవంబర్ నాటికి 20 లక్షల మందికి పెరిగారు."**

పార్టీలు అధికారం చేబట్టాయి. సోవియట్‌లలో బలం కలిగి ఉండి విప్లవానికి నాయకత్వం వహించిన బోల్షివిక్ పార్టీని పక్కకు తప్పించారు.

దేశంలో ద్వంద్వ అధికారం నెలకొన్నది. నూతన ప్రభుత్వం సోవియట్లకు అధికారం ఇచ్చేందుకు సిద్ధంగా లేదు. ప్రజల సమస్యలు పరిష్కరించకపోగా, సామ్రాజ్యవాద, పెట్టుబడి దారీ దేశాలతో చేతులు కలిపి ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలకు నీళ్ళొదిలింది. యుద్ధం కొనసాగించాలని నిర్ణయించింది. బోల్షివిక్ పార్టీని నిషేధించింది. దాడులు చేసింది. ఈ స్థితిలో 1917 ఏప్రిల్‌లో లెనిన్ దేశానికి తిరిగి వచ్చాడు. కార్మికులు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. విప్లవం సోషలిస్టు దశకు చేరుకోవాలని సూచిస్తూ 'సోషల్ డెమొక్రటిక్ పార్టీ రెండు ఎత్తుగడలు' అనే గ్రంథాన్ని వెలువరించాడు. ఏ వర్గం నుండి ఏ వర్గం అధికారం లాక్కోవా ల్సిందీ వివరించాడు. ఏప్రిల్‌లో సమావేశమైన కేంద్రకమిటీ యుద్ధం విరమించాలని, కార్మికవర్గానికి పరిశ్రమలలో ఆధిపత్యం, రైతులకు భూమి, జాతులకు స్వయంప్రతిపత్తి తదితర డిమాండ్లపై యావత్తు ప్రజలను విప్లవంలోకి రాబట్టాలని నిర్ణయం తీసుకున్నారు. దీనినే ఏప్రిల్ థీసిస్ అంటున్నాం. 1917 ఫిబ్రవరిలో బోల్షివిక్కుల పలుకుబడిలో 7 లక్షలమంది కార్మికులు సమ్మెలు చేయగా, నవంబర్ నాటికి 20 లక్షల మందికి పెరిగారు. సైన్యంలో సగభాగం పార్టీ కంట్రోలులోకి వచ్చింది. పార్టీ సభ్యత్వం 23 వేల నుండి 4 లక్షలకు పెరిగింది.,

బలహీనంగా ఉన్న కెరెన్స్కీ ప్రభుత్వం తిరుగుబాటును అణచివేయటానికి అనేక ప్రయత్నాలు చేసింది. దుష్ప్రచారాలు చేసింది. అయినప్పటికీ నవంబర్ 6 రాత్రి ప్రారంభమైన తిరుగుబాటు జయప్రదంగా ముందుకు సాగి ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలన్నింటిని ఆక్రమించింది. కెరెన్స్కీ పలాయనం చిత్తగిం చాడు. 1917 నవంబర్ 7 సోషలిస్టు మహా విప్లవం జయప్రదమైంది. విప్లవ విజయానికి ముఖ్యమైన కారణాలు 1. కార్మికవర్గ నాయ కత్వం 2. కార్మిక-కర్షక మైత్రి 3. జాతులకు స్వయంప్రతిపత్తి ఇస్తామని చేసిన ప్రకటన 4. సామ్రాజ్యవాద యుద్ధంలో కూరుకుపోయిన ప్రభుత్వం బలహీనంగా ఉండటం

రష్యా విప్లవం విజయవంతం కావటంతో అనేక వలస దేశాలలో స్వాతంత్ర్య పోరాటాలు పెల్లుబికాయి. అనేక దేశాలలో స్పష్టమైన సిద్ధాంతాలు కలిగిన కమ్యూనిస్టు పార్టీలు ఏర్పడ్డాయి. ప్రపంచ సామ్రాజ్యవాద వ్యవస్థ కూలిపోవటం ప్రారంభమైంది. అప్పటి వరకూ తమలో తాము పోట్లాడుకున్న సామ్రాజ్యవాద దేశాలన్నీ ఏకమై ఒక్కటిగా సోషలిస్టు రష్యాపై దాడికి తెగబడ్డాయి. కార్మికవర్గం ఆయుధాలు చేబట్టి యుద్ధరంగంలోకి ఉరికింది. జర్మనీ రష్యాపై దాడిచేసి ఆక్రమించినా లెనిన్ సమయస్ఫూర్తితో 'బ్రెస్ట్ లిటోవస్క్' ఒప్పందం చేసుకుని దేశాన్ని కాపాడాడు. తరువాత పూర్తిస్థాయిలో ఫాసిస్టు జర్మనీని యుద్ధంలో మట్టిగరిపించేందుకవసరమైన సన్నాహాలు చేసుకునే సమయం పొందటానికి ఈ సంధి చక్కగా ఉపయోగపడింది.

మొదటి ప్రపంచ యుద్ధంలో మితవాద దోరణికి గురైన సోషల్ డెమొక్రటిక్ పార్టీలు యుద్ధాన్ని సమర్థించే తప్పుడు వైఖరి తీసుకోవటం వల్ల ఆ పార్టీలు నష్టపోవటమేగాక ప్రపంచ కార్మికోద్యమం తీవ్రంగా దెబ్బతిన్నది. యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చాలనే లెనిన్ ప్రఖ్యాత ఏప్రిల్ థీసిస్ సరైనదని సోవియట్ సోషలిస్టు విప్లవ విజయం రుజువు చేసింది. ఆ విధంగా యుద్ధం గురించిన మితవాద సిద్ధాంతాలతో కలిగిన ఆటంకాలను ప్రపంచ కార్మికోద్యమం జయప్రదంగా అధిగమించగలి గింది. ఈ సమయంలోనే రష్యన్ మార్క్సిస్టు ట్రాట్స్కీ మరో ముఖ్య వాదన ముందుకు తెచ్చాడు. 'ప్రపంచ విప్లవం' లేదా 'శాశ్వత విప్లవం' అనేది ఆయన ముందుకు తెచ్చిన సిద్ధాంతం. ఒక దేశంలో సోషలిజం సాధించ టం సాధ్యం కాదని, ఒక వేళ సాధించినా అది నిలబడజాలదని, చుట్టూ ఉన్న పెట్టుబడి దారీ సమాజం నుండి సోషలిజాన్ని రక్షించటం కష్టమౌతుందనేది ఆయన వాదన. నిరంత రాయంగా ప్రపంచ సోషలిజం సాధించేవరకు విప్లవం కొనసాగాలనేది ఆయన ప్రతిపాదన. లెనిన్ దానిని చాకచక్యంగా తిప్పి కొట్టాడు. ఒక దేశంలో సోషలిజం నిర్మించటం సాధ్యమా, కాదా? అనేది ఆచణలో తేలాలి. కానీ ప్రపం చం అంతా సామ్రాజ్యవాదులు లాభాల వేటతో యుద్ధంలో కూరుకుపోయినపుడు ఆయా దేశాల కార్మికవర్గాలు, ప్రజలు ఆ సామ్రాజ్యవాదుల లాభాల కోసం యుద్ధంలోకి ఈడ్వబడి ప్రాణా లు కోల్పోయేదానికంటే తిరగబడి పోరాడి యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చితే కార్మికులకే రాజ్యాధికారం చేతికొచ్చే అవకాశం ఉంటుంది. అలా వచ్చిన అధికారం నిలపగలమా లేదా అనే మీమాంస కంటే సామ్రాజ్యవాదుల కోసం చావటం కంటే, తరువాత నిలుస్తుందో లేదో తెలియకపోయినా ఆ విప్లవాన్ని సాధించు కోవటమే మేలుగదా? అది నిలిచినన్నాళ్లే నిలుస్తుంది. తరువాత మళ్లీ పోరాడతాం, అనేది లెనిన్ వాదన. ఆ విధంగా ఆయన ఆచరణలో కార్మికవర్గ సిద్ధాంతాన్ని మరింత ఉన్నతస్థితికి అభివృద్ధి పరిచాడు.

ఈ విధంగా ప్రపంచ కమ్యూనిస్టు ఉద్య మం ఎదుర్కొన్న మరో ముఖ్యమైన ఆటంకం పరిష్కారం అయింది. సామ్రాజ్యవాద యుద్ధా లను సరిగ్గా అర్థం చేసుకున్న సమగ్ర లెనినిస్టు సిద్ధాంతం ఆవిష్కృతమైంది. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో అనేక వాద, వివాదాలతో ఆచరణలో నిగ్గుదేలిన ఈ సిద్ధాంతాన్ని రెండవ ప్రపంచ యుద్ధకాలంలో అనేక దేశాలలో సక్రమంగా అమలుజేయటం ద్వారా అయా దేశాలలో విప్లవాలు జయప్రదమై, భూగోళం పైన మూడో వంతు జనాభా ఉన్న దేశాలతో ఒక గొప్ప సోషలిస్టు ప్రపంచమే ఏర్పడింది. 70 సంవత్సరాల పాటు మానవాళి కనీ, వినీ ఎరుగని సమానత్వ పాలనను ఆ రాజ్యాలు ప్రజలకందించాయి. అయితే ఆ విజయ యాత్రకు మరో కొత్త ఆటంకం ఏర్పడింది. సోషలిజం నిర్మించటంలో అంతకు ముందు అనుభవాలు లేకపోవటం వల్ల ఏర్పడిన ఆటంకాలవి. ఆ సోషలిస్టు విజయాల గురించి, తిరిగి ఆ సోషలిస్టు ప్రపంచంలో ఏర్పడిన ఆటంకాలతో అనేక సోషలిస్టు రాజ్యాలు కూలిపోయిన దుష్పరిణామాల గురించీ, ఈ పరిణామాలకు కారణమైన సిద్ధాంత సమస్యల గురించీ వచ్చే సంచికలో చర్చిద్దాం. ❊

సాంస్కృతిక రంగం

# ప్రత్యామ్నాయ సంస్కృతి: ఆచరణ సమస్యలు



రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు

ఎస్ వీరయ్య

పార్టీ కేంద్ర కమిటీ 'సాంస్కృతిక రంగంలో కర్తవ్యాలు' తీర్మానం చేసింది. పార్టీ శ్రేణులు కూడా ఆమోదించాయి. అనేక సందర్భాల్లో ప్రత్యామ్నాయ సంస్కృతి గురించి నొక్కి చెబుతున్నాం. 'సంస్కృతి' అన్న పదమే సంక్లిష్టమైనది. విశాలమైన అర్థం ఉన్నది. అందువల్ల తరతమ స్థాయిల్లో కొంత గందర గోళానికి అవకాశం ఉన్నది. అందుకే 'ప్రత్యామ్నాయ సంస్కృతి' గురించి కూడా అస్పష్టత సహజం. పార్టీ కేంద్రకమిటీ తీర్మానం ప్రారంభంలోనే చెప్పిన విషయం గమనించాలి. "మానవుని జీవన గమనం మొత్తానికి సంస్కృతి ప్రాతినిథ్యం వహిస్తుంది. అంటే కళాభి వ్యక్తీకరణతో పాటు మనిషి ప్రవర్తన, అభివ్యక్తీ కరణలు, మానరిజం వగైరాలకు ప్రాతినిథ్యం వహిస్తుంది. అందువల్ల సాంస్కృతిక రంగంలో జోక్యం చేసుకోవడం అంటే మనం అన్ని కాలాల్లోనూ భావాల మధ్య జరిగే యుద్ధంలో జోక్యం చేసుకోవడమే".

ఇందులో 'మనిషి ప్రవర్తన' కూడా ఉన్నది. అందువల్ల భావాల మధ్య జరిగే యుద్ధంలో జోక్యం చేసుకోవాల్సిన కమ్యూనిస్టు మనిషి ప్రవర్తనకు ప్రాధాన్యత ఎక్కువ. దోచుకునే సంస్కృతిని అంతం చేయడం కోసం జరిగే సైద్ధాంతిక యుద్ధంలో విజయం సాధించ డానికి ఇది మరీ అవసరం. సిద్ధాంతపరంగా చెప్పటం సులభమే! ఆచరించడమే పరీక్ష. అందుకే ఇది ఆచరణకు సంబంధించిన ముఖ్య మైన సమస్య.

తెలంగాణ రాష్ట్రంలో కనీస వేతనాల కోసం, కార్మిక హక్కుల పునరుద్ధరణ కోసం నడిచిన పాదయాత్ర బృందం అనుభవాలు ఈ సందర్భంగా పరిశీలించడం ఉపయోగం. ఈ యాత్ర సందర్భంగా కనీస వేతనాలు అందని పేద కార్మికుల ఇండ్లల్లో పాదయాత్ర బృందం బస చేసింది. వారు పెట్టింది తిన్నది. సహజం గానే ఈ కుటుబాలలో ఎక్కువ భాగం దళితులు, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారే. ఈ సందర్భంగా కొన్ని ప్రశ్నలు ఎదురైనాయి. బస చేసేందుకు పేద కార్మికుల ఇండ్లు దొరుకుతాయా? కరోనా సమస్య వల్ల తమ ఇండల్లో ఆతిథ్యం ఇవ్వడానికి ఒప్పు కుంటారా? కొన్ని లాడ్జీల్లో రూమ్‌లు ఉచితంగా ఇవ్వవచ్చు లేదా తక్కువ ఛార్జీకే ఇవ్వవచ్చు కదా! గెస్ట్ హౌస్‌లు కూడా ఉచితంగా ఇచ్చే అవకాశం ఉన్నది కదా! హోటల్ భోజనాలు కూడా ఉచితంగా వస్తే ఉపయోగించుకుంటే తప్పేమిటి? పేద దళితుల ఇండ్లల్లో బస చేయా లనటం అస్తిత్వవాదం కాదా? మధ్యతరగతి దళితుల ఇంట్లో బసచేస్తే తప్పేమిటి? వెనుక బడిన తరగతులకు చెందిన, మంచి సౌకర్యా లున్న ఇంట్లో బస చేయవచ్చుకదా? పార్టీ కార్యకర్త దళితుడే కదా! ఆ ఇంటిలో ఉండవచ్చు కదా? ఇలాంటి ప్రశ్నలనేకం ముందు కొచ్చాయి.

అనుభంంలో కొన్ని విషయాలు తేలాయి. కార్యకర్తలకు కార్మికులతో సంబంధాలున్న చోట కార్మికుల అతిథ్యం సమస్య కాలేదు. పైగా ఎంతో సంతోషంగా ఆహ్వానించారు. రాష్ట్ర నాయకులు తమ ఇంట్లో బసచేయడం తమ జీవితంలో మరువలేని ఘటన అని ఆప్యాయం గా చూసుకున్నారు. కరోనా గురించి కార్యకర్తల్లో అనుమానాలే తప్ప కార్మికుల్లో ఎక్కడా ఆ చర్చే రాలేదు. బతుకు పోరాటంలో ముసుగులను లెక్కచేయకుండా శ్రమిస్తున్న కార్మికులు కావడమే కారణం... పైగా ఒక గ్రామంలో తమ ఇంట్లో బస చేయాలంటే .... కాదు తమ ఇంట్లో బస చేయాలని పోటీపడి టాస్ వేసుకుని గెలిచిన వారు అతిథ్యం ఇచ్చారు. ఆ గ్రామంలో కమ్యూ నిస్టు పార్టీ లేదు.

కనీస వేతనాలు అందని పేద కార్మికుల కుటుంబాలు అన్ని సామాజిక తరగతుల్లో ఉన్నాయి. పాదయాత్ర బృందం వివిధ సామాజిక తరగతులకు చెందిన కార్మికుల ఇంట్లో బస చేసింది. వీటిలో దళితుల నుంచి అగ్రవర్ణాల వరకు ఉన్నాయి. కానీ... సహజంగానే దళితులు, బలహీనవర్గాలకు చెందినవారే ఎక్కువ. ఇందుకు భిన్నంగా ....'మధ్యతరగతి కుటుంబం కూడా దళితులే కదా! ఆ ఇంట్లో ఉండవచ్చుకదా!' అనుకోవడం సందర్భోచితం కాదు. కుల, మత బేధాలు లేకుండా ఎక్కడైనా బస చేయవచ్చు. కానీ ఇక్కడ మధ్య తరగతి కుటుంబం కావడం వల్ల కనీస వేతనాలు అందని పేదరికాన్ని విస్మరించి కేవలం కులాన్ని చూడడమే అవుతుంది. 'మంచి సౌకర్యాలున్న ఇల్లు బీసీలదే కదా' అనటం కూడా ఇలాంటిదే. 'పార్టీ కార్యకర్త దళితుడే కదా! ఆ ఇంట్లో ఉండవచ్చు కదా!"అనే అభిప్రాయం అనేక కోణాల నుంచి పరిశీలించవచ్చు. పార్టీ కార్యకర్త ఇంట్లో బస చేస్తే తమ పార్టీకి చెందిన కార్యకర్త ఇంట్లో నాయకులున్నారని కార్మికులు భావిస్తారు. పేద కార్మికుల ఇంట్లో ఉండడం కాదు కదా! అంతే కాదు. తాను కమ్యూనిస్టుగా మారటమే కాదు, కమ్యూనిస్టు కార్యకర్తగా కూడా మారటం అంటే కుల, మత బంధాన్ని వీడి విశ్వమానవుడైనట్టుగా భావించాలి. ఒక కమ్యూనిస్టు, తనకు తానుగా ఫలానా కులానికి చెందిన వ్యక్తిగా భావించ జాలరు. ప్రజలు చూడడం వేరు. తాను భావించ డం వేరు. కుల చైతన్యం వదిలి కమ్యూనిస్టు చైతన్యం పొందటంతోనే కమ్యూనిస్టు కార్యకర్త అవుతారు కదా!

పేద కార్మికుల ఇండ్లల్లో బస చేయాలన్న ప్పుడు, ఆ ఇండ్లు సామాజిక అణచివేతకు గురవుతున్న వారివి అయినప్పుడు ఇలాంటి చర్చలు రావడం సహజం కూడా. కొన్ని చోట్ల లాడ్జీల్లో గదులు ఉచితంగా, లేదా తక్కువ కిరాయితో ఇస్తున్నారు. గెస్ట్ హౌస్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి. హోటల్ భోజనాలు

**“ ఇక్కడ కేంద్రకమిటీ తీర్మానం చెప్పిన విషయం గుర్తు చేసుకోవాలి: “మన దేశం ఆధునికంగా పురోగమించకుండా బలంగా అడ్డుపడుతున్నవి గతానికి సంబంధించిన ఛాందస వ్యవస్థలు. అంటే కుల వివక్ష, అణచివేత, పితృస్వామిక వ్యవస్థ, ఖాప్ పంచాయితీలు, మతపరమైన మైనారిటీల పట్ల చిన్నచూపు వంటివి మాత్రమే కాదు, నయా ఉదారవాద వినిమయ విలువలు కూడా గత కాలపు వ్యవస్థలను సజీవంగా ఉంచుతూ వాటికి మరింత దన్నుగా వ్యవహరిస్తున్నాయి.” ”**

కూడా ఉచితంగా వచ్చే అవకాశాలున్నాయి. ఇవన్నీ ఉపయోగించుకోవచ్చు కదా అని కూడా భావించవచ్చు. ఈ విషయాలు కూడా లోతుగా పరిశీలించాలి. గత మూడు దశబ్దాల కాలంలో ప్రపంచీకరణ, సరళీకృత ఆర్థిక విధానాలు సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేసాయి. పార్టీ శ్రేణులు కూడా సమాజంలో భాగమే కదా! మంచి సౌకర్యాల కోసం ఆరాటం పెరిగింది. వినోదం, విరామానికి అలవాటు పడడం చూస్తున్నాం. ఏ కొంచెం గుర్తింపు వచ్చినా అనేక సందర్భాల్లో దర్పం ప్రదర్శించడం గమనించవచ్చు. కార్యకర్తల్లో ఉద్యోగి మనస్తత్వం ప్రబలుతున్నదన్న చర్చ కూడా ఉన్నది. వీటి ప్రభావం ప్రజలతో సంబంధాల మీద, ఆందోళనా పోరాటాల మీద కూడా ఉంటున్నది. క్షేత్రస్థాయిలో కార్మికులు, వ్యవసాయ కూలీలు, పేద, కౌలు రైతులు, ఇతర పేదలతో మమేకం కాలేకపోతున్నారు. వారి నివాసాలు, సామాజిక స్థితిగతులు, జీవన పరిస్థితుల గురించి అవగాహన పరిమితం. పైపై సంబంధాల వల్ల జన సమీకరణకు పరిమితులు ఏర్పడ్డాయి. పరిమిత సంఖ్యలో పాల్గొన్నప్పటికీ సోషల్ మీడియా పోస్టింగ్‌లతో సంతృప్తి చెందుతున్నారు. అంతేకాదు, ఆధునీకరణతో పాటు పాత కాలపు ఫ్యూడల్ భావాలు కూడా ఆధునిక పెట్టుబడిదారీ వర్గమే పెంచి పోషిస్తున్నది. అందువల్ల కులపరమైన అస్తిత్వ భావజాలం కూడా ఒక సవాలుగా నిలిచింది. పార్టీ శ్రేణులను కూడా ప్రభావితం చేస్తున్నది. దీనికి దళితులు, అగ్రవర్ణాలన్న తేడా లేదు. ఇక్కడ కేంద్రకమిటీ తీర్మానం చెప్పిన విషయం గుర్తు చేసుకోవాలి.

“మన దేశం ఆధునికంగా పురోగమించకుండా బలంగా అడ్డుపడుతున్నవి గతానికి సంబంధించిన ఛాందస వ్యవస్థలు. అంటే కుల వివక్ష, అణచివేత, పితృస్వామిక వ్యవస్థ, ఖాప్ పంచాయితీలు, మతపరమైన మైనారిటీల పట్ల చిన్నచూపు వంటివి మాత్రమే కాదు, నయా ఉదారవాద వినిమయ విలువలు కూడా గత కాలపు వ్యవస్థలను సజీవంగా ఉంచుతూ వాటికి మరింత దన్నుగా వ్యవహరిస్తున్నాయి.” ఇలాంటి శక్తివంతమైన ప్రభావాలను శక్తివంతంగానే ఎదుర్కోవాలి. చైతన్యయుతంగా తలపడాలి. ఈ క్రమంలో ఎదురయ్యే ఆటంకాలు అనేక రూపాల్లో ఉండవచ్చు. “ప్రతి నిర్ణయానికీ మినహాయింపులుంటాయి. కొంత సడలింపు వల్ల నష్టమేమిట”న్న అభిప్రాయాలూ సహజమే. మినహాయింపుల పేరుతోనే చైతన్యయుతంగా చేయాల్సిన కృషి బలహీన పడడం అనేక సందర్భాల్లో అనుభవమే కదా! అంతేకాదు... మన వేషధారణ, వ్యక్తిగత ప్రవర్తన, సౌకర్యాలు పెద్ద సమస్య కాదని, పట్టించుకోవాల్సిన అవసరం లేదన్న అభిప్రాయాలూ ఉన్నాయి. వర్గ పోరాటం చేస్తున్నామా లేదా అన్నదే ముఖ్యమన్న భావన కూడా ఉన్నది. ఇక్కడే పార్టీ కేంద్రకమిటీ తీర్మానం చెప్పిన మరో విషయం గమనించాలి.

“మనం కొత్త సంస్కృతిని నిర్మించడం ద్వారా సమాజంపై మన భావాల ప్రత్యాధిపత్యం (కౌంటర్ హెజమొనీ) సాధించాలి. విప్లవ పరివర్తన విజయవంతం కావాలంటే మనం సాధించే ఈ ప్రత్యాధిపత్యం ఉత్పత్తి సంబంధాలను ప్రభావితం చేయాలి. సాంస్కృతిక రంగంలో మన కార్యకర్తలు చురుకుగా పాల్గొనడమే కాకుండా ప్రస్తుత సమాజంలోని ఆధిపత్య సంబంధాలను దెబ్బతీయడం కోసం ఖచ్చితంగా ఇలాంటి ప్రత్యాధిపత్యాన్ని సృష్టించాలి. మనం సృష్టించే భావజాలంలో ప్రధాన సారాంశం ఇదే.'' సారాంశం చూడాలని కారల్‌మార్క్స్ చెప్పిన విషయాన్ని మన ప్రవర్తనను సమర్థించుకోవడానికి వాడుకోకూడదు. ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించాలన్న విషయాన్ని అంగీకరిస్తూనే మరికొన్ని అభిప్రాయాలు వ్యక్తమవుతాయి. మర్యాదలు, నాయకుల ఆరోగ్యం పట్ల ఆందోళన రూపాల్లో వ్యక్తమవుతాయి. పెద్ద నాయకులు కింద చాపమీద పడుకుంటే ఎట్లా అని బాధపడతారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకం కాలేనప్పుడు ఈ మర్యాదలు,.. ఆరోగ్యాల పట్ల ఆందోళనల వల్ల సమాజానికి ప్రయోజనమేమీ ఉండదు. పాదయాత్ర బృందంతో నడిచేవారు యాభై మంది నుంచి కొన్ని వందల మంది వరకూ ఉన్నారు. వారందరికీ భోజన వసతులు కల్పించడానికి విరాళాలు వసూలు చేయడం, ఉచితంగా వచ్చేవన్నీ ఉపయోగించుకోవడం ద్వారా ఆర్థిక భారం తగ్గించుకోవచ్చు. ఒక రోజు లేదా పాదయాత్ర కాలంలో నాయకులు, కార్యకర్తలు పేదల ఇండ్లల్లో బస చేయడం, వారు పెట్టింది తినటమే ప్రత్యామ్నాయ సంస్కృతికాదు. అదొక అలవాటుగా మారాలి. కాంట్రాక్ట్, క్యాజువల్ కార్మికులు, చెత్త సేకరించే, వీధులు ఊడ్చే మునిసిపల్, గ్రామ పంచాయితీ కార్మికులు వంటి కనీస వేతనాలు లేని నిరుపేద కార్మికుల ఇండ్లల్లో బృందం నాయకులు బస చేయడం వల్ల వారి జీవన స్థితిగతులు మరింత సన్నిహితంగా గమనించడానికి ఉపయోగపడ్డాయి. సాధారణ కార్మికులకు నాయకులు సన్నిహితం కావడానికీ, కార్మికులతో మమేకం కావడం, వారి విశ్వాసం పొందడానికి ఉపయోగ పడుతున్నది. ఒక కుటుంబానికి కనీస వేతనం ఆవశ్యకతను మరింత సమర్థవంతంగా డిమాండ్ చేయడానికి కూడా ఇది బాగా ఉపయోగపడుతుంది. బూర్జువా రాజకీయ నాయకులకు భిన్నంగా కార్మికవర్గ సంస్కృతిని పెంపొందించే సాధనంగా కూడా ఉపయోగపడుతుంది. సరళీకరణ ఆర్థిక విధానాల మీద, పెట్టుబడిదారీ సంస్కృతి మీద ఇదొక పోరాటం కూడా. కుల వివక్ష సమస్యను, దళితుల, వెనుకబడిన తరగతుల సమస్యలను కుల సంఘాలకు వదిలేయకుండా కార్మికవర్గమే బాధ్యత వహించడానికి, కార్మికవర్గ పోరాటంతో మిళితం చేసి పోరాడడానికి కూడా ఉపయోగకరం. పెట్టుబడిదారీ వర్గం పెంచి పోషిస్తున్న అస్థిత్వ ధోరణులను అధిగమించి, వర్గ పోరాట చైతన్యం పెంపొందించేందుకు ఇదొక మార్గం. సంస్కరణవాద నాయకులకు భిన్నంగా వ్యవహరించే మార్గమిది. ఒక్క మాటలో చెప్పాలంటే పార్టీ కేంద్ర కమిటీ చెప్పిన ప్రత్యామ్నాయ సంస్కృతిని పెంపొందించే ప్రయత్నంలో భాగమే ఇది. తీర్మానాలు చేయడం, వాటిని అంగీకరించడం కొంత సులభం. అమలు చేయాల్సి వచ్చినప్పుడే అనేక

(మిగతా ...వ పేజీలో)

చరిత్ర

# జనపదాలు- మహా జనపదాలు


రచయిత ప్రజాశక్తి సంపాదకులు

ఎంవిఎస్ శర్మ

వేదకాలంలో వచ్చిన సాహిత్యంలో ఎక్కడా జనపదాల ప్రసక్తి లేదు. ఇనుప యుగంలోనే (క్రీ.పూ. 700– 350 సం.) ఈ జనపదాలు ఏర్పడ్డాయి. ఈ కాలంలో వచ్చిన బౌద్ధ సాహిత్యంలో జనపదాల ప్రసక్తి ఉంది. ఎక్కడికక్కడ తెగలుగా జీవించే సమూహాలు ఒక నిర్దిష్ట భూ భాగంలో ఒక జనపదంగా ఏర్పడ్డాయి. కొన్ని జనపదాలు కలిసి మహా జనపదం అయింది. ఈ మహా జనపదాన్ని పాలించే రాజు ఉండేవాడు. కొన్ని మహా జనపదాలకు కొద్దిమంది కులీనులతో కూడిన ఉమ్మడి పాలన ఉండేది. ఈ ఉమ్మడి కూటమిని గణం అన్నారు. ఈ పదాన్ని బట్టి అదేదో ప్రజాతంత్రయుతంగా నడిచే ప్రతినిధుల సభ అనుకోకూడదు. ఒకే రాజు బదులు కొందరు పాలకుల కూటమి

ఉమ్మడిగా ఆధిపత్యం చెలాయించడమే దాని లక్షణం.

ఈ పాలనా వ్యవస్థలో అట్టడుగున గ్రామం ఒక యూనిట్ గా ఉంటుంది. కొన్ని వ్యాపార కూడళ్ళు (నేటి టౌన్‌షిప్ ల మాదిరిగా) ఉండేవి. అటువంటి దానిని 'నిగమం' అని అన్నారు. పట్టణాన్ని నగరం అన్నారు. ఇటువంటివి కొన్ని కలిసి ఒక జనపదం అయింది. కొన్ని జనపదాలను తన అధీనంలో ఉంచుకున్నది మహా జనపదం అయింది. ఈ వ్యవస్థ ఏర్పడడానికి ప్రాతిపదిక బలాధిక్యత.

ఈ జనపదాలు, మహాజనపదాలు రూపొందే క్రమంలో ఆ భౌగోళిక ప్రాంతంలో విడివిడిగా ఉండే కొన్ని తెగలను, సమూహాలను తమ ఆధిపత్యం కిందకు బలప్రయోగంతో తీసుకువచ్చారు.

బౌద్ధ గ్రంథాలలో 16 మహాజనపదాల ప్రస్తావన ఉంది. అవి

1. అంగ : ఇప్పటి బీహార్ లోని భాగల్పూర్–మోంఘిర్ ప్రాంతం. దీని రాజధాని చంప.

2. మగధ : ఇప్పటి దక్షిణ బీహార్ ప్రాంతం. మొదట రాజగిర్ రాజధానిగా ఉండేది. తర్వాత పాటలీపుత్రం రాజధాని అయింది. (పాట్నా)

3.కాశీ : ఇప్పటి ఆగ్నేయ ఉత్తర ప్రదేశ్ ప్రాంతం. రాజధాని వారణాసి.

4. కోసల : ఇప్పటి తూర్పు ఉత్తర ప్రదేశ్. సరయూ నదికి ఇరువైపులా ఉండేది. ఉత్తర కోసలకు శ్రావస్తి, దక్షిణ కోసలకు కుశావతి రాజధానులు.

5. వజ్జి : ఉత్తర బీహార్ ప్రాంతం. విదేహ, లిచ్ఛవి, జ్ఞాత్రిక, వజ్జి వంటి గణాలతో కూడిన సమాఖ్యగా ఉండేది. వైశాలి ప్రధాన కేంద్రంగా ఉండేది.

6. మళ్ళ :ఈశాన్య ఉత్తర ప్రదేశ్ ప్రాంతం. ఇది కూడా 8, లేక 9 గణాల సమాఖ్య. కుశీనార, పావ అనేవి ప్రధాన పట్టణాలు.

7, ఛేది : ప్రస్తుత బుందేల్‌ఖండ్ ప్రాంతం.

8. వచ్ఛ : ప్రస్తుత అలహాబాద్ పట్టణానికి పరిసర ప్రాంతాలు. కోశాంబి రాజధాని

9. కురు : పశ్చిమ యు.పి,, హర్యానా ప్రాంతం. హస్తినాపురం, ఇంద్రప్రస్తం రాజధానులు

10. పాంచాల : పశ్చిమ యు.పి. ప్రాంతం. అహిచ్ఛత్ర, కాంపిల్య రాజధానులు.

11. మచ్ఛ (మత్స్య) : తూర్పు రాజస్తాన్ ప్రాంతం. జైపూర్ పరిసర ప్రాంతం. విరాట (ఇప్పటి బైరాట్) రాజధాని

12.శూరసేన : ఉత్తర ప్రదేశ్ లోని భాగం. మధుర రాజధాని

13. అస్సక : వింధ్య పర్వతాలకు దిగువ, మహారాష్ట్ర ప్రాంతం. పొతాన రాజధాని (ఇప్పటి పటన్)

14. అవంతి : దీనినే మాళ్వ అని కూడా అంటారు. పశ్చి మధ్యప్రదేశ్ ప్రాంతం. ఉజ్జయిని రాజధాని.

15. గాంధార : వాయవ్య పంజాబ్. తక్షశిల రాజధాని

16. కాంభోజ : ప్రస్తుత ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతం.

ఈ మహా జనపదాలన్నీ ఉత్తర భారత దేశంలోను, వాయవ్య భారతదేశంలోను ఉన్నాయి. దక్కను, బెంగాల్, అస్సాం, సింధ్, ఒరిస్సా ప్రాంతాలలో ఇటువంటివి ఉన్న ప్రస్తావనలు లేవు.

జైన గ్రంథాలలో కూడా మహా జన పదాల ప్రస్తావనలు ఉన్నాయి. పైన పేర్కొన్నవి గాక మరికొన్ని మహా జనపదాలుఉన్నట్టు వాటిని బట్టి నిర్ధారించవచ్చు. కళింగ, విదేహ, కేకయ, సురత్త వంటి మహా జనపదాలను ఈ గ్రంథాలు పేర్కొన్నాయి.

క్రీ.పూ. 350 కాలానికి చెందిన పాణిని దాదాపు 175 జనపదాలను పేర్కొన్నాడు. వీటిలో చాలా భాగం వాయవ్య ప్రాంతానికి చెందినవే. పాణిని ఆ ప్రాంతపు వాసి కావడం వలన అక్కడి జనపదాలనే ఎక్కువగా పేర్కొనివుండవచ్చు. దీనిని బట్టి మొత్తం భారత ఉపఖండంలో చాలా ఎక్కువ జనపదాలు ఏర్పడివుండాలి. జనపదం అనేదానిని ఇప్పటి చిన్నపాటి మండలంతో సరిపోల్చవచ్చు.

మగధ, కాశీ, కోసల, అవంతి, వచ్ఛ వంటి మహా జనపదాలు తమలో తాము నిరంతరం ఘర్షణల్లో మునిగి తేల్తూవుండేవి. మరోపక్క వాటి పాలకుల కుటుంబాల నడుమ వివాహ సంబంధాలు కూడా ఉండేవి. ఐనా యుద్ధాలు జరుగుతూండేవి.

వైదిక మతం లేదా బ్రాహ్మణ

> **"రాచరికం అనేది ప్రభువుకు, ప్రజలకు మధ్య ఏర్పడిన ఒక సామాజిక ఒప్పందం అని, ప్రజలకు అన్ని విధాల రక్షణను కల్పించడం ప్రభువు బాధ్యత ఐతే, ఆ ప్రభువుకు తమ ఉత్పత్తిలో కొంత భాగాన్ని చెల్లించడం ప్రజల బాధ్యత అని చెప్పాయి. బలమున్నవాడిదే రాజ్యం అనే ప్రాతిపదికన ఏర్పడిన రాచరిక వ్యవస్థకు ఆమోదముద్ర వేసే సిద్ధాంతమే ఇది."**

మతం కేవలం క్షత్రియులే అధికారం చేపట్టడానికి అర్హులు అని ప్రకటించింది. ఐతే తమ బలాధిక్యతతో జనపదాల్లో, మహా జనపదాల్లో అధికారం పొందినవారిలో చాలామంది క్షత్రియులు గా జన్మించలేదు. వైదిక మతం వారి పాలనార్హతను అంగీకరించదు. ఆ కాలంలో పుట్టుకొచ్చిన బౌద్ధం, జైనం బ్రాహ్మణ మతాన్ని ప్రశ్నించాయి. రాజు దైవాంశ సంభూతుడు అనే వాదనను తిరస్కరించాయి. రాచరికం అనేది ప్రభువుకు, ప్రజలకు మధ్య ఏర్పడిన ఒక సామాజిక ఒప్పందం అని, ప్రజలకు అన్ని విధాల రక్షణను కల్పించడం ప్రభువు బాధ్యత ఐతే, ఆ ప్రభువుకు తమ ఉత్పత్తిలో కొంత భాగాన్ని చెల్లించడం ప్రజల బాధ్యత అని చెప్పాయి. బలమున్న వాడిదే రాజ్యం అనే ప్రాతిపదికన ఏర్పడిన రాచరిక వ్యవస్థకు ఆమోదముద్ర వేసే సిద్ధాంతమే ఇది. ఐతే అధికారం చేపట్టినవారికి మత పరంగా సమర్ధన లభించింది. కనుక చాలా జనపదాల్లో బౌద్ధం. జైనం ప్రభువుల ఆదరణకు నోచుకున్నాయి.

ఈ రాజ్యాల్లో పాలనకు పైనుంచి కిందివరకు వివిధ దొంతరల అధికార వ్యవస్థ ఏర్పడింది. కేంద్రీకృతమైన అధికారాలు దీని ప్రాతిపదిక. ఈ వ్యవస్థకు ఆధారం క్రమం తప్పకుండా ప్రజలనుండి వసూలు చేసే పన్నులు. యుద్ధాలు జరిగితే సమీకరించే సైన్యం కాకుండా అనునిత్యం విధుల్లో కొనసాగే సైన్యం ఉండేది. యజ్ఞం, క్రతువులు తమ పూర్వ ప్రాధాన్యతను కోల్పోయాయి. గతంలో అవి అధికారానికి ప్రతీకలుగా ఉండేవి. ఇప్పుడు బలాధిక్యతే ప్రాతిపదిక అవడంతో అవి కేవలం మత పరమైన కార్యక్రమాలుగా పరిమితం అయి పోయాయి.

ఈశాన్య భారతంలో, వాయవ్య భారతంలో కొన్ని రాజ్యాలు గణ రాజ్యాలుగా ఉండేవి. సర్వాధికారాలూ కలిగివుండే రాజుల పాలనలో నడిచిన రాజ్యాలతోబాటు ఈ తరహా రాజ్యాలు దాదాపు వేయి సంవత్సరాలపాటు కొనసాగాయి. పాలనా వ్యవస్థలో తేడాలు పెద్దగా లేకపోయినా ఈ గణ రాజ్యాలలో ఒకే వ్యక్తి అన్నింటినీ నిర్ణయించే అధికారం మాత్రం లేదు. ఐతే, ఈ గణ రాజ్యాలు ఏకవ్యక్తి పాలనవైపు మార్పుచెందేలోపే చాలా వాటిని ఇతరులు ఆక్రమించుకున్నారు. మగధ రాజ్యం లిచ్ఛవీ గణ రాజ్యాన్ని ఆక్రమించుకున్నది ఈ విధంగానే.

**వాయవ్య భారత ఉప ఖండంలో**

ముందు పేర్కొన్న 16 మహా జనపదాల్లో కాంభోజ, గాంధార మహా జనపదాలు రెండూ వాయవ్య ప్రాంతం లోనివి. కాంభోజ ప్రస్తుత ఆఫ్ఘనిస్తాన్ లోని కాబూల్ లోయ ప్రాంతంలో ఏర్పడింది. గాంధారం తక్షశిల రాజధానిగా వాయవ్య పంజాబ్ లో ఏర్పడింది. ఈ ప్రాంతం ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉంది. తక్షశిల ఇస్లామాబాద్ సమీపంలో ఉంది. ఈ వాయవ్య ప్రాంతం అంతా ఇరాన్‌కు చెందిన ఎకిమేనియన్ సామ్రాజ్యంలో భాగంగా దాదాపు క్రీ.పూ. 350 వరకూ ఉండేది. ఎకిమేనియన్ చక్రవర్తులలో డారియస్-3 అనేవాడు క్రీ.పూ. 331లో గ్రీక్ చక్రవర్తి అలెగ్జాండర్ తో చివరి యుద్ధం చేశాడు.

తన దండయాత్ర గురించి రాసిన గ్రంథాలలో ఈ వాయవ్య ప్రాంతం గురించి అలెగ్జాండర్ గమనించినది చూస్తే ఈ ప్రాంతం అంతా చిన్న చిన్న, స్వతంత్ర రాజ్యాలుగా, కొండజాతి తెగల రాజ్యాలుగా ఉండేది. అంటే అప్పటికి ఎకిమేనియన్ చక్రవర్తుల ఆధిపత్యం బాగా బలహీనపడిందని భావించవచ్చు. పాణిని తనగ్రంథాలలో ఈ ప్రాంతాన్ని అశ్వభూమిగా పేర్కొన్నాడు. చాలా రోజులపాటు అలెగ్జాండర్ సైన్యాన్ని ఈ ప్రాంతం ప్రతిఘటించింది.

సింధు, బియాస్ నదుల మధ్య ప్రాంతం లో పోరస్ (పురుషోత్తముడు) రాజ్యం ఉండేది. ఈ రాజ్యంలో అభివృద్ధి చెందిన పట్టణాలు ఎక్కువ సంఖ్యలో ఉండేవి. బియాస్ నదిని దాటి దండయాత్రను కొనసాగించడానికి తన సైన్యంలో ప్రతిఘటన ఎదురుకావడంతో అలెగ్జాండర్ తిరుగుముఖం పట్టాడు. ఆ తిరుగు యాత్ర పంజాబ్, సింధ్ లకు దక్షిణాన ఉన్న రాజ్యాల మీదుగా సాగింది. మాలవ, క్షుద్రక వంటి గణాల సమాఖ్యలు ఈ ప్రాంతంలో అలెగ్జాండర్‌కు కొంత ప్రతిఘటన ఇచ్చినా చివరకు లొంగిపోయాయి.

గ్రీకు చరిత్రకారులు నమోదు చేసిన వివరాలను పరిశీలిస్తే ఈ వాయవ్య భారతంలో రాజ్యాలు చాలా భారీగా సైన్యాలను కలిగివుండేవని కనపడుతుంది. 30,000 నుండి ఒక లక్ష వరకు పదాతి దళాలు, 3000 నుండి 20,000 వరకు అశ్వికదళాలు, వందల సంఖ్యలో ఏనుగులు, రథాలు ఒక్కో రాజ్యానికి ఉన్నట్టు ఆ నివేదికలు సూచిస్తున్నాయి. ఇంత భారీగా సైన్యం ఉండేది అంటే అక్కడ బలమైన పన్నుల వ్యవస్థ ఉండివుండాలి. పట్టణాల సంఖ్య గణనీయంగా ఉండడం బట్టి వ్యవసాయం నుండి వచ్చే మిగులులో ముఖ్యమైన భాగాన్ని పట్టణాల నిర్వహణకు తరలించారని భావించాలి.

**మహా జనపదాలలో సామాజిక-సాంస్కృతిక జీవనం**

బౌద్ధ గ్రంథాలను పరిశీలిస్తే మహా జనపదాలలో నెలకొన్న సామాజిక పరిస్థితులు, సాంస్కృతిక జీవనం కొంత తెలుస్తుంది.

ఒక జనపదం నుండి మరొక జనపదానికి వ్యాపారం నిమిత్తం తరలించే సరుకులు భారీపరిమాణాల్లో ఉండేవి. వెయ్యికి పైగా బండ్లతో కూడిన బృందాలు ఉండేవని, ఆ ఎడ్లు నడిచిన కారణంగా దారులన్నీ కాలినడకన పోయేదానికి ఇబ్బందికరంగా మారాయని, అందుచేత మధ్యదేశపు జనపదాల్లో సంచరించే బౌద్ధ సన్యాసులు కాళ్ళకు పాదరక్షలు ధరించవచ్చునని బుద్ధుడు అనుమతిచ్చినట్టు పేర్కొన్నారు. దక్షిణ జనపదాల్లో ఎక్కువగా విందులు, నృత్యాలు, గాన కచేరీలు సాగేవని, అటువంటి కార్య కలాపాలు నిర్వాణానికి (ముక్తికి) ఆటంకం అని బుద్ధుడు ప్రకటించాడు. బ్రాహ్మణ మతం నిర్దేశించిన వర్ణ వ్యవస్థ ఆమోదయోగ్యం కాదని, పుట్టుకతోటే ఎక్కువ తక్కువలు

నిర్ణయించలేమని వర్ణ వ్యవస్థను విమర్శిస్తూ, దానికి భిన్నంగా ఉండిన కాంభోజ రాజ్యం గురించి బుద్ధుడు పేర్కొన్నాడు. ఆ రాజ్యంలో యజమానులు, బానిసలు అనే రెండు తరగతులు మాత్రమే ఉన్నాయని, యజమాని బానిసగాను, బానిస యజమానిగాను మారవచ్చునని వివరించాడు. లిచ్ఛవి, మళ్ళ, శాక్య వంటి గణాల ప్రజలు తక్కువ కులాలవారుగాను, సంకర వర్ణాల వారిగాను శతపథ బ్రాహ్మణం పరిగణించింది. ఈ గణాల ప్రజలు ఏ విధమైన వైదిక క్రతువులనూ ఆచరించేవారు కాదు. అంటే వైదిక సంస్కృతికి వెలుపల భిన్న సంస్కృతులు పాటించే ప్రజలు గణనీయంగా ఉండేవారని మనకు తెలుస్తోంది.

**రాజ్యాలు రూపొందిన తీరు**

ఎప్పటినుండి రాజ్యాలు ఉనికిలోకి వచ్చాయి అన్నది పరిశీలిస్తే రాజుకు పన్నులు చెల్లించడం గురించి గాని, నిత్యం రాజు వద్ద కొలువు చేసే సైన్యం గురించి గాని క్రీ.పూ.500 కు ముందు కాలపు సాహిత్యంలో ఎక్కడా ప్రస్తావించినట్టు కనిపించదు. కోసల, మగధ వంటి రాజ్యాలు అత్యంత ప్రాచీన రాజ్యాలు. అవి కూడా క్రీ.పూ. 600 కన్నా ముందు ఏర్పడ్డాయని చెప్పలేం. అయోధ్య, కౌశాంబి వంటి రాజ్యాలు క్రీ.పూ. 400 కాలంలో ఏర్పడ్డాయి.

వ్యవసాయంలో వృద్ధి ఈ రాజ్యాల ఏర్పాటుకు దారితీసిందని చెప్పాలి. అందుచేత రాజ్యాలు నదీ తీరాలను ఆనుకుని ఉన్న భూభాగాలలో ఏర్పడ్డాయి. వాటికి ఆనుకుని ఉన్న అడవుల్లో వేట, ఆహార సేకరణ మీద ఆధారపడిన తెగలు జీవించేవి. నిషాదులు, కిరాతులు, భిల్లులు, శబరులు వంటి జాతుల ప్రస్తావనలు మన సాహిత్యంలో విరివిగా కనిపిస్తాయి. వ్యవసాయం విస్తరిస్తున్నకొద్దీ ఈ తెగల భూభాగాలలోకి చొరబాటు సాగింది. రామాయణంలో రాక్షసులుగా పేర్కొన్న వారంతా ఈ తెగల ప్రజలేనని, వారిని లొంగదీసుకుని, లేదా అంతం చేసి ఆ ప్రాంతాలలో వ్యవసాయ కార్యకలాపాలను విస్తరింపజేయడమే గాథలుగా రామాయణం చిత్రీకరించిందని డి.ఆర్.ఛనా అనే చరిత్రకారుడు తన విశ్లేషణలో తెలిపారు. చంద్రగుప్తమౌర్యుడు తన సైన్యంలోకి కొండప్రాంతాల ప్రజలను చేర్చుకున్న వైనం బట్టి ఆ తెగలను లొంగదీసుకున్న అనంతరం ఏ విధంగా ఉపయోగించారన్నది అర్థం ఔతుంది.

> **“ రాజ్యాలు సుమారు క్రీ.పూ.550 నాటికి ఏర్పడడం మొదలైందని అనుకుంటే అప్పటి నుంచే పట్టణీకరణ కూడా మొదలైవుండాలి. ఐతే ఈ ధోరణి అన్ని రాజ్యాలలోనూ కనిసించదు. రాజ్యాన్ని ప్రాచీన గ్రంధాలు సప్తాంగ రాజ్యం అని వర్ణించారు. అంటే ఒకరాజ్యాన్ని గుర్తించాలంటే దానికి ఏడు అంగాలు ఉండాలి. అవి దుర్గం (కోట), అమాత్యులు (ఉన్నతాధికారులు) మిత్రులు ( రాజ్యానికి సహకరించే శక్తులు), గ్రామాలు, నిగమాలు, నగరాలు, సైన్యం. ”**

రాజ్యాలు సుమారు క్రీ.పూ.550 నాటికి ఏర్పడడం మొదలైందని అనుకుంటే అప్పటి నుంచే పట్టణీకరణ కూడా మొదలైవుండాలి. ఐతే ఈ ధోరణి అన్ని రాజ్యాలలోనూ కనిసించదు. రాజ్యాన్ని ప్రాచీన గ్రంధాలు సప్తాంగ రాజ్యం అని వర్ణించారు. అంటే ఒకరాజ్యాన్ని గుర్తించాలంటే దానికి ఏడు అంగాలు ఉండాలి. అవి దుర్గం (కోట), అమాత్యులు ( ఉన్నతాధికారులు) మిత్రులు ( రాజ్యానికి సహకరించే శక్తులు), గ్రామాలు, నిగమాలు, నగరాలు, సైన్యం. దీనికి అదనంగా రాజు ఆచరించే విధానాలు, అతని ఆదర్శాలు, భావాలు ప్రజలందరి ఆమోదం పొంది వుండాలి. పాలకవర్గ భావాల ఆధిపత్యం రాజ్యం మీద అధికారాన్ని చెలాయించడంలో కీలకం.

పన్నుల విధానం, ఆ పన్నులను వసూలు చేసి జమచేసే వ్యవస్థ రాజ్యంలో కీలకం. రాజ్యం యొక్క ధనాన్ని, దానిని ఉంచే కోశాగారాన్ని పరిరక్షించడం సైన్యం విధి. ధర్మసూత్రాలలో కాని, బౌద్ధ గ్రంధాలలో గాని ఎక్కడా రాజుకు భూమిపై సర్వాధికారాలు ఉన్నట్టు చెప్పలేదు.

పంటలో ఒక భాగాన్ని (ఆరవ వంతు, లేదా ఎనిమిదవ వంతు, లేదా పదో వంతు – ఇలా) రాజుకు విధిగా చెల్లించాలని, దాజు విధించే పన్ను దర్మబద్ధంగా ఉండాలని బుద్ధుడు పేర్కొన్నాడు. ఎంత పన్ను వసూలు చేయాలన్నది నిర్ణయించడానికి భూమిని కొలవడం అవసరం. ఇందుకోసం విస్తృతమైన రెవెన్యూ యంత్రాంగం అవసరమైంది.

రాజు ఒక్కడే పాలకుడుగా లేని జనపదాల్లో పాలక మండలి (పరిషత్) ఏర్పడి పాలించేది. ధర్మసూత్రాలలో పేర్కొన్నది చూస్తే ఈ పరిషత్ లలో ప్రధానంగా బ్రాహ్మణులే సభ్యులుగా ఉండేవారు.

పన్నులద్వారా వసూలైన సంపదను సైన్యం పోషణకోసం, పురోహితులను, అంత: పురాన్ని, ఆయుధాగారాన్ని, వృత్తిదారులను, సేవకులను పోషించడానికి వినియోగించేవారు. సంపద ఉత్పత్తిలో భాగం పంచుకోని వర్గాల వారు రాజు పాలనను, విధానాలను సమర్ధించడమే ప్రధాన బాధ్యతగా పనిచేసేవారు. ఈ క్రమంలోనే మతాన్ని పోషించడం రాజుకు ఒక అవసరం అయింది. తన పాలనను సమర్థించే పురో హితవర్గాన్ని ఆదరించి బలపర చడం కోసం మతాన్ని రాజులు పోషించారు.

❃

## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**
**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

ప్రభుత్వ విధానాలు

# లేబర్ కోడ్‌లు: కార్మికవర్గంపై దాడి


రచయిత సీనియర్ జర్నలిస్టు, రచయిత

**టికె రాజలక్ష్మి**

వాణిజ్యాన్ని సులభతరం చేసే నెపం మీద గతమూడు దశాబ్దాలుగా ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయి. ఈ క్రమంలో అమలులోకి వచ్చినవే ఈ మధ్యనే ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లు.

జూన్ 30వ తేదీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ ఒక ఆర్డినెన్స్‌కు ఆమోదముద్ర వేశారు – అదే 2021 అత్యవసర రక్షణ సేవల ఆర్డినెన్స్. ఇది రక్షణరంగంలో సమ్మెలను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వానికి అధికారాలిచ్చింది. ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటే, లేదా చట్ట వ్యతిరేక సమ్మెలకు ఉసిగొల్పితే, ఉద్యోగులను తొలగించడంతో సహా ఎటువంటి క్రమశిక్షణా చర్యలనైనా తీసుకునే హక్కు ఈ ఆర్డినెన్స్ కేంద్ర ప్రభుత్వానికిచ్చింది. నేరం చేసినట్టు అనుమానించిన ఏ వ్యక్తినైనా, ఏ విధమైన వారెంట్ లేకుండా అదుపులో తీసుకునే అధికారం ఈ ఆర్డినెన్స్ పోలీసులకు కల్పించింది. సహజంగానే ఈ చట్టాన్ని కార్మికసంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి.

కార్మికుల మీద, కార్మిక హక్కుల మీద చేస్తున్న అనేకానేక దాడులలో ఈ ఆర్డినెన్స్ ఒకటి; గత ఏడు సంవత్సరాలుగా జరుగుతున్న నిరంతర ప్రక్రియ ఇది. కార్మికులను అణచివేయడం చాలాకాలం నుండి జరుగుతున్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోడి నాయకత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ఆధ్వర్యంలో జరుగుతున్నంత తీవ్రంగా ఇదివరకెన్నడూ జరగలేదు. ఈ ఆర్డినెన్స్‌లో సమ్మెకు ఇచ్చిన నిర్వచనం పారిశ్రామిక వివాదాల చట్టం ఇచ్చిన నిర్వచనానికంటే, కొత్తగా రూపొందించబడిన కార్మికకోడ్‌లో కంటే లోతైనది. సమ్మె అంటే ఒక పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు అందరూ కలిసి ఆ పనిని మూకుమ్మడిగా వదిలిపెట్టడం; లేదా ఒక పరిశ్రమలో పనిచేసే కార్మికులలో 50 శాతానికి మించి క్యాజువల్ సెలవులు పెట్టడం వంటి చర్యల ద్వారా పని చేయడానికి సంఘటితంగా తిరస్కరించడం అని పారిశ్రామిక వివాదాల చట్టం అంటుంది. కానీ ఇప్పుడు అమలులోకి తెచ్చిన చట్టంలో సమ్మె అంటే ఆ రోజులో చేయాల్సిన పనిగంటల కన్నా అదనపు పనిగంటలు పని చేయటానికి నిరాకరించడం, లేదా చేయాల్సిన పని మానడం, పనికి ఆటంకం కలిగించడం, అత్యవసర రక్షణ సేవలకు తిరస్కరించటంగా నిర్వచించారు. అంటే కొత్త చట్టం ప్రకారం సమ్మె చేయడమే కాదు, యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా తమ భావాలను తెలపడం కూడా సమ్మె కిందికే వస్తుంది.

దేశ సార్వభౌమత్వానికి, ఐక్యతా ప్రయోజనాలకు, రాజ్య రక్షణకు, ప్రజా ప్రయోజనాలకు, గౌరవానికి, నైతికతకు భంగం కలుగుతుందనుకుంటే ఈ చట్టం కింద సమ్మెను నిషేధించే అధికారాలు ప్రభుత్వానికి ఉంటాయి. ఇది 1926 కార్మిక వివాదాల చట్టంతో సహా అన్ని చట్ట పరిధులను అతిక్రమిస్తున్నది.

చట్ట వ్యతిరేకమైన సమ్మెను ప్రారంభించిన వ్యక్తికి, లేదా అందులో పాల్గొన్న వ్యక్తికి ఒక ఏడాది జైలు శిక్ష, రు.10,000/– జరిమానా లేదా రెండు కలిపి విధించవచ్చు. సమ్మెను ప్రేరేపించిన వ్యక్తికి లేదా ఉసిగొల్పిన వ్యక్తికి రెండేళ్ల వరకు జైలు శిక్ష, రూ 15000/– జరిమానా లేదా రెండు కలిపి విధించవచ్చు.

సమ్మె నిషేధించబడినదని ఎవరు నిర్ణయిస్తారో చట్టంలో ఎక్కడా చెప్పలేదని, పైగా చట్టంలో ఎక్కడా నిందితునికి అండగా నిలిచేందుకు, యాజమాన్యాలతో చర్చలు జరిపేందుకు ఎటువంటి నిబంధనలు లేవని సిఐటియు ఎత్తి చూపింది.

**కార్మికులపై సంస్కరణల ప్రభావం**

గత ముప్పై ఏళ్లుగా అమలు చేస్తున్న ఆర్థిక సంస్కరణల ప్రభావం కార్మికులపై, కార్మిక సంస్కరణలపై ఎలా ఉన్నది అనే విషయం అతి తక్కువగా చర్చించబడిన అంశాలలో ఒకటి. నిజానికి ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన 1991 నుండి వ్యాపారాన్ని సులభతరం చేయడం, కార్మిక సంస్కరణలు ప్రతి ప్రభుత్వానికి అత్యంత ప్రీతిపాత్రమైన విషయాలుగా ఉన్నాయి. నియంత్రణలను తొలగించడం, పర్యవేక్షణా యంత్రాంగాన్ని నీరుగార్చటం అనే అంశాలకు విస్తృతమైన మద్దతు నివ్వాలన్నదే వారి అభిప్రాయం; పరిశ్రమలు తమ పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోకుండా కార్మిక చట్టాలు అడ్డుకుంటున్నాయని భావించటం, కార్మికులను, ఉద్యోగులను అకస్మాత్తుగా తొలగించడం, ఫ్యాక్టరీలను మూసివేయడం వగైరా విషయాలపై కార్మికులకు మద్దతుగా కొన్నైనా నిబంధనలు ఉండడం, కార్మిక చట్టాలపై ఇటువంటి దాడులు పురిగొల్పడానికి అసలైన కారణాలు. కార్మికసంఘాల కార్యక్రమాలు యజమానులకు కంటగింపుగా ఉండేవి; అందువలన కార్మికులు సంఘాలలో చేరడాన్ని నిరుత్సాహపరచడం అవసరమైంది.

కార్మికులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఉండడమే ఉత్పత్తిని పెంచడానికి అవరోధంగా భావించారు. (పర్మినెంట్ పనులకు పర్మినెంట్ ఉద్యోగులను నియమించాలని సుప్రీం కోర్టు తీర్పు ఉన్నప్పటికీ) పర్మినెంట్ పనులకు కూడా టెంపరరీ నియామకాలు చేయడం, తక్కువ కాల పరిమితులకే నియోగించడం, తమకు అవసరమైన పనిని ఇతర సంస్థలకు ఇచ్చి చేయించడానికి (అవుట్ సోర్సింగ్ ) ప్రభుత్వంతో సహా యాజమాన్యాలు మొగ్గుచూపాయి.

ప్రధాన యజమాని అనే విధానం,

యజమానుల బాధ్యతలు క్రమంగా తరుగుతూ వచ్చాయి. ఈ కాలంలోనే స్వేచ్ఛా మార్కెట్, పోటీ పేరుతో ప్రభుత్వరంగం, ప్రభుత్వ నియంత్రణలోని అన్ని సంస్థలు క్రమంగా నిర్వీర్యం చేయబడ్డాయి. కార్మికుడిని నిరంతరంగా అభద్రతకి గురిచేస్తేనే అతని పని సామర్థ్యం పెరుగుతుందనే తప్పుడు అవగాహన సర్వసాధారణంగా ఉండేది. అయితే అది తప్పని తేలిపోవడం వేరే విషయం.

“ 1990లలోనే కాంట్రాక్టు వ్యవస్థ వేళ్లూనుకుంది. కానీ పర్మినెంట్, టెంపరరీ ఉద్యోగుల నిష్పత్తి 60:40 గా ఉండేది. ఈ రోజు సాధారణంగా పరిశ్రమలలో స్థిరమైన ఉద్యోగులు 30 శాతం కన్నా ఎక్కువ లేరు. అత్యధికులు, అంటే 70 నుంచి 80 శాతం కార్మికులు కాంట్రాక్టు కార్మికులే. ఇదే ధోరణి బడా అటో మొబైల్ పరిశ్రమల విషయంలో కూడా కనబడుతుంది. ”

**పారిశ్రామిక అలజడి**

2005లో హర్యానాలోని గుర్గావ్‌లో హీరో హొండా కార్మికులపై లాఠీచార్జి జరగడంతో దేశం ఒక్కసారి ఉలిక్కి పడింది. ఇటువంటి సంఘటనలు కేవలం హర్యానాలో మాత్రమే జరగడం లేదు; దేశవ్యాప్తంగా జరుగుతూనే ఉన్నాయి. హర్యానాలో జరిగిన సంఘటన వాటికి ఒక మచ్చుతునక మాత్రమే. గుర్గావ్‌లో కార్మికులు సంఘాన్ని ఏర్పరచుకునే హక్కును డిమాండ్ చేయడమే లాఠీఛార్జికి కారణం. ఆటో మొబైల్, ఆటో విభాగం ఉత్పత్తి యూనిట్లలో దేశవ్యాప్తంగా ఇటువంటి సంఘటనలు అనేకం జరిగాయి. అయితే అవేవీ వెలుగు చూడలేదు.

ఆందోళనలు జరగడం సర్వసాధారణ విషయంగా మారిపోయాయి; తమ వేతన సవరణ ఒప్పందాలు జరగక పోవడానికి యాజమాన్యాలు బాధ్యత వహించాలని కార్మికులు అంటున్నారు. ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు చూస్తూ కూర్చున్నాయి; పారిశ్రామిక ప్రాంతంలో రక్షణ పెంచే బదులు అసలు సమావేశాలు నిర్వహించుకోవడం గగనంగా మార్చేశాయి. పారిశ్రామిక అశాంతిని భరించే ప్రసక్తే లేదన్న–కార్మికుల హక్కుల కోసం డిమాండ్ చేయటం– సందేశం స్పష్టం. కార్మికులకు సంఘటితం కావడం దాదాపు అసాధ్యమైంది. కార్మికచట్టాలను అమలు చేయాల్సిన కార్మికశాఖ అధికారులు వాటిని నవ్వులపాలు చేశారు. స్థిరమైన ఉద్యోగుల సంఖ్య తగ్గడం వేగవంతమైంది; యాజమాన్యా లు కాంట్రాక్టు పద్ధతిలో కార్మికులను నియమించుకోవడానికి మొగ్గు చూపారు.

సిఐటియు హర్యానా శాఖ ఉపాధ్యక్షుడు సత్బీర్ సింగ్ ఫ్రంట్ లైన్‌తో మాట్లాడుతూ 1980, 1990 దశకాలలో పరిస్థితులు భిన్నంగా ఉండేవని, 2014లో అవి మరింత దిగజారాయాయని అన్నారు. 2005లో కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఉండేది. అందువలనే హీరో హొండా కార్మికుల ఆందోళన ఫలితాలు వేరుగా ఉన్నాయి. కార్మికులపై జరిగిన పాశవిక పోలీసుల దాడులతో పార్లమెంట్ అట్టుడికి పోయింది. ఇది దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా కూడా విస్తృతమైన ప్రచారాన్ని పొందింది. అప్పటి హర్యానా ముఖ్యమంత్రి కార్మికులతో, వారి ప్రతినిధులతో చర్చించేందుకు ఈ పరిణామాలు ఒత్తిడి తీసుకొచ్చాయి. కార్మికులు తిరిగి నియమించబడ్డారు; కార్మిక సంఘం పునఃస్థాపితమైంది.

1990లలోనే కాంట్రాక్టు వ్యవస్థ వేళ్లూనుకుంది. కానీ పర్మినెంట్, టెంపరరీ ఉద్యోగుల నిష్పత్తి 60:40 గా ఉండేది. ఈ రోజు సాధారణంగా పరిశ్రమలలో స్థిరమైన ఉద్యోగులు 30 శాతం కన్నా ఎక్కువ లేరు. అత్యధికులు, అంటే 70 నుంచి 80 శాతం కార్మికులు కాంట్రాక్టు కార్మికులే. ఇదే ధోరణి బడా అటో మొబైల్ పరిశ్రమల విషయంలో కూడా కనబడుతుంది. విక్రయ కంపెనీలలో సగటున 100 మంది స్థిరమైన నియామకాలు ఉంటే 600 మంది అస్థిర నియామకాలు ఉన్నాయి.

పైగా పరిశ్రమలు మూసివేయడం, ఉద్యోగులను తొలగించడం సర్వసాధారణంగా మారిపోయింది. ఉదాహరణకి గుర్గావ్‌లోని ధారహేరా కార్మికవాడలో రికో ఆటో ఇండస్ట్రీస్ 250 మంది కార్మికులను 2021 ఏప్రిల్‌లో తొలగించింది; అందులో 119 మంది పర్మినెంట్ ఉద్యోగులుగా నియమించబడిన వారు కూడా ఉన్నారు. కార్మికులు జులై 5వ తేదీ నుంచి నిరసన తెలియచేస్తూనే ఉన్నారు. కార్మికులకు చెల్లించవలసిన పరిహారం చెల్లించేశామని కంపెనీ చెప్తున్నది. ఎవరినీ తిరిగి ఉద్యోగాలలోకి తీసుకోలేదు.

డిమాండ్ నోటీసులు ఏళ్ల తరబడి పరిశీలించకుండా అట్టే పెట్టుకుంటున్నారు. ఇదివరకు కార్మికులు నిరసన తెలియజేయటం ద్వారా కొంత బేరసారాల శక్తిని పెంచుకొనేవారు. కానీ నేడు యాజమాన్యాల అణచివేత చర్యల వల్ల, వారు చర్చలకు రావడానికి చూపుతున్న అయిష్టత కారణంగా, కేవలం నిరసన తెలియజేయడానికి సంఘటితం చేయడం కూడా ఒక సవాలుగా మారింది అంటున్నారు సత్ బీర్ సింగ్.

హర్యానాలోని పానిపట్, సోనీపేట జిల్లాలలో చాలా పరిశ్రమలు మూతపడ్డాయి. సోనీపేటలోని ఒక చెప్పుల పరిశ్రమ ఒక ఏడాది కిందట 250 మంది కార్మికులను తొలగించింది. మూసివేయడం, లాకౌట్ ప్రకటించడం, ఉద్యోగులను తొలగించడం కాదు. పరిశ్రమ తెరవడం ఆపేసాడు. ఈ ఏడాది ఏప్రిల్ – మే మధ్యకాలంలో సోనీపేట్‌లోని ఒక సైకిల్ తయారు చేసే పరిశ్రమలో 250 మంది కార్మికులను పనుల నుండి తొలగించారు.

ప్రభుత్వ యంత్రాంగం గురించి చెబుతూ కార్మిక శాఖ కమిషనర్ అనుమతి లేకుండా కార్మికశాఖ జోక్యం చేసుకోదన్నారు. వాస్తవానికి కార్మికశాఖ కోరలు లేని పులి. యాజమాన్యం కార్మికులకు చెల్లించవలసిన ప్రావిడెంట్ ఫండ్ గాని, ఇఎస్ఐ కి చేయాల్సిన చెల్లింపులు గాని చేయవు. కార్మికులు నిరసన తెలియచేస్తే మాత్రం అణచివేతకు పాల్పడతారు. ప్రభుత్వానికి సామాజిక, రాజకీయ బాధ్యత ఏ మాత్రం లేదు. కార్మికులపై 307 శిక్షాస్మృతి (హత్యా ప్రయత్నం చేసినందుకు) కింద కేసులు బనాయిస్తున్నారు అంటారు సత్ బీర్ సింగ్. 2012లో 2005 పునరావృతమైంది. అయితే ఈ సారి సంఘటన జరిగింది మరో పెద్ద కంపెనీ–మారుతి సుజుకిలో; ఆనాడు హర్యానాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నది. మారుతి సుజుకి 546 మంది రెగ్యులర్ కార్మికులను పనిలో నుంచి తొలగించింది. వారిపై హత్య, హత్యా ప్రయత్నం కేసులు బనాయించింది.

> **❝ యజమానుల నుంచి, కార్పొరేట్ల నుంచి వస్తున్న ఒత్తిడులకు ప్రభుత్వం తల ఒగ్గుతున్నదని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. పార్లమెంట్ లోపల, వెలుపల కూడా వామపక్షాలు ఈ కార్మిక కోడ్‌లను నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తు న్నాయి. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలకు విధేయంగా ఉండే భార తీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్) కూడా ఎన్‌డిఏ ప్రభుత్వ నిర్ణయాలను ప్రతిసారి వ్యతిరేకించవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ❞**

ఇప్పటికీ 13 మంది కార్మికులు జైళ్లలో ఉన్నారు. కేసు హైకోర్టులో పెండింగ్‌లోనే ఉంది.

కార్మికకోడ్‌లు ప్రవేశపెట్టిన తర్వాత పరిస్థితులు మరింత దిగజారాయని అన్ని కార్మిక సంఘాలు ఏకగ్రీవంగా అంగీకరిస్తున్నట్టు సత్‌బీర్ సింగ్ అంటున్నారు. కార్మిక చట్టాలు రక్షణ కల్పించే అంశాలను కార్మికకోడ్‌లు నీరుగార్చాయి. స్వాతంత్ర్యానికి పూర్వం నుండి అమలులో ఉన్న 40 కార్మిక చట్టాలను కుదించి 4 కార్మిక కోడ్‌లుగా మోడీ ప్రభుత్వం రూపొందించింది. కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌తో సహా అన్ని కార్మిక సంఘాలు ఈ కార్మిక కోడ్‌లను వ్యతిరేకించాయి.

### కార్మిక కోడ్‌లకు వ్యతిరేకత

2021 జనవరిలో పది కార్మిక సంఘాలు, సిఐటియు, ఏఐటియుసి, ఐఎన్‌టియుసి, హింద్ మజ్దూర్ సభ, అల్ ఇండియా యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, ఆల్ ఇండియా కో–ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్, సెల్ఫ్ ఎంప్లాయిడ్ ఉమెన్స్ అస్సోసియేషన్, లేబర్ ప్రోగ్రెసివ్ ఫెడరేషన్, ట్రేడ్ యూనియన్ కో–ఆర్డినేషన్ కమిటీలు ఏ చర్చలు లేకుండా లోక్‌సభ ఆమోదించిన కార్మికకోడ్‌లను తిరస్కరించాయి.

యజమానుల నుంచి, కార్పొరేట్ల నుంచి వస్తున్న ఒత్తిడులకు ప్రభుత్వం తల ఒగ్గుతున్నదని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. పార్లమెంట్ లోపల, వెలుపల కూడా వామపక్షాలు ఈ కార్మిక కోడ్‌లను నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలకు విధేయంగా ఉండే భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్) కూడా ఎన్‌డిఏ ప్రభుత్వ నిర్ణయాలను ప్రతిసారి వ్యతిరేకించవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఏ ప్రణాళికా లేకుండా 50 కోట్లమంది కార్మికులపై దాడి జరగటం లేదు. కార్మికులు, యజమానులు, ప్రభుత్వ ప్రతినిధులతో కలిసి ప్రతి సంవత్సరం నిర్వహించుకునే భారత కార్మిక సదస్సు (ఐఎల్‌సి) గత ఐదేళ్లుగా జరగడం లేదు. సాధారణంగా ప్రధాని ఐఎల్‌సిని ప్రారంభిస్తారు; కార్మికశాఖ మంత్రి అధ్యక్షత వహిస్తారు.

కాలక్రమంలో ఐఎల్‌సి కేవలం ఒక నామ మాత్రపు సంస్థగా తయారైంది. ఎన్‌డిఏ పాలనలో మరో అడుగు ముందుకేసి ఏదో ఒక సాకు చెప్పి కనీసం సమావేశం కూడా నిర్వహించటం లేదు. త్రిసభ్య సమావేశం అంటే కేవలం ముగ్గురు కలిసి సమావేశం నిర్వహించుకోవడం కాదు. వారు అన్ని కోడ్‌లను గురించి చర్చించడానికి సమావేశానికి పిలిచారు. కానీ ఒక్క వాక్యాన్ని కూడా మార్చలేదు. కార్మిక సంస్కరణలు అంటే క్రమబద్ధీకరణలనేవేవీ లేకుండా చేసే క్రమంలో భాగాలే అన్నారు సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్. వీటన్నిటి ఉద్దేశం ఉత్పత్తి ఖర్చు తగ్గించడం. కార్మికుల నుంచి వచ్చే ప్రతిఘటన, రాజకీయ పార్టీల నుండి కార్మికులకు వచ్చే మద్దతు వలన కార్మిక సంస్కరణలు అమలు, ప్రయివేటీకరణ వేగం కొంత తగ్గిందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్మిక చట్టాలలోని మార్పులు నిలిపివేసినప్పటికీ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, క్యాజువల్ నియామకాలు, పనిని తగ్గించుకునే విధానాలు కొనసాగుతూనే ఉన్నాయి.

కనీస వేతన చట్టం ఉన్నది కానీ కనీసం 30 శాతం కార్మికులకు కూడా అది వర్తించడం లేదు. కార్మికశాఖలో ఉద్యోగుల సంఖ్య తగ్గించి, దాన్ని నామమాత్రంగా మిగిల్చి, కేవలం పరిశీలన చేసే సంస్థగా తయారు చేశారు అన్నారు తపన్‌సేన్. వామపక్ష పార్టీలన్నీ యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్‌కి మద్దతు ఉపసంహ



సరేంద్ర మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రదర్శన

రించుకున్న తర్వాత, కార్మిక సంస్కరణలలో కొన్ని మార్పులు జరిగాయి. కానీ మోడీ పాలనలో సంస్కరణల ఉధృతి విపరీతంగా పెరిగింది. 29 కార్మిక చట్టాల్లో కార్మికులకు ఉన్న రక్షణలు ఇప్పుడు పూర్తిగా తొలగించ బడ్డాయి.

1979లో వచ్చిన 16 పేజీల వలస కార్మికచట్టం స్థానంలో వృత్తిపరమైన, ఆరోగ్య రక్షణ కోడ్ (ఓఎస్‌హెచ్) వచ్చింది. దీనిని గురించి ప్రస్తావిస్తూ సవరించబడిన చట్టంలో 180 పేజీలలో నియమాలు రూపొందించబడ్డాయి. ఇందులో యజమానులు, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలు కూడా వివరంగా పొందుపరచబడ్డాయి. ఓఎస్‌హెచ్ లో చట్టపరమైన బాధ్యతలన్నీ దాదాపు తొలగించబడ్డాయి. కార్మికులకు ఇవ్వాల్సిన రక్షణని కార్మిక కోడ్‌లు నాశనం చేశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కలిసి కార్మికుల బాధ్యత తీసుకోవాలని ప్రభుత్వం ఇప్పుడు సూత్రీకరిస్తున్నది. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు దీనికి సంబంధించిన చట్టాలు చేస్తున్నాయి; మరికొన్ని వీటిని వ్యతిరేకిస్తున్నాయి అన్నారు తపన్ సేన్.

### లాక్‌డౌన్ నష్టాలు

కోవిడ్ రెండో విడత రావడం వలన దాదాపు

> కరోనా లాక్‌డౌన్ విధించిన సమయంలో కార్మిక వర్గం పట్ల ప్రస్తుత ప్రభుత్వం అనుసరించిన తీరును గమనించ వచ్చు. వలస కార్మికులను తొలగించ డంతో వారికి వేరే దారిలేక గ్రామా లకు తరలి పోవలసిన పరిస్థితి తలెత్తింది. పోలీసులు అత్యుత్సాహం చూపి చాలామంది వలస కార్మికు లను బాది వదిలి పెట్టారు. ఇదంతా పై నుండి వచ్చిన ఉత్తర్వుల మేరకు, లాక్‌డౌన్‌ని అమలుపరిచే పేరుమీదే జరిగింది. చాలా మంది కార్మికులు ఇళ్లకు వెళ్లే దారిలో చనిపోయారు.

రెండు కోట్లమంది కార్మికులు తమ పనులు కోల్పోయారు. దాదాపు 23 కోట్ల మంది కార్మికుల వేతనాలు చట్టపరంగా పొందాల్సిన వాటి కంటే కుదించబడ్డాయి. ఇది వరకు ప్రైవేటురంగం తన సొమ్ము తీసుకుని వచ్చి ప్రభుత్వ రంగాన్ని కొనుక్కో వలసి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ సంస్థలనన్నిటిని ఎన్ఎంపి పథకం కింద ప్రభుత్వం ప్రైవేటు వారికి అందిస్తున్నది. అటల్ బిహారి వాజ్‌పాయ్ కాలంలో కూడా కొన్ని ప్రభుత్వ సంస్థలు అమ్మబడ్డాయి. మోడీ గారి మొదటి అయిదేళ్ల పాలనా కాలంలో 49 ప్రభుత్వ సంస్థలు నేరుగా అమ్మకానికి పెట్టారు; కానీ వాటిని 2019 వరకు అమ్మలేక పోయారు. ప్రభుత్వ సంస్థల నుంచి, అందులో పనిచేసే కార్మికుల నుంచి తీవ్రస్థాయిలో ప్రతిఘటన వస్తునందు వలన ప్రైవేటు సంస్థలు వాటిని కొనడానికి ధైర్యం చేయలేకపోయాయి; అందువలనే ఇప్పుడు ఎన్ఎంపి రూపంలో ప్రైవేటీకరణ ముందుకొచ్చింది. ఈ సంస్థలలోని కార్మికులపై దాని ప్రభావం ప్రత్యక్షంగా ఉంటుంది. వారి ఉద్యోగాలు కొనసాగక పోవచ్చు అంటున్నారు తపన్ సేన్.

మహమ్మారి వ్యాప్తి చెందినప్పుడు, లాక్‌డౌన్ విధించిన సమయంలో కార్మికవర్గం పట్ల ప్రస్తుత ప్రభుత్వం అనుసరించిన తీరును గమనించవచ్చు. వలస కార్మికులను తొలగించ డంతో వారికి వేరే దారిలేక గ్రామా లకు తరలి పోవలసిన పరిస్థితి తలెత్తింది. పోలీసులు అత్యుత్సాహం చూపి చాలామంది వలస కార్మికులను బాది వదిలి పెట్టారు. ఇదంతా పై నుండి వచ్చిన ఉత్తర్వుల మేరకు, లాక్‌డౌన్‌ని అమలుపరిచే పేరుమీదే జరిగింది. చాలామంది కార్మికులు ఇళ్లకు వెళ్లే దారిలో చనిపోయారు.

వలస కార్మికుల ప్రత్యేక రికార్డు నిర్వహించకపోవడం వల్ల మహమ్మారి బారినపడి ఎంతమంది వలస కార్మికులు చనిపోయారో తాము చెప్పలేమని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖ సుప్రీంకోర్టుకి – కోర్టు వలస కార్మికుల పరిస్థితులను పర్యవేక్షిస్తున్నది – తెలియచేసింది.

నాలుగు కార్మిక కోడ్‌లు – వేతనాలపై, పారిశ్రామిక (వివాదాల) సంబంధాలపై, సామాజిక భద్రతపై, వృత్తిపరమైన భద్రతా, ఆరోగ్యంపై – అక్టోబర్ మాసం నుండి అమలులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ అనుమతులు అక్కర లేకుండా 300 మందికి తక్కువగా ఉన్న పరిశ్రమలు మూసివేయవచ్చని పారిశ్రామిక వివాదాల కోడ్ చెపుతున్నది. ఇదివరకు ఈ నియమం 100 మంది కార్మికులున్న పరిశ్రమలకు వర్తించేది. కొన్ని రాష్ట్రాలు, ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాలు ఇప్పటికే ఈ మార్గదర్శకాలను నోటిపై చేసాయి. చాలా రాష్ట్రాలు ఇంకా నోటిఫై చేయాల్సి ఉంది. ఎన్నో కష్టాలు ఎదురవుతున్నప్పటికీ, కార్మిక కర్షకుల సమస్యలు ఒకటే అయినందువల్ల గత పదినెలలకు పైగా సాగుతున్న రైతాంగ పోరాటం పారిశ్రామిక కార్మికులు పోరాటాలు చేయడానికి కొత్త ఉత్తేజాన్నిస్తుందని కార్మిక సంఘాల నాయకులు భావిస్తున్నారు.

**(అనువాదం: కె ఉషారాణి)**

# ప్రత్యామ్నాయ సంస్కృతి - ఆచరణ సమస్యలు

సందేహాలు, అవరోధాలు వస్తాయి. సందేహాలు నివృత్తి చేసుకుంటూ, అవరోధాలను అధిగ మిస్తూ ముందుకు సాగడమే కమ్యూనిస్టు లక్షణం. ఇది ఇప్పుడే కొత్తగా చెబుతున్న మార్గం కాదు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు సుందరయ్య ఆచరించి చూపిన మార్గం. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలు ఇట్లా పనిచేయడం వల్లనే అక్కడి ఆదివాసీల్లో ఇప్పటికీ పార్టీ పట్ల ఆదరణ ఉన్నది. పార్టీ చరిత్రలో వర్గ పోరాటంతో సామాజిక, సాంస్కృతిక సమస్యలు జోడించి పోరాడిన ఫలితంగానే అనేక చోట్ల పార్టీ పునాది బలపడింది. పార్టీ కేంద్రకమిటీ తీర్మానం మరో విషయం గుర్తు

( 12వ పేజీ తరువాయి)

చేసింది. ''భారతదేశంలో ఎక్కడెక్కడ కమ్యూనిస్టు, పురోగామి ఉద్యమాలు బయలుదేరి వేళ్ళూనుకున్నాయో, అవన్నీ కూడా గిరిజనుల, దళితుల, మహిళల సామాజిక విముక్తి సమస్యల లోతుల్లోకి పోయి వాటి పరిష్కారం కోసం కృషి చేయడం ద్వారా మాత్రమే జరిగాయి. ఇది మనం నిర్వహించే సైద్ధాంతిక పోరాటంలో అంతర్భాగం''. కానీ సరళీకృత ఆర్థిక విధానాలు, వినిమయ సంస్కృతి ప్రభావం ఇప్పుడు పెరిగింది. ఈ దశలో కూడా గత రెండు దశాబ్దాల్లో కేవీపీఎస్ వేదికగా కుల వివక్ష వ్యతిరేకంగా, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కోసం, పార్టీ నాయకుల ప్రత్యక్ష భాగస్వామ్యంతో జరిగిన సమరశీల ఉద్యమాలు పార్టీ శ్రేణులను ఉత్తేజపర్చాయి. ఇప్పుడు కావాల్సింది అంతకన్నా అదనం. పేదలతో మమేకమయ్యే ఘటనలు ప్రత్యేక సందర్భాల్లో ఆచరించే ఉదాహరణలుగా మాత్రమే మిగులకూడదు. నాయకులూ, కార్యకర్తలందరికీ ఇదొక జీవన శైలిగా మారాలి. అప్పుడే అది ప్రత్యామ్నాయ సంస్కృతి అవుతుంది. ప్రత్యాధిపత్యం సంస్కృతిని నిర్మించేందుకు మార్గం సుగమం అవుతుంది. ఇప్పుడు పార్టీ ప్రజాపంథా గురించి నొక్కి చెబుతున్నది. నాయకత్వం నుంచి సభ్యుల వరకు పార్టీ శ్రేణులంతా ప్రజల వద్దకు పోవాలంటున్నది. ప్రజలతో మమేకం కావాలంటున్నది. అది ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించడం ద్వారానే సాధ్యం.

చైనా లాంగ్ మార్చ్

# ఉన్నతస్థాయి సమాజ నిర్మాణం దిశగా పురోగమనం

**ఆర్ అరుణ్ కుమార్**



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు

**1978** డిసెంబర్‌లో సిపిసి చారిత్రాత్మక పదకొండవ కేంద్రకమిటీ 3వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అతివాద పెడధోరణులకు సంబంధించి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాజకీయంగా, నిర్మాణరీత్యా పార్టీని సరైన పంథాలో నడపడానికి అవసరమైన చర్యలు చేపట్టారు.

చైనాలో సోషలిజం నిర్మాణానికి 'చైనా ప్రత్యేకతలతో' కూడిన పంథాను అనుసరించాలని సిపిసి నిర్ణయించింది. చైనా ప్రజా రిపబ్లిక్‌ను ఏర్పాటు చేసిన తర్వాత జరిగిన అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించింది. సోషలిస్టు పంథాలో ప్రయాణించడం, ప్రజల ప్రజాతంత్ర నియంతృత్వాన్ని అమలు చేయడం, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో కొనసాగడం, మార్క్సిజం, లెనినిజం, మావో జె డాంగ్ ఆలోచనలకు అనుగుణంగా ముందుకు సాగడం అనే నాలుగు సూత్రాలను తప్పనిసరిగా అనుసరించాలని సిపిసి నిర్ణయం తీసుకుంది. చైనాలో సోషలిస్టు నిర్మాణం ఇంకా శైశవదశలోనే ఉన్నదని పార్టీ అంచనా వేసింది. ప్రతి దశలోనూ వివిధ స్థాయిలు ఉంటాయని, సోషలిస్టు నిర్మాణంలో ప్రాథమిక దశ పూర్తిచేయడానికి ఇంకా చాలా దశాబ్దాలు పట్టవచ్చుననే నిర్ణయానికి వచ్చింది. దీనిని సాధించడానికి తమ ఆర్థిక వ్యవస్థలోకి విదేశీ పెట్టుబడుల ప్రవేశానికి తలుపులు తెరవాలని నిర్ణయించారు.

"స్వయం సమృద్ధిపై ఆధారపడి, మనం ప్రపంచంలోని ఇతర దేశాలతో సమానత్వం, ఉమ్మడి ప్రయోజనాలు గల ఆర్థిక సహకారం పొందాలని, విదేశాల నుండి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, యంత్రాలను దిగుమతి చేసుకోవాలని, దేశంలో శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చేసుకోడానికి తీవ్రమైన కృషి చేయాలని, విద్యను ఆధునీకరించాలని నిర్ణయించింది.

1979లో గ్వాంగ్ డాంగ్, ఫుజియాన్ ప్రాంతాలలో– షెన్‌జెన్, జుహాయిలను ప్రత్యేక ఎగుమతి ప్రాంతాలుగా గుర్తించి ప్రభుత్వ నాయకత్వంలో నూతన యాజమాన్య విధానాలను ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టారు. 'వెంటనే ఫలితాలను సాధించడానికి ఆత్రుత పడడం' అనే తప్పుడు ధోరణిని సిపిసి సరిచేసుకుంది. ఆర్థిక వ్యవస్థలో ప్రధానమైన అసమతుల్యతలను, అందుకు గల కారణాలు తెలుసుకుని, ఆ సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించింది. ఆర్థిక రంగంలో అధికంగా కేంద్రీకరించబడిన యాజమాన్య నిర్మాణాన్ని సంస్కరించి, వివిధ విభాగాలలో అవసరమైన దామాషాలో మాత్రమే ప్రభుత్వ యజమాన్య కేంద్రీకరణ ఉండే విధంగా చర్యలు తీసుకుంది.




ఆధునిక వ్యవసాయ విధానాలను అమలు చేయాలంటే రైతులకు భౌతిక ప్రయోజనాలు చేకూరే విధంగా, వారి ప్రజాతంత్ర హక్కులు కాపాడబడే విధంగా, యంత్రాలతో సహా వారి భౌతిక అవసరాలు తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని పార్టీ నిర్ణయించింది. వన సంరక్షణ, పశుపోషణ, ఇతర సంబంధిత ఉత్పత్తులు, చేపల పెంపకం వగైరాలను వ్యవసాయోత్పత్తులతో పాటుగా పెంచాలని నిర్ణయించింది. కుటుంబాలు వ్యవసాయ భూములను కాంట్రాక్టు తీసుకునే విధానం, గ్రామీణ ప్రాంతాలలో రైతులందరూ కలిసి దీర్ఘకాల కాంట్రాక్టు వ్యవసాయం చేసుకునేందుకు వీలు కల్పించింది. పన్నులు కట్టిన తరువాత ధాన్యాలను స్వంతంగా నిల్వ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఫలితంగా ఉత్పత్తులు పెరిగి, మొత్తం వ్యవసాయోత్పత్తుల పెరుగుదలకు దారితీసింది. దాని వలన పారిశ్రామీకరణ, పట్టణీకరణ జరిగింది.

అంతర్జాతీయ వ్యవహారాలలో ఆధిపత్యాన్ని ఎంత మాత్రం అంగీకరించకూడదని, ప్రపంచ శాంతి నెలకొల్పాలని, మాతృభూమి పునరేకీకరణకు కృషి చేయాలని చైనా పార్టీ నిర్ణయించింది. ఈ కర్తవ్యాల సాధనకు 4 సమస్యలు పరిష్కరించబడాలని డెంగ్ సియావో పింగ్ సూచించారు: "ఒకటి, కచ్చితమైన, స్థిరమైన రాజకీయ పంథా, రెండు, రాజకీయ సుస్థిరత, ఐక్యత, మూడు, కష్టపడి పనిచేసే కార్యకర్తలు, వారిని ముందుకు నడిపే స్ఫూర్తి, నాలుగు, నిరంతర సోషలిస్టు దృష్టి, సమర్థత, వృత్తి నైపుణ్యం కలిగిన కార్యకర్తలు."


పార్టీని బలోపేతం చేయడానికి అవసరమైన నిర్మాణ చర్యలను చైనా కమ్యూనిస్టు పార్టీ తీసుకుంది. 'బూర్జువా సైద్ధాంతిక భావజాలం నుండి, ఫ్యూడల్ అవశేషాల ప్రభావం నుండి తమను తాము కాపాడుకోవాలని కార్యకర్తలను ఆదేశించింది. జీవితాంతం నాయకత్వ స్థానాలలో తప్పనిసరిగా కొనసాగే విధానం రద్దుచేసింది. కార్యకర్తలను 'విప్లవీకరించాలని, యువకులు, బాగా చదువుకున్నవారికి, మరిన్ని

అర్హతలు కలవారికి బాధ్యతలను అప్పగించాలని' సిపిసి నిర్ణయించింది. విప్లవంలో చురుకుగా పాల్గొన్న చాలామంది వృద్ధ నాయకులను, వారి వయసు రీత్యా బాధ్యతల నుండి రిలీవ్ చేసి, వారి స్థానాన్ని యువకులతో క్రమంగా నింపడం జరిగింది. సోషలిస్టు ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయటం కోసం 1981 నుండి దేశ వ్యాప్తంగా కౌంటీ స్థాయిలో ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడాన్ని ప్రవేశ పెట్టింది.

1981లో 'ఒకే దేశం, రెండు విధా నాలు' నినాదంతో హాంకాంగ్, మకావూ, తైవాన్‌ను చైనాతో ఐక్యం చేసే ప్రయత్నాలను సిపిసి మొదలు పెట్టింది. 1997లో హాంగ్‌కాంగ్, 1999లో మకావూపై చైనా తన సార్వభౌమత్వాన్ని నెలకొల్పుకుంది.

విదేశాలకు ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరవడానికి 1982లో సిపిసి నిర్ణయించింది; దేశంలో, విదేశాలలో అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకోవాలని, విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని, విదేశాలలో ఉన్న ఆధునిక యాంత్రాలను దేశంలోకి దిగుమతి చేసుకోవాలని, చైనా ఎగుమతులను పెంచుకోవాలని నిర్ణయించింది. విదేశీ అనుభవాలను, విధానాలను యథాతథంగా దేశంలో అమలు చేయడాన్ని సిపిసి వ్యతిరేకించింది. సోషలిస్టు పంథాలోనే ఈ నిర్మాణం ఉండేందుకు కొన్ని చర్యలు తీసుకుంది.

**" విదేశాలకు ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరవడానికి 1982లో సిపిసి నిర్ణయించింది. దేశ, విదేశాలలో అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకోవాలని, విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని, ఆధునిక యాంత్రాలను దేశంలోకి దిగుమతి చేసుకోవాలని, చైనా ఎగుమతులను పెంచుకో వాలని నిర్ణయించింది. విదేశీ అనుభవాలను, విధానాలను యథాతథంగా దేశంలో అమలు చేయడాన్ని సిపిసి వ్యతిరేకించింది. సోషలిస్టు పంథాలోనే ఈ నిర్మాణం ఉండేందుకు కొన్ని చర్యలు తీసుకుంది. "**



శరవేగంగా అభివృద్ధి చెందుతున్న చైనా నగరాలు: షాంఘైలోని ఫ్యూ డాంగ్ ప్రాంతం

### సంస్కరణల మౌలిక లక్ష్యం

'చైనా పరిస్థితులకు తగ్గట్టుగా, ఉత్పత్తిశక్తుల అభివృద్ధికి దోహదపడే విధంగా సోషలిస్టు ఆర్థికవ్యవస్థను నిర్మించడం, 'సోషలిస్టు సంస్కృతి, సిద్ధాంత నిర్మాణం, ఆర్థిక నేరాలను నివారించడం, పార్టీ పని విధానాన్ని చక్కదిద్దుకోవడం, క్రమశిక్షణను మెరుగుపరచడం, పార్టీ నాయకత్వాన్ని అత్యున్నత స్థాయికి అభివృద్ధి చేయడం ప్రధాన కర్తవ్యాలుగా నిర్ణయించింది.

1983లో సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఇఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలో పార్టీ ప్రతినిధి బృందం చైనాను సందర్శించింది. సిపిసి నాయకులతో వివరంగా చర్చలు జరిపిన తరువాత రెండు పార్టీల మధ్య సంబంధాలు పునరుద్ధరించబడ్డాయి.

1985లో సిపిసి ఆర్థికాభివృద్ధిని సమీక్షించింది. కేవలం ఉత్పత్తి పెంచటం, ముఖ్యంగా భారీ పరిశ్రమల ద్వారా ఉత్పత్తిని పెంచాలన్న దిశ నుండి సమగ్రాభివృద్ధి జరగాలని, అందుకు వ్యవసాయ రంగం, తేలికపాటి పరిశ్రమలు, భారీ పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందాలని, శాస్త్ర విజ్ఞానం, యాంత్రీకరణ, విద్య, సంస్కృతి, సామాజిక పురోగమనం కలిసి జరగాలని, అప్పుడే ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధ్యమని సిపిసి దిశా నిర్దేశం చేసింది. పరిశోధనలు, యాంత్రికరణ అభివృద్ధి కావడానికి చైనీస్ అకాడమి అఫ్ సైన్సెస్‌ని వివిధ పరిశ్రమలు, వ్యవసాయ రంగంతో అనుసంధానం చేసింది. తొమ్మిదేళ్ల నిర్బంధ విద్య విధానాన్ని రూపొందించారు.

సిపిసి నాయకత్వం పదేపదే బూర్జువా సంస్కరణవాదం గురించి నొక్కి చెపుతూనే ఉంది. (1986) కేంద్ర కమిటీ సమావేశంలో డెంగ్ జియావో పింగ్, 'బూర్జువా సంస్కరణలు చైనా దేశ విధానాలను పెట్టుబడిదారీ విధానాల వైపుకు మళ్లించేవిగా ఉన్నాయి. ఒకసారి ఈ సిద్ధాంతాల ధోరణి ప్రవేశించడానికి అవకాశం కల్పిస్తే, అవి వ్యాప్తి చెంది దేశ రాజకీయ స్థిరత్వాన్ని, ఐక్యతను దెబ్బతీస్తాయి. ఇది సోషలిజం నిర్మాణానికి హానికరం. నాలుగు ప్రధాన సూత్రాల సారాన్ని మరోసారి నొక్కి వక్కాణిస్తూ, అవి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన్ని నిలిపి ఉంచుతాయని చెప్పారు. అదే సమయంలో అందులోని ముఖ్యమైన అంశం బూర్జువా సంస్కరణలు పార్టీ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తాయని పేర్కొన్నారు. మనం బూర్జువా ప్రజాస్వామ్యాన్ని మక్కీకి మక్కి అనుసరించకూడదు. సోషలిస్టు ప్రజాస్వామ్యాన్ని, సోషలిస్టు న్యాయవ్యవస్థను పటిష్ట పరచుకోవాలి అన్నారు. 1989లో విద్యార్థులు బీజింగ్ లోని తియాన్మెన్ స్క్వేర్‌ని ఆక్రమించి, సోషలిస్టు వ్యవస్థను భగ్నం చేయడానికి ప్రయత్నించినప్పుడు సంస్కరణల ప్రతికూల ప్రభావం మొట్టమొదటి సారిగా వెల్లడైంది.

ఇటువంటి సంఘటనలు మళ్ళీ జరగకుండా ఉండడానికి సిపిసి కేంద్రకమిటీ 1990లో సమావేశమై పార్టీని ప్రజా సమూహాలతో మరింత బలంగా అనుసంధానం చేయాలని నిర్ణయించింది. పార్టీలోని ప్రతి వ్యక్తి, ప్రతి కార్యకర్త 'ప్రజల నుంచి ప్రజల వద్దకు' అనే సూత్రానికి పూర్తిగా కట్టుబడి ఉండాలని కేంద్ర కమిటీ ఉద్బోధించింది. ప్రజలకు ప్రయోజనాలు కలిగించే విధానాలు రూపొందించి అమలు చేయాలని, పార్టీలోని ప్రతి నాయకుడు వీలైనన్ని ఎక్కువసార్లు దిగువస్థాయి ప్రజల వద్దకు వెళ్లాలని, ప్రజలతో నిత్య సంబంధాలు పెట్టుకోవాలని, పై నుండి కింది వరకు పార్టీ విధానాన్ని అమలు చేయాలని, పార్టీ విధానాన్ని ప్రజలలోకి తీసుకెళ్లాలని, ప్రజలను మరింత చైతన్యవంతులను చేయడానికి, సంఘటితపరచడానికి, కలిసి ముందుకు

**❝ 1978 నుండి అనుసరించిన విధానాల వలన ఉత్పత్తి శక్తుల అభివృద్ధి గణనీయంగా పెరిగింది. పారిశ్రామికీకరణ వేగవంతం అయింది. స్థూల జాతీయోత్పత్తిని అంగలు పంగలుగా పెరిగింది. కటిక పేదరికం పూర్తిగా తొలగిపోయింది. వాణిజ్యం ఎన్నో రెట్లు పెరిగింది. విద్య, శాస్త్రీయ విజ్ఞానం, యాంత్రీకరణలో గొప్ప విజయాలు సాధించింది. 1997లో ప్రపంచంలోని ఏడవ అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా, 2010 వచ్చేసరికి రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా చైనా అభివృద్ధి చెందింది. ❞**

నడపడానికి పనిచేయాలని నిర్ణయించింది.

చైనా కమ్యూనిస్టు పార్టీ 14వ మహాసభ (1992) సోషలిస్టు మార్కెట్ ఆర్థిక వ్యవస్థను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పెరిగిన వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తితో నిత్యావసర సరుకులు ప్రజలకు అందుబాటులోకి రావడంతో 1993 నుండి రేషన్ కూపన్లు ఇవ్వడం నిలిపివేసింది. 5,000 సంవత్సరాల నుండి వసూలు చేస్తూ వచ్చిన వ్యవసాయ పన్నును 2005లో రద్దు చేసింది. రైతులకు కొత్త సబ్సిడీలు ఇవ్వడం మొదలు పెట్టింది. 2009లో జాతీయ గ్రామీణ సహకార ఆరోగ్య కార్యక్రమం ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని అమలు చేసి, గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలో మౌలిక మార్పులు తెచ్చింది.

1978 నుండి అనుసరించిన విధానాల వలన ఉత్పత్తి శక్తుల అభివృద్ధి గణనీయంగా పెరిగింది. చైనా పారిశ్రామికీకరణ వేగవంతం అయింది. తన స్థూల జాతీయోత్పత్తిని అంగలు పంగలుగా పెంచుకుంది. కటిక పేదరికం పూర్తిగా తొలగిపోయింది. వాణిజ్యం ఎన్నో రెట్లు పెరిగింది. విద్య, శాస్త్రీయ విజ్ఞానం, యాంత్రీకరణలో గణనీయమైన విజయాలు సాధించింది. 1997లో ప్రపంచంలోని ఏడవ అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా, 2010 వచ్చేసరికి రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా చైనా అభివృద్ధి చెందింది.

1978 నుండి ఈ నాటికి 85 కోట్ల మంది ప్రజలు దారిద్ర్యం నుండి బయట పడ్డారు.'రెండు భరోసాలు, మూడు గ్యారంటీలు' (ఆహారం, బట్ట భరోసా; నిర్బంధ విద్య, ప్రాథమిక ఆరోగ్యం, భద్రమైన ఆవాసం గ్యారంటీ) కల్పించింది. 1970 దశాబ్దం తరువాత ప్రపంచ పేదరిక తరుగుదలలో 70 శాతం భాగం చైనాదే.

చైనా స్థూల జాతీయ తలసరి ఆదాయం 1978లో 200 డాలర్లు ఉండగా 2019 నాటికి 10,410 డాలర్లకు పెరిగింది. తలసరి ఆదాయం 12,536 డాలర్లు ఉండాలని ప్రపంచ బ్యాంకు నిర్ణయించిన లక్ష్యాన్ని 2023 కన్నా ముందే చైనా అధిగమిస్తుందని అంచనా.

1978లో చైనా స్థూల జాతీయోత్పత్తి 36,787 కోట్ల యువాన్లు (5,738 కోట్ల డాలర్లు). అది 2020 నాటికి 101.6 లక్షల కోట్ల యువాన్లకు (14.7 లక్షల కోట్ల డాలర్లకు)పెరిగి దాదాపు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 17 శాతానికి చేరింది. 2020లో చైనా విదేశీ మారకనిల్వలు 3.2 లక్షల కోట్ల డాలర్లకు చేరాయి. ఇది ప్రపంచంలోనే అత్యధికం. 2008లో ప్రారంభమైన ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనే వ్యూహంలో భాగంగా దేశీయంగా డిమాండ్‌ను పెంచే విధానాలను చైనా అనుసరించింది. చైనా ఆర్థికవ్యవస్థతో పాటు అక్కడి వ్యక్తిగత ఆదాయాలు కూడా పెరిగాయి. 2020 నాటికి జాతీయ తలసరి ఖర్చు చేయగల నిజ ఆదాయాలు 2010 కన్నా 100.8 శాతం పెరిగాయి. పట్టణ ప్రజల ఆదాయాల కన్నా గ్రామీణ ప్రజల ఆదాయాలు పెరగటంతో గ్రామాలు, పట్టణ ప్రజల మధ్య అభివృద్ధిలో వ్యత్యాసాలు తరిగి పోయాయి. పట్టణ, గ్రామీణ ప్రజల మధ్య తలసరి ఖర్చు చేయగల ఆదాయాల వ్యత్యాసం ఇది వరకు 2.64 ఉండగా ఇప్పుడది 2.56 శాతానికి పడిపోయింది. 2010లో స్థూల జాతీయ ఉత్పత్తిలో దేశీయ వినియోగం 48 శాతం ఉండగా 2019 నాటికి 55 శాతానికి పెరిగింది. అంటే చైనా పెరుగుదలలో 70 శాతం కన్నా ఎక్కువ. ఈ పదేళ్ల కాలంలో ఎగుమతులు దేశ స్థూల ఉత్పత్తిలో 33 శాతం నుండి 10 శాతానికి పడిపోయాయి.



కొత్త వరివంగాడాల ఉత్పత్తి, సాంకేతిక పద్ధతుల వినియోగంతో వరుసగా గత ఆరు సంవత్సరాల నుంచి చైనా ఆహారధాన్యాల ఉత్పత్తులు 65 కోట్ల టన్నులను దాటుతున్నాయి

వరుసగా గత ఆరు సంవత్సరాల నుంచి చైనా ఆహారధాన్యాల ఉత్పత్తులు 65 కోట్ల టన్నులను దాటుతున్నాయి. విద్యుదుత్పత్తి ఏటికేడాది క్రమంగా పెరుగుతున్నది. జాతీయ ఆరోగ్య వ్యయం క్రమంగా పెరిగి 15.2 శాతానికి చేరింది. గృహాల కోసం వెచ్చించే

ఖర్చు 10.5 శాతం పెరిగింది. సామాజిక భద్రత, ఉద్యోగం కోసం చేసే వ్యయం 10.9 శాతం పెరిగింది.

గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ ప్రకారం ప్రపంచ నూతన ఆవిష్కరణల్లో చైనా 2020లో 14 వ స్థానంలో ఉంది. అభివృద్ధి చెందిన 20 దేశాల సరసన ఉన్న అభివృద్ధి చెందుతున్న దేశం ఇదొక్కటే. చైనా చంద్రయానం, మార్స్ గ్రహ పరిశోధనల లోనూ, శాటిలైట్‌లను పంపడం లోను, లోతైన సముద్ర జలాల పరిశోధన, క్వాంటమ్ కంప్యూటర్ పరిశోధనల్లో పురోగతి సాధించింది. కొత్త ఆవిష్కరణలైన 5జి, ఏఐ విస్తృతంగా ఉపయోగించబడు తున్నాయి. 2020 లోని మొదటి మూడు త్రైమాసికాలలో సరాసరిన 22,000 కొత్త పరిశ్రమలు స్థాపించబడ్డాయి. దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాలలో 1.18 కోట్ల కొత్త ఉద్యోగాలు కల్పించబడ్డాయి. అంటే 2020 లో చేరాలనుకున్న లక్ష్యాన్ని అధిగమించింది.

తన 'శత సంవత్సర రెండు లక్ష్యాలు'లో మొదటిది – 2020 కల్లా ప్రజల సాధారణ అవసరాలను తీర్చే సమాజ నిర్మాణం (2021లో జరిగే సిపిసి శతజయంతితో కలిసే విధంగా) నెరవేరింది. ఇప్పుడు, రెండో శతవార్షిక లక్ష్యం, 2050 నాటికి – 'సంపద్వంతమైన, బలమైన, ప్రజాతంత్రంగా, సాంస్కృతికంగా అభివృద్ధి చెందిన, సామరస్యంతో కూడిన, సుందరమైన' ఆధునిక సోషలిస్టు దేశ నిర్మాణం వైపు కదం తొక్కుతున్నది (2049 లో చైనా ప్రజా రిపబ్లిక్ స్థాపించిన శత జయంతి).

ఈ లక్ష్యాల సాధన కోసం సిపిసి తక్షణ, దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేసుకుంది. 14వ పంచవర్ష ప్రణాళిక (2021–2025) అనేక రంగాలలో సాధించవలసిన ఆర్థికాభివృద్ధి, నూతన ఆవిష్కరణలు అభివృద్ధి, ప్రజా శ్రేయస్సు, వాతావరణ పరిరక్షణ, రక్షణ అవసరాలు తదితరాలలో 20 ప్రధాన లక్ష్యాలను నిర్ణయించింది. ఉత్తమ శ్రేణి అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తున్నది. దేశీయ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేయాలను కుంటున్నది. బలమైన మార్కెట్ వ్యవస్థను నిర్మించి, దానిని ఉత్పత్తి, పంపకం, వినిమయంతో అనుసంధానం చేయాలను కుంటున్నది.

సిపిసి 19వ మహాసభ (2017) దీర్ఘకాల ప్రణాళికను సిద్ధం చేసింది. "2020 నుండి 2035 వరకు మొదటి దశ. ఈ కాలంలో ఒక మోస్తరు సంపద్వంతమైన సమాజం

> **" ఈ రోజు చైనా కమ్యూనిస్టు పార్టీలో 9.05 కోట్లమంది పార్టీ సభ్యులు ఉన్నారు. 46.1 లక్షల పార్టీ శాఖలు ఉన్నాయి. ఇందులో 27.2 శాతం మహిళలున్నారు. 50 శాతం కంటే ఎక్కువ మంది పట్టభద్రులు, లేదా అంతకంటే ఎక్కువ చదివిన వారున్నారు. పార్టీలో 35.3 శాతం కార్మికులు, కర్షకులు. మరో 15.5 శాతం అనేక వృత్తులలో గాని, ప్రభుత్వ సంస్థలలోగాని, సామాజిక సంస్థలలో గాని పనిచేస్తున్నవారు. 8.3 శాతం మంది పార్టీ, ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తున్నారు. "**




చైనా నగర ప్రజల జీవనం యూరోపియన్ నగరాల స్థాయిని అందుకుంటోంది

నిర్మించడానికి కృషిచేయాలి, ఆధునిక సోషలిస్టు సమాజ నిర్మాణానికి ఇది పునాదిగా ఉండడానికి కష్ట పడాలి. రెండో దశలో అంటే 2035 నుండి 2050 వరకు మరో పదిహేనేళ్ళు, మనం సాధించిన ఆధునీకరణతో మరింత ఉన్నతస్థాయిలో దేశాన్ని అభివృద్ధి చేయటానికి కృషి చేయాలి. ఆ తరువాత చైనా ఒక గొప్ప అభివృద్ధి చెందిన ఆధునిక సోషలిస్టు దేశంగా ఉంటుంది" అని పార్టీ నిర్దేశించింది.

ఈ రోజు చైనా కమ్యూనిస్టు పార్టీలో 9.05 కోట్లమంది పార్టీ సభ్యులు ఉన్నారు. 46.1 లక్షల పార్టీ శాఖలు ఉన్నాయి. ఇందులో 27.2 శాతం మహిళలున్నారు. 50 శాతం కంటే ఎక్కువ మంది పట్టభద్రులు, లేదా అంతకంటే ఎక్కువ చదివిన వారున్నారు. పార్టీలో 35.3 శాతం కార్మికులు, కర్షకులు. మరో 15.5 శాతం అనేక వృత్తులలో గాని, ప్రభుత్వ సంస్థలలోగాని, సామాజిక సంస్థలలో గాని పనిచేస్తున్నవారు. 8.3 శాతం మంది పార్టీ, ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తున్నారు. పట్టణ ప్రాంతాలలో 99 శాతం, ప్రభుత్వ సంస్థలలో 99.9 శాతం, ప్రభుత్వం ప్రోత్సహించిన సంస్థలలో 95.2 శాతం, 15.9 లక్షల ప్రైవేటు సంస్థలలో పార్టీ శాఖలు ఉన్నాయి. ప్రజలపై సిపిసికి ఉన్న ప్రభావాన్ని, ప్రజలను సిపిసి చేరగల అవకాశాలను ఇవి తెలియచేస్తున్నాయి.

"మన పార్టీ చరిత్ర, నిరంతరంగా మార్క్సిజాన్ని చైనా పరిస్థితులకు అనుగుణంగా అన్వయిస్తున్న చరిత్ర. ఈ వంద సంవత్సరాల చారిత్రక గమనంలో సిపిసి నిరంతరం ప్రజల పక్షాన నిలిచింది. ప్రజల ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో మమేకమైంది. ప్రజల కష్టనష్టాలలో పాలుపంచుకుంది. ప్రజల నమ్మకం, మద్దతుతో సిపిసి అనేక ఆటుపోట్లను అధిగమించగలిగింది. చైనాను నిరోధించలేని శక్తిగా రూపొందించింది. చైనాను మహోన్నతంగా పునరుత్తేజపరచటం, 140 కోట్ల చైనా ప్రజలను ఏకతాటిపై నడిపించడం సిపిసి ముందున్న ప్రధాన కర్తవ్యం" అని సిపిసి శతవార్షికోత్సవాలను ప్రారంభిసూ కార్యదర్శి సి జిన్‌పింగ్ అన్నారు.

**(అనువాదం: కె ఉషారాణి)**

**అంతర్జాతీయం**

# ఆఫ్ఘన్ నుండి 'ఆకుస్' వరకు

**ఎస్ వెంకట్రావు**



రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటర్

ఇటీవలి కాలంలో ప్రపంచ భూగోళ రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేసే రెండు ముఖ్యమైన పరిణామాలు జరిగాయి. 1. ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో రెండు దాశాబ్దాల పాటు ఆఫ్ఘనిస్తాన్‌ను దురాక్రమించిన అమెరికా అవమానకరమైన రీతిలో ఆదేశం విడిచి పారిపోవడం. 2. చైనాకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాద శక్తులను ఏకం చేయడానికి ఇటీవలి కాలంలో తీవ్రంగా ప్రయత్నిస్తున్న అమెరికా సరికొత్తగా ఆస్ట్రేలియా, బ్రిటన్, అమెరికాలతో కూడిన త్రైపాక్షిక అణ్వస్త్ర కూటమిని ఏర్పాటు చేయడం. ఈ రెండు పరిణామాలు ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో జరిగినప్పటికీ వీటి ప్రభావం ప్రపంచ వ్యాపితంగా ఉంటుంది. భవిష్యత్ పరిణామాలకు ఇవి సూచీగా కూడా ఉంటాయి. అందుకనే ప్రపంచ వ్యాపితంగా ఈ పరిణామాలపై తీవ్రమైన చర్చ జరుగుతోంది.

మొదటిది, ఆఫ్ఘనిస్తాన్ నుండి అమెరికా సేనల ఉపసంహరణ. నిజానికి ఆఫ్ఘనిస్తాన్ నుండి అమెరికా సేనల ఉపసంహరణ నిర్ణయం డొనాల్డ్ ట్రంప్ హయాంలోనే జరిగింది. ఉపసంహరణ షెడ్యూల్ కూడా అప్పుడే నిర్ణయమైంది. జో బైడెన్ అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టిన తరువాత పాత షెడ్యూల్ ప్రకారమే ఉపసంహరణ ప్రారంభించారు. అయితే ఉపసంహరణ విషయంలో అందరినీ ఆశ్చర్య పరిచిన విషయం ఏమంటే అమెరికా నెలకొల్పిన మొహమ్మద్ అష్రఫ్ ఘనీ ప్రభుత్వం తాలిబాన్ తిరుగుబాటుదారుల ముందు పేకమేడలా కూలిపోవడం. మెరుపు వేగంతో తాలిబాన్లు అధికారాన్ని చేజిక్కించుకోవడం.

అమెరికా దళాలు భద్రంగా స్వదేశానికి వెళ్లిపోడానికి తాలిబాన్లు అడ్డుపడకూడదనీ, వారికి హాని చేయకూడదని గత ఏడాది ఫిబ్రవరి 29న కతర్ రాజధాని దోహాలో అమెరికాకూ, తాలిబాన్లకూ మధ్య ఒప్పందం కుదిరింది. అమెరికా 'సైనిక శిక్షణ' మీద నమ్మకం పెట్టుకున్న చాలా మంది ఆఫ్ఘనిస్తాన్ దళాలు చాలా కాలం పాటు తాలిబాన్లను నిలువరించగలుగుతాయని, అమెరికా నిష్క్రమణ తరువాత ఆ దేశంలో అంతర్యుద్ధం జరుగుతుందనీ, సిరియా మాదిరిగానే ఆయా దేశాలు ఈ అంతర్యుద్ధంలో తమతమ పాత్రలు నిర్వహిస్తాయనీ అనుకున్నారు. అమెరికా కూడా ఆఫ్ఘనిస్తాన్‌ను విడిచిపెట్టినప్పటికీ ఏదో ఒక రూపంలో ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని చక్రం తిప్పవచ్చుననుకుంది.

కానీ పరిణామాలు అమెరికా, దాని మిత్రులు అనుకున్న దానికి భిన్నంగా జరిగాయి. ఒకవైపు అమెరికా సేనల ఉపసంహరణ జరుగుతుండగానే మరోవైపు కొద్ది వారాల్లోనే మెరుపు వేగంతో వివిధ నగరాలు, ప్రాంతాలను ఆక్రమించుకుంటూ వచ్చిన తాలిబాన్లు కాబూల్‌లోకి సునాయాసంగా ప్రవేశించారు. ఆగస్టు 15న ఆఫ్ఘనిస్తాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘని నాలుగు కార్లు, హెలీకాప్టర్ నిండా డబ్బు తీసుకుని ఆఫ్ఘన్ రాజధాని కాబూల్ విడిచి పలాయనం చిత్తగించాడు. తాలిబాన్ల నుండి తప్పుకోడానికి అమెరికా సైన్యం తుందూ తపాకీ పట్టుకుని విమానాల్లో పారిపోవడం 1975లో వియత్నాం నుండి అమెరికా దళాలు పారిపోయిన దృశ్యాలను తలపించింది. 20 ఏళ్లుగా అమెరికా 'శిక్షణ' ఇచ్చి, పెంచి పోషించిన ఆఫ్ఘన్ ప్రభుత్వ సైన్యం ఎక్కడికక్కడ తాలిబాన్లతో బేరాలకు వచ్చి లొంగిపోయింది. కొందరు సరిహద్దులు దాటుకుంటూ పారిపోయారు. ఆఫ్ఘన్ నుండి అమెరికా సేనల ఉపసంహరణ తీరును అమెరికా వ్యతిరేకులే కాదు మిత్రులు కూడా తీవ్రంగా విమర్శించారు. ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికాకు మద్దతిచ్చిన వారు ప్రాణ భయంతో పరుగులు తీసిన దృశ్యాలు, కాబూల్ విమానాశ్రయం నుండి అమెరికా సైనికులతో వెళుతున్న విమాన చక్రాలను కూడా పట్టుకుని ఎగిరిపోడానికి ప్రయత్నించిన దృశ్యాలు ప్రపంచ ప్రజల హృదయాలను కలచి వేశాయి. దీంతో అమెరికా తన సామ్రాజ్యవాద దురాక్రమణల్లో ఇతర దేశాలనూ, సంస్థలనూ, వ్యక్తులనూ ఎలా ఉపయోగించుకుని అవసరం తీరాక గడ్డిపోచలా తీసిపారేస్తుందో ప్రపంచానికి అర్థమైంది. ఆఫ్ఘనిస్తాన్‌ను తీవ్రమైన కల్లోలంలో ముంచి బాధ్యతారహితంగా అమెరికా దళాలను ఉపసంహరించిన తీరును దాని నాటో మిత్ర దేశాలైన ఫ్రాన్స్, బ్రిటన్‌లు కూడా విమర్శించాయి. మిత్రులకు కూడా చెప్పకుండా అమెరికా వ్యవహరించడం పట్ల నిరసన వ్యక్తం చేశాయి. ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో రెండు దశాబ్దాలు ఆఫ్ఘనిస్తాన్‌ను ఆక్రమించి చివరికి మళ్లీ తాలిబాన్లకే దేశాన్ని అప్పగించి వెళ్లిపోయిన తీరు బాధ్యరహితంగా ఉందని చైనా విమర్శించింది. చివరికి అమెరికా మీడియా కూడా బైడెన్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును తీవ్రంగా తప్పుపట్టింది.

**అమెరికా సైనికశక్తి పరిమితుల వెల్లడి**

అమెరికా ప్రపంచంలోనే అది పెద్ద సైనిక శక్తి అయినప్పటికీ దానికీ అనేక పరిమితులున్నాయన్న విషయాన్ని ఆఫ్ఘన్ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని పలువురు అంతర్జాతీయ నిపుణులు పేర్కొన్నారు. ఒక రకంగా ఆర్థిక, సాంకేతిక, రాజకీయ రంగాల్లో ఆధిపత్యాన్ని కోల్పోతున్న అమెరికా సైనికాధిపత్యాన్ని కూడా కోల్పోతున్నదనడానికి ఆఫ్ఘనిస్తాన్ పరిణామాలు ప్రబల నిదర్శనమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. "సైనికశక్తితో దేశాలను నిర్మించాలనుకుంటే అది తప్పకుండా విఫలమై తీరుతుంది" అని అమెరికా వ్యవహారాల నిపుణుడు అన్నెల్లె షెలైన్ పేర్కొన్నాడు. "ఆఫ్ఘనిస్తాన్‌ను రెండు దశాబ్దాలు అమెరికా ఎందుకు ఆక్రమించినట్లు?" అని న్యూయార్క్ సిటీ విశ్వవిద్యా

లయానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ జావీద్ నవాబి ప్రశ్నించారు. "నీ దగ్గర సుత్తిమాత్రమే సాధనంగా ఉంటే నీకు అన్నీ మేకుల్లాగానే కనిపిస్తాయి అన్న సామెత ఉంది. అమెరికా సైనిక శక్తిమీద ఆధారపడి నంతవరకు అది అన్ని సమస్యల పరిష్కారానికి సైనిక శక్తినే ఉపయోగించాలనుకుంటుంది" అని ఆయన విమర్శించారు.

> "అమెరికా ప్రపంచంలోనే అది పెద్దసైనిక శక్తిఅయినప్పటికీ దానికీ అనేక పరిమితులున్నాయన్న విషయాన్ని ఆఫ్ఘన్ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని పలువురు అంతర్జాతీయ నిపుణులు పేర్కొన్నారు. ఒకరకంగా ఆర్థిక, సాంకేతిక, రాజకీయ రంగాల్లో ఆధిపత్యాన్ని కోల్పోతున్న అమెరికా సైనికాధిపత్యాన్ని కూడా కోల్పోతున్నదనడానికి ఆఫ్ఘనిస్తాన్ పరిణామాలు ప్రబల నిదర్శనమని నిపుణులు విశ్లేషిస్తున్నారు."



ఆఫ్ఘనిస్తాన్ విడిచి వెళ్లిపోతున్న అమెరికా సైన్యం

రెండు దశాబ్దాల్లో ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా 2 లక్షల కోట్ల డాలర్లు (సుమారు 150 లక్షల కోట్ల రూపాయలు) ఖర్చు చేసిందని, దేశంలో ప్రజాస్వామిక పాలన ప్రవేశ పెట్టిందని, తాలిబాన్లను ఎదిరించే సైనిక వ్యవస్థకు శిక్షణ ఇచ్చి తయారు చేసిందని పశ్చిమ దేశాల ప్రసార సాధనాలు ఊదర గొడుతుంటాయి. ఆఫ్ఘనిస్తాన్ పాలకుల అవినీతి వల్ల ఈ డబ్బు అంతా వ్యర్థమైందని చెబుతుంటాయి. కానీ వాస్తవం ఏమంటే అమెరికా ఖర్చు చేసిన డబ్బులో ఎక్కువ భాగం మళ్లీ ఆయుధాల కొనుగోలు పేరుతో అమెరికా కాంపెనీలకే చేరింది. ఆఫ్ఘన్ పునర్నిర్మాణానికి సంబంధించిన ప్రత్యేక ఇన్‌స్పెక్టర్ జనరల్ ఇటీవల ఇచ్చిన నివేదిక ప్రకారం 2001-2021 మధ్య అమెరికా ఆఫ్ఘన్‌లో 94,600 కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. ఇందులో 81,600 కోట్ల డాలర్లు అంటే దాదాపు 86 శాతం సొమ్ము ఆఫ్ఘన్‌లో అమెరికా సైనిక ఖర్చులకు కేటాయించారు. మిగిలిన 13,000 కోట్ల డాలర్లలో కూడా ఆఫ్ఘన్ ప్రజలకు చేరింది చాలా తక్కువ. అందులో 8,300 కోట్ల డాలర్లు ఆఫ్ఘన్ సైనిక దళాలకోసం ఖర్చు చేశారు. 1,000 కోట్ల డాలర్లు మాదకద్రవ్యాల ఎగుమతులను అడ్డుకోడానికీ, మరో 1,500 కోట్ల డాలర్లు ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా గూఢచారి సంస్థలకూ ఖర్చు చేశారు. ఇక మిగిలిన 2,100 కోట్ల డాలర్లలో అత్యధిక భాగం దేశంలో ఉగ్రవాద నిరోధక కార్యకాలాపాలు, న్యాయ వ్యవస్థను పటిష్టం చేయడం వంటి కార్యకలాపాలకు ఖర్చు చేయగా మిగిలినది అంటే 2 శాతం కన్నా తక్కువ సొమ్ము మాత్రమే ప్రాథమిక సదుపాయాల కల్పన, పేదరికం నిర్మూలన వంటి కార్యకలాపాల ద్వారా ఆఫ్ఘన్ ప్రజలకు చేరింది. నిజంగా అమెరికా 2 లక్షల కోట్ల డాలర్లను దేశంలో విద్య, వైద్య సదుపాయాల కోసం, మంచినీరు, పారిశుధ్యం, వ్యవసాయం, పరిశ్రమలు వంటి రంగాల్లో వెచ్చించి ఉంటే ఆ దేశం ప్రపంచంలోనే అత్యంత వెనుకబడిన దేశంగా ఉండేది కాదు. ప్రపంచ ప్రజల సగటు జీవనకాలం నేడు 73.2 సంవత్సరాలు ఉంటే ఆఫ్ఘనిస్తాన్‌లో 20 ఏళ్ల అమెరికా దురాక్రమణ తరువాత ప్రజల సగటు జీవనకాలం 63 ఏళ్లు మాత్రమే. ప్రసవం సమయంలో ప్రపంచంలో సగటున లక్ష కాన్పులకు 211 మంది మహిళలు చనిపోతుంటే అఫ్ఘనిస్తాన్‌లో 638 మంది చనిపోతున్నారు. ఆ దేశంలోని పిల్లల్లో 38 శాతం మంది తక్కువ బరువుతో, బలహీనంగా ఉంటున్నారు. అమెరికా దురాక్రమణ జరపకుండా ఉంటే ఆఫ్ఘనిస్తాన్ ఇప్పటికన్నా బాగా అభివృద్ధి చెంది ఉండేదన్న దాంట్లో సందేహం లేదు.

ఉగ్రవాదంపై యుద్ధం కోసం ఆఫ్ఘనిస్తాన్‌ను ఆక్రమించామని అమెరికా చెబుతున్న వాదనలో కూడా పసలేదు. సోవియట్లకు వ్యతిరేకంగా తాలిబాన్లకు శిక్షణ ఇచ్చింది అమెరికా అన్న విషయం ప్రపంచానికంతటికీ తెలుసు. అయితే ఒసామా బిన్ లాడెన్‌తో సహా అమెరికాపై 11/9 దాడుల సూత్రదారులకు నిధులు సరఫరా చేసిన సౌదీ అరేబియాకు వ్యతిరేకంగా అమెరికా ఒక్క మాట కూడా మాట్లాడకపోవడమే కాదు ఇటీవలి కాలంలో దానితో స్నేహాన్ని మరింత పటిష్టం చేసుకోవడం ఉగ్రవాదం పట్ల దాని ద్వంద్వ వైఖరిని తెలియజేస్తోంది. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్ల అకృత్యాల గురించి రోజువారీ వార్తలు ప్రసారం చేస్తున్న పశ్చిమ దేశాల వార్తా సంస్థలు అక్కడ ప్రజలపై 20 ఏళ్ల కాలంలో అమెరికా సాగించిన దుర్మార్గాలను గురించీ, వేలమంది అమాయక ప్రజలను పొట్టన బెట్టుకున్న తీరు గురించీ ఏనాడూ ప్రసారం చేయలేదు. అమెరికా పట్ల, దాని తొత్తు ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఏర్పడిన తీవ్ర నిరసన భావమే తాలిబాన్లకు ప్రజలనుండి మద్దతు లభించడానికీ, వారు మెరుపు వేగంతో అధికారాన్ని చేజిక్కించుకోడానికీ ప్రధాన కారణం.

**మధ్య ఆసియాలో పెనుమార్పులు**

మధ్య ఆసియా దేశాలకు కీలకమైన అనుసంధాన స్థానంలో ఉన్న ఆఫ్ఘనిస్తాన్ నుండి అమెరికా సేనలు వైదొలగడంతో ఈ ప్రాంతంలో వ్యూహాత్మక బాలాబలాల్లో పెనుమార్పులు సంభవించే అవకాశాలున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆఫ్ఘనిస్తాన్ అభివృద్ధికి తోడ్పడాల్సిందిగా తాలిబాన్లు చైనా సహాయం అర్థిస్తున్నారు. కాబూల్‌లో అధికారం చేజిక్కించు

> **"మొత్తం మీద చూసినప్పుడు ఆఫ్ఘనిస్తాన్ నుండి అమెరికా వైదొలగిన తరువాత ఏర్పడిన ఖాళీని చైనా, రష్యా, ఇరాన్ తదితర దేశాలు పూడ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ దేశాలన్నీ అంతర్జాతీయ యవనిక మీద అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేస్తున్న శక్తులే కావడం విశేషం. చైనా బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు ద్వారా మధ్య ఆసియానూ, యూరోప్‌ను కలపడానికి ఆఫ్ఘనిస్తాన్ కీలకమైన లింకుగా మారుతుందని వారు విశ్లేషిస్తున్నారు."**

కోడానికి నెల రోజుల ముందు తాలిబాన్ నాయకుడు ముల్లా అబ్దుల్ బరాదర్ నాయకత్వంలోఒక బృందం బీజింగ్ వెళ్లి చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యితో చర్చలు జరిపింది. ఉగ్రవాదులతో తాలిబాన్ల సంబంధాలను తెంచుకోవాలని చైనా మంత్రి వారికి సూచించారు. "మా దేశం నుండి ఉగ్రవాదులు కార్యకలాపాలు నిర్వహించకుండా చూస్తాం" అని బరాదర్ హామీ ఇస్తూ తమ దేశంలో చైనా పెట్టుబడులు పెట్టాలని కోరారు. కాబూల్ తాలిబాన్ల వశమైన తరువాత ఆ సంస్థ రాజకీయ వ్యవహారాల అధికారి అబ్దుల్ సలామ్ హనాఫి కాబూల్‌లోచైనా రాయబారి వాంగ్ యును కలుసుకుని తాజా పరిణామాల గురించి చర్చించారు. "చైనాకూ తాలిబాన్లకూ మధ్య చర్చలు, సంప్రదింపులు సమర్ధవంతంగా జరుగుతున్నాయి" అని చైనా విదేశాంగ ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ పేర్కొన్నారు. "ఆఫ్ఘన్ ప్రజలు తమ భవిష్యత్తుకు సంబంధించి తీసుకునే స్వతంత్ర నిర్ణయాలను చైనా గౌరవిస్తుంది. ఆఫ్ఘన్‌ల నాయకత్వంలో, దాని స్వంత పద్ధతుల అమలుకు మద్దతిస్తుంది. ఆఫ్ఘనిస్తాన్‌తో మంచి ఇరుగుపొరుగు సంబంధాలు నెలకొల్పుకొంటుంది. ఆ దేశంలో శాంతి నెలకొల్పడంలోనూ, దేశ పునర్నిర్మాణంలోనూ నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుంది" అని ఆయన పత్రికల వారితో చెప్పారు. రష్యా, ఇరాన్‌లు కూడా తాలిబాన్లతో సంబంధాలు పెట్టుకున్నారు. అందువల్లనే తాలిబాన్లు అధికారం చేపట్టిన తరువాత చైనా, రష్యా, ఇరాన్, టర్కీ మొదలైన దేశాల రాయబార కార్యాలయాలు మూసివేయకుండా తెరిచే ఉన్నాయి. అమెరికా దాని మిత్ర దేశాల రాయబార కార్యాలయాలు మూత పడ్డాయి.

మొత్తం మీద చూసినప్పుడు ఆఫ్ఘనిస్తాన్ నుండి అమెరికా వైదొలగిన తరువాత ఏర్పడిన ఖాళీని చైనా, రష్యా, ఇరాన్ తదితర దేశాలు పూడ్చే అవకాశం ఉందని నిపుణులు



ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్

చెబుతున్నారు. ఈ దేశాలన్నీ అంతర్జాతీయ యవనిక మీద అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేస్తున్న శక్తులే కావడం విశేషం. పాకిస్తాన్‌కు అంతకు ముందు నుండే తాలిబాన్లతో సన్నిహిత సంబంధాలున్నాయి. చైనా బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు ద్వారా మధ్య ఆసియానూ, యూరోప్‌ను కలపడానికి ఆఫ్ఘనిస్తాన్ కీలకమైన లింకుగా మారుతుందని వారు విశ్లేషిస్తున్నారు.

### 'ఆకుస్' కూటమి

ఆఫ్ఘనిస్తాన్‌లో పరాభవం జరిగిన నెల రోజులకే చైనాపై యుద్ధ సన్నాహాల్లో భాగంగా అమెరికా కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఇండో పసిఫిక్ ప్రాంతంలో ఇప్పటికే చైనాకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన చతుష్టయ (క్వాడ్) కూటమికి తోడుగా ఆస్ట్రేలియా, బ్రిటన్, అమెరికాలతో కూడిన త్రైపాక్షిక సైనిక కూటమి "ఆకుస్"ను ఏర్పాటు చేసింది. క్వాడ్‌లోని రెండు దేశాలైన అమెరికా, ఆస్ట్రేలియాలకు తోడు బ్రిటన్ ఇందులో చేరడం, ఆస్ట్రేలియాకు అణు జలాంతర్గాములు సరఫరా చేయడం ఈ కూటమి వెనుకనున్న రెండు ప్రధానాంశాలు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత బ్రిటన్ ఆసియా పసిఫిక్ వ్యవహారాల్లో మళ్లీ పెద్ద ఎత్తున సైనికంగా పాల్గొనడం ఇదే ప్రథమం. "ఆకుస్ ఒప్పందం మూడు దేశాల మధ్య అనేక తరాల పాటు ఉండిపోయే బంధం ఏర్పరుస్తుంది" అని అమెరికా అధికారి ఈ సందర్భంగా మీడియాతో చెప్పిన విషయం గమనార్హం.

చైనాకు వ్యతిరేకంగా ఆసియా కేంద్రంగా (ఆసియా పైవోట్) యుద్ధ సన్నాహాలు చేయాలని బరాక్ ఒబామా తీసుకున్న నిర్ణయాన్ని బైడెన్ ప్రభుత్వం మరింత ముందుకు తీసుకుపోయింది. అందులో భాగమే క్వాడ్‌ను బలోపేతం చేయడం, కొత్తగా 'ఆకుస్' సైనిక కూటమిని ఏర్పాటు చేయడం. "ఉగ్రవాదంపై యుద్ధం" నుండి "చైనాను కట్టడి చేయడం" దిశగా అమెరికా విదేశాంగ విధానంలో వచ్చిన మార్పుల కారణంగానే బైడెన్ ప్రభుత్వం ఆఫ్ఘనిస్తాన్ నుండి దళాలను ఉపసంహరించుకుని చైనాకు వ్యతిరేకంగా సైనిక కూటములు నిర్మిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు.

రానున్న దశాబ్ద కాలంలో ఆస్ట్రేలియాకు అణు జలాంతర్గాములను సరఫరా చేయాలని 'ఆకుస్' దేశాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రపంచంలో అణుయుద్ధ ప్రమాదాన్ని మరింత పెంచుతుంది. ప్రస్తుతం అమెరికా (68), రష్యా(29)లతో సహా మరో నాలుగు దేశాలు – బ్రిటన్ (11), ఫ్రాన్స్(8) చైనా(12), భారత్ (1) వద్ద మాత్రమే అణు జలాంతర్గాములున్నాయి. ఇరాన్, ఉత్తర కొరియాల అణు కార్యక్రమంపై చిందులు వేసే అమెరికా, బ్రిటన్‌లు ఆస్ట్రేలియాను అణ్వస్త్ర దేశంగా మార్చడానికి ప్రయత్నించడం వాటి ద్వంద్వ వైఖరికి నిదర్శనం. అయితే ఆకుస్ ఏర్పాటు సామ్రాజ్యవాద కూటమిలో వైరుధ్యాలను మరింత పెంచింది. ఫ్రాన్స్ నుండి డీజిల్ జలాంతర్గాములు కొనుగోలు చేయడానికి అనేక మాసాలుగా ఆస్ట్రేలియా మంతనాలు జరుపుతోంది. ఇప్పుడు అకస్మాత్తుగా అమెరికా నుండి అణు జలాంతర్గాముల దిగుమతి ఒప్పందం కుదరడంతో ఆస్ట్రేలియా ఫ్రాన్స్ నుండి జలాంతర్గాముల కొనుగోలు చర్చలను రద్దు చేసుకుంది. దీని పట్ల ఫ్రాన్స్ తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికా తనను వెన్నుపోటు పొడిచిందని పేర్కొంటూ అమెరికా, ఆస్ట్రేలియాలనుండి తన రాయబారులను ఉపసంహరించుకుంది. ఇప్పటికే అమెరికా నుండి విడగొట్టుకుని ప్రపంచ వ్యవహారాల్లో ముఖ్యంగా చైనాతో సంబంధాల్లో స్వతంత్రంగా

వ్యవహరించాలనుకుంటున్న ఫ్రాన్స్, జర్మనీలు 'ఆకుస్' ఏర్పాటుతో రానున్న కాలంలో అమెరికా నుండి మరింత దూరం జరిగే అవకాశాలున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో తమ విధానం ఎలా ఉండాలన్న దానిపై ఇటీవలే ఐరోపా యూనియన్ ఒక విధాన పత్రం ప్రకటించింది. ఒకవైపు ఆసియా-పసిఫిక్‌లో అమెరికాతో సహకరిస్తూనే మరోవైపు యూరప్ స్వంత నిర్ణయాలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు. చైనాను మానవహక్కులు వంటి విషయాల్లో వ్యతిరేకిస్తూనే దానితో వాణిజ్య సంబంధాలకు అవి అడ్డురాకుండా చూసుకోవాలనిపత్రంలో పేర్కొన్నారు. ఆకుస్ ఒప్పందంతో సామ్రాజ్య వాదుల మధ్య విభజన మరింత పెరిగే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

**భారతదేశం పరిస్థితి**

ఆఫ్ఘన్ విషయంలోనూ, ఆకుస్ ఏర్పాటు విషయంలోనూ భారత్ పరిస్థితి ఇరకాటంలో పడింది. మన విదేశాంగ విధానం స్టీరింగ్‌ను అమెరికా చేతికి ఇచ్చిన భారత పాలకులకు ఇప్పుడు జాతీయ ప్రయోజనాలను పక్కన బెట్టి అమెరికా ఎటు తీసుకుపోతే అటు పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఇరాన్ విషయం లో మాదిరిగానే ఆఫ్ఘనిస్తాన్‌లో కూడా భారత్ గుడ్డిగా అమెరికాను అనుసరించడం వల్ల అక్కడి వ్యవహారాల్లో భారత్‌కు పూర్తిగా చోటులేకుండా పోయింది. అమెరికాతో సహా భారతదేశం కూడా కాబూల్‌లో దౌత్య కార్యాలయం మూసివేయాల్సి వచ్చింది. ఆఫ్ఘనిస్తాన్ పరిణామాల్లో అమెరికా తన మిత్రదేశంగా భారత్‌కు తగిన గౌరవం ఇచ్చిందా అంటే అదీ లేదు. భారత్ అభిప్రాయాలతో నిమిత్తం లేకుండానే అమెరికా తాలిబాన్లతో దోహా చర్చలు జరిపింది. దాని ప్రమేయం లేకుండానే ఆఫ్ఘనిస్తాన్ నుండి దళాలను ఉపసంహరించుకుంది. అమెరికాపై నమ్మకం పెట్టుకున్న భారత ప్రభుత్వం ఆఫ్ఘన్ పరిణామాలను స్వతంత్రంగా అంచనా వేయలేకపోయింది. దాంతో కాబూల్‌ను తాలిబాన్లు మెరుపు వేగంతో ఆక్రమించుకున్నప్పుడు భారతదేశం తన దౌత్య సిబ్బందినీ, దేశ పౌరులను ఆఫ్ఘనిస్తాన్ నుండి తగిన సమయంలో తరలించలేక చతికిలబడింది. గతంలో అమెరికా షరతులకు తలొగ్గి ఇరాన్‌తో సంబంధాలను వదులుకున్న భారత్ నేడు ఆఫ్ఘన్‌లో కూడా స్థానం కోల్పోవడంతో మొత్తం మధ్య ఆసియాలో తన ప్రభావాన్ని కోల్పోయినట్లయింది.

**“ ఆఫ్ఘన్ విషయంలోనూ, ఆకుస్ ఏర్పాటు విషయంలోనూ భారత్ పరిస్థితి ఇరకాటంలో పడింది. మన విదేశాంగ విధానం స్టీరింగ్‌ను అమెరికా చేతికి ఇచ్చిన భారత పాలకులకు ఇప్పుడు జాతీయ ప్రయోజనాలను పక్కన బెట్టి అమెరికా ఎటు తీసుకుపోతే అటు పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఇరాన్ విషయం లో మాదిరిగానే ఆఫ్ఘనిస్తాన్‌లో కూడా భారత్ గుడ్డిగా అమెరికాను అనుసరించడం వల్ల అక్కడి వ్యవహారాల్లో భారత్‌కు పూర్తిగా చోటులేకుండా పోయింది. ”**



ఆన్‌లైన్ సమావేశంలో 'ఆకుస్' కూటమి ఏర్పాటును ప్రకటిస్తున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మారిసన్, బ్రిటిష్ ప్రధాని బోరిస్ జాన్సన్

ఇక ఆకుస్ ఏర్పాటులో కూడా క్వాడ్ భాగస్వామి అయిన భారతదేశాన్ని అమెరికా విశ్వాసంలోకి తీసుకోలేదు. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, భారత్‌లతో కూడిన 'క్వాడ్' కూటమి దేశాల అగ్రనేతల సమావేశం అమెరికాలో ప్రత్యక్షంగా జరగడానికి కొద్ది రోజుల ముందు క్వాడ్‌లో భాగస్వాములైన అమెరికా, ఆస్ట్రేలియాలు బ్రిటన్‌తో కలిసి మరో కూటమిని ఏర్పాటు చేయడం అంటే భారత్‌ను అమెరికా సమాన భాగస్వామిగా కాకుండా జూనియర్ భాగస్వామిగా మాత్రమే పరిగణిస్తున్నదని అర్థమవుతుంది. ఇండో-పసిఫిక్‌లో చైనాను నిలువరించడమే ఆకుస్ ప్రధాన లక్ష్యంగా పరోక్షంగా ప్రకటించారు. అటువంటప్పుడు అదే లక్ష్యంతో ఏర్పడిన క్వాడ్ కూటమి ప్రాధాన్యత రీత్యా పక్కకు పోతుందన్న భావం భారత దౌత్య వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఆస్ట్రేలియాకు అణు జలాంతర్గాముల సాంకేతిక పరిజ్ఞానం బదిలీ చేయడానికి ఆకుస్ ఒప్పందం చేసుకున్న అమెరికా భారత్‌కు మాత్రం ఈ జలాంతర్గాములు అమ్మడానికి ససేమిరా అంటోంది. భారత్‌కు అణు జలాంతర్గాముల సరఫరాకు అమెరికా నిరాకరించడంతో రష్యా నుండి మన దేశం ఒక అణు జలాంతర్గామిని కొనుగోలు చేసింది. ఆకుస్ ఒప్పందం ద్వారా ఆస్ట్రేలియా అణు జలాంతర్గాములు తయారు చేయడం మొదలు పెడితే ఈ ప్రాంతంలో ఆయుధ పోటీ పెరిగిపోతుందని చైనా తీవ్రంగా తప్పుపట్టింది. గతంలో సోవియట్‌ను చుట్టుముట్టినట్లే నేడు చైనాను సైనికంగా చుట్టుముట్టి సరికొత్త ప్రచ్ఛన్న యుద్ధాన్ని ప్రారంభించడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాల్లో భాగమే క్వాడ్, ఆకుస్ తదితర కూటముల ఏర్పాటు. ఇవన్నీ సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం సామ్రాజ్యవాదులచేత ఏర్పాటు చేయబడిన కూటములు. గతంలో అలీనోద్యమానికి నాయకత్వం వహించిన భారతదేశం నేడు తన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని విడనాడి, ఈ సామ్రాజ్యవాద కూటముల్లో జూనియర్ భాగస్వామిగా చేరి, వాటి యుద్ధ ప్రయత్నాల్లో పావుగా మారడం అత్యంత విషాదకరమైన అంశం. ఈ విధానం మన దేశ ప్రజల ప్రయోజనాలకు అన్ని విధాలా నష్టం కలిగిస్తుంది.

❈

# పెట్టుబడిదారీ విధానంపై పోరాడితేనే వాతావరణ ప్రమాదం నుండి రక్షణ

## ఐపిసిసి నివేదిక

**2021,** ఆగస్టు 9 వ తేదీన వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి అంతర్ ప్రభుత్వాల సంప్రదింపుల కమిటి (ఐపిసిసి) వాతావరణ మార్పులు 2021 నివేదికను ప్రచురించింది. దాని మొదటి వర్కింగ్ గ్రూపు రాసిన ఆరవ అంచనా రిపోర్టులలో ఇది మొదటిది. వాతావరణ మార్పులకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులను ఇందులో వివరంగా పేర్కొన్నారు. పార్ట్ ఒకటి నివేదికకు అదనంగా మరో రెండు నివేదికలు, రెండవ వర్కింగ్ గ్రూపు రాసే 'సంభవించనున్న పరిణామాలు', షెడ్యూల్ ప్రకారం 2022 ఫిబ్రవరిలో వెలువరిస్తారు. మూడవ వర్కింగ్ గ్రూపు రాస్తున్న 'ప్రమాదాలను తగ్గించటం' నివేదిక 2022 మార్చిలో విడుదల అవుతుంది.

వాతావరణంపై ఈ సంవత్సరం నవంబరులో గ్లాస్గోలో జరగనున్న ఐక్యరాజ్యసమితి సిఓపి 26 చర్చలు, ముసాయిదా రెండు, మూడు నివేదికల నుండి ఈ వేసవికాలంలో అనధికారికంగా వెల్లడైన అంశాలను వాతావరణ విధ్వంసానికి పరిష్కారం కనుగొనటానికి మానవజాతికి చివరి అవకాశంగా అనేకమంది భావిస్తున్నారు. రెండవ వర్కింగ్ గ్రూపు రాస్తున్న నివేదిక జూన్ చివరిలో ఫ్రెంచి ప్రెస్ ఎఎఫ్‌పికి అనధికారికంగా వెల్లడవటం, దాని ప్రాతిపదికన ఆ పత్రిక "భయపడుతున్నదాని కన్నా ముందే తీవ్రమైన వాతావరణ పరిణామాలు సంభవిస్తాయి" అన్న వ్యాసం 2021,జూన్ 23 న ప్రచురించింది. ఒకటవ భాగం నివేదికను ప్రచురిచటానికి ముందే మూడవ భాగం నివేదికలోని ముఖ్యాంశాలలో 'విధాన నిర్ణేతలకు విజ్ఞాపన'ను ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకిస్తున్న శాస్త్రవేత్తలు అనధికారికంగా వెల్లడి చేశారు.

మూడవ భాగం నివేదికలోని అంశాలను అనధికారికంగా వెల్లడిస్తూ "వాతావరణ మార్పులను అడ్డుకోవటానికి పెరుగుదలను అరికట్టటం కీలకమని ఐపిసిసి భావిస్తున్నది" అన్న వ్యాసాన్ని ఆగస్టు 7న జర్నలిస్టులు జువాన్ బార్డెరా, ఫెర్నాండో ప్రీటోలు స్పానిష్ ఆన్‌లైన్ మాగజైన్ సిటిఎక్స్‌టిలో ప్రచురించారు. మూడవ భాగం నుండి అనధికారికంగా వెల్లడైన "విధాననిర్ణేతలకు విజ్ఞాపన" మూడవ వర్కింగ్ గ్రూప్ ఆమోదించిన ముసాయిదా నివేదిక. నివేదికను ప్రచురించటానికి ముందు వివిధ ప్రభుత్వాలు దానిలోని కీలక అంశాలను నీరుగార్చటానికి ప్రయత్నాలు చేయవచ్చు. ఆగస్టు చివరిలో మూడవ అంచనా నివేదిక నుండి చాప్టర్ ఒకటి అనధికారికంగా వెల్లడయింది. ఇంతకు ముందు భాగాన్ని వెల్లడి చేసిన శాస్త్రవేత్తల బృందమే ఈ భాగాన్ని కూడా వెల్లడి చేసింది. 2021, ఆగస్టు 31 న బార్డెరా, ప్రీటో, మరో ముగ్గురు సిటిఎక్స్‌టిలో " పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి నమూనా భరింపరానిదిగా తయారైందని అనధికారికంగా వెల్లడైన ఐపిసిసి నివేదిక హెచ్చరించింది" అన్న హెడ్డింగ్‌తో ప్రచురించారు.

ఫిజికల్ సైన్స్ ప్రాతిపదికగా ప్రచురించిన నివేదిక ఒకటవ భాగం వాతావరణ శాస్త్రాన్ని అర్థం చేసుకొంటున్న వారికి నిస్సందేహంగా తీవ్రమైన పరిణామాలు రాబోతున్నాయని వెల్లడించింది. నివేదికలో అత్యంత ప్రాధాన్యత గల అంశం ఏమిటంటే సామాజిక, ఆర్థిక పరిణామాలకు సంబంధించి అత్యంత సానుకూలమైన అంచనాలు ఎస్ఎస్‌పి 1–1.9. ప్రపంచవ్యాపితంగా కార్బన్ వాయువుల విడుదల రానున్న నాలుగు సంవత్సరాలలో అత్యున్నతస్థాయికి చేరుతుందని భావిస్తున్నారు. ఫలితంగా మానవజాతి తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. వాతావరణంలో తీవ్రమైన మార్పులు సంభవిస్తాయి. రికార్డుస్థాయిలో వరదలు, వడగాలులు, కరువులు, రుతుపవనాలు రాకపోవటం, తీవ్రమైన గాలులు వీచటం, మంచు పర్వతాలు కరిగిపోవటం, సముద్రమట్టాలు పెరగటం తదితరాలు ప్రపంచంలోని ప్రతి ప్రాంతాన్ని ప్రభావితం చేస్తాయి. ఆశావాదంతో అంచనా వేస్తున్న రెండవ అంశం ఎస్ఎస్‌సి 1–2.6 దీనిలో 2081–100 మధ్య ప్రపంచంలో సగటు ఉష్ణోగ్రత రెండు డిగ్రీల కన్నా కొంచం తక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇది ఆశావాదంతో వేస్తున్న చివరి అంచనా అని, అది కూడా తీవ్రమైన ప్రమాదాలను తెస్తుందని భావిస్తున్నారు. భవిష్యత్‌లో సంభవిస్తాయని భావిస్తున్న మిగతా మూడు అంశాలను గురించి ఊహించటానికే భయం వేస్తున్నది. ప్రస్తుత పరిణామాలను బట్టి చూసినట్లైతే అవి మానవజాతి ఉనికిని, ప్రస్తుత నాగరికతను విధ్వంసం చేస్తాయని స్పష్టమౌతున్నది.

అత్యంత ఆశావాద దృక్పథంతో లేక ఎస్ఎస్‌పి 1–1.9 కు పెరుగుదలను గురించి వేస్తున్న అంచనాలలో 2040 వరకు ఉష్ణోగ్రత 1.5 సెంటిగ్రేడ్ డిగ్రీల వరకు చేరబోదని, 2041–60 కాలంలో 1.2–2 ల మధ్య, 1.6 సెంటిగ్రేడ్ డిగ్రీల వరకు పరిమితమై ఉంటే, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వాతావరణానికి హాని కలిగించే వాయువుల విడుదలను తగ్గిస్తున్నందు వలన 2081–100నాటికి 1.4 డిగ్రీలకు తగ్గిపోవచ్చు. కాని అర్థం చేసుకోవాల్సినదేమిటంటే ఇంతటి ఆశావహమైన అంచనాలు –ఎస్ఎస్‌పి 1–1.9–వాస్తవ రూపం దాల్చినా తరచుగా తీవ్రమైన వడగాలులు, భారీ వర్షాలు సంభవిస్తాయి. శతాబ్దాలు, సహస్రాబ్దాలలో కూడా ప్రస్తుత స్థితికి రాని విధంగా సముద్రమట్టాలు పెరుగుతాయి. సముద్రాలలో యాసిడ్ తయారు కావటం పెరిగి, తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుంది. కాబట్టి మానవాళికి సంభవిస్తున్న ఈ ప్రమాదాలను నివారించటం కోసం ఈ శతాబ్దం చివరికి ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5

డిగ్రీలకన్నా తక్కువకు పరిమితం చేయాలి. అయినప్పటికీ వాతావరణ మార్పులకు సంబంధించిన కొన్ని ప్రతికూల పరిణామాలు 21వ శతాబ్దం తర్వాత కూడా వందల కోట్ల ప్రజలకు తీవ్ర ప్రమాదం కలిగిస్తూనే ఉంటాయి. పెట్టుబడిదారీ విధాన కార్యకలాపాలు యధావిధిగా కొనసాగటం వలన చివరిదైన, ప్రపంచాన్ని పూర్తిగా నాశనం చేసే ఎస్ఎస్‌పి 5-8.5 -ఐదవ దశ-కు వెళితే ఈ శతాబ్దం చివరికి ప్రపంచ టెంపరేచర్ 3.3 నుండి 5.7కు, సగటున 4.4కు పెరుగుతుంది. ఇది మానవజాతితో పాటు అనేక జీవజాతులు పూర్తిగా అంతరించిపోవటానికి దారితీస్తుంది.

రెండవ వర్కింగ్ గ్రూపు ఆరవ అంచనా నివేదిక పార్ట్ రెండులో ఎఎఫ్‌పికి లీకైన భాగాలు, "సంభవించనున్న పరిణామాలు"పై అనేక వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. గతంలో సంభవించిన ప్రధాన వాతావరణ మార్పులు వాతావరణంలో నాటకీయమైన మార్పులకు దారితీసి, అనేక జీవజాతులను తుడిచిపెట్టాయని, మానవజాతి తన వినాశనానికి తానే బీజాలు వేసుకొంటున్నదా అన్న ప్రశ్నను ప్రస్తుత మార్పులు లేవనెత్తుతున్నాయని నివేదికలో పేర్కొన్నట్లు ఎఎఫ్‌పి వెల్లడించింది. "తీవ్రమైన వాతావరణ మార్పుల వలన భూమిపై నూతన వాతావరణ పరిస్థితులు ఏర్పడి, నూతన జీవజాతులు అభివృద్ధి చెందుతాయి. కాని మానవజాతికి అవకాశం లేదు" అని చెప్పారు. పార్ట్ రెండు నివేదిక ముగింపులో ఈ విధంగా పేర్కొన్నారు. "అన్ని స్థాయిలలోనూ వ్యక్తులు, సామూహిక స్థాయిలో , వ్యాపారాలు, సంస్థలు, ప్రభుత్వాల విధానాలలో మార్పులు జరగాలి. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మన జీవిత విధానాలను, వినియోగాన్ని మార్చుకోవాలి".

నూతనంగా రూపొందించిన ఐపిసిసి నివేదిక పార్ట్ మూడు "ప్రమాదాలను తగ్గించటం" అత్యంత ఆశ్చర్యకరమైన అంశాలను ప్రస్తావించింది. ఆగస్టు 7న బార్సెరా, ప్రీటో సిటిఎక్స్‌టిలో ప్రచురించిన వ్యాసంలో పార్ట్ మూడులోని మూడవ వర్కింగ్ గ్రూపు ఆమోదించిన "విధాన నిర్ణేతలకు విజ్ఞప్తి" ముసాయిదా నుండి అనధికారికంగా వెల్లడైన వాటిలోని ముఖ్యాంశాలను వ్యాసంలో ఉదహరించారు. అనధికారికంగా వెల్లడైన భాగంలోని వ్యాసంలో ఉదహరించని అంశాలు కూడా అంతే ప్రాముఖ్యతను కలిగివున్నాయి. పార్ట్ మూడు నివేదికలోని ఒక ముఖ్యమైన అంశం ఏమిటంటే ఉష్ణోగ్రత పెరుగుదలను

**"నివేదికలోని ఒక ముఖ్యమైన అంశం ఏమిటంటే ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల కన్నా తక్కువగా ఉంచాలంటే ప్రస్తుతం ఉన్న బొగ్గు, గ్యాస్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు అదనంగా ఏవీ నిర్మించకూడదని, ప్రస్తుతం ఉన్నవాటినే ఒక దశాబ్దం లోపల తొలగించాలని చెప్పింది. కార్బన్ ఉద్గారాలను తగ్గించటానికి అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానం ఒక్కటే సరిపోదని నొక్కిచెప్పింది."**



1.5 డిగ్రీల కన్నా తక్కువగా ఉంచాలంటే ప్రస్తుతం ఉన్న బొగ్గు, గ్యాస్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు అదనంగా ఏవీ నిర్మించకూడదని, ప్రస్తుతం ఉన్న వాటినే ఒక దశాబ్దం లోపల తొలగించాలని చెప్పింది. వెల్లడైన నివేదిక మూడవ భాగంలోని "విధాన నిర్ణేతలకు విజ్ఞప్తి"లో అత్యంత ముఖ్యమైన అంశం ఏమిటంటే కార్బన్ ఉద్గారాలను తగ్గించటానికి అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానం ఒక్కటే సరిపోదని నొక్కిచెప్పటం. భౌతిక అవసరాల ఉత్పత్తి, వినియోగంలో పూర్తిగా సామాజిక పద్ధతులకు మారాలని పేర్కొంది. టెంపరేచర్ పెరుగుదలను 1.5 డిగ్రీలకు లోపుగా పరిమితం చేయాలంటే కార్బన్ డై ఆక్సైడ్‌ను ఉత్పత్తి చేసేవాటిని తగ్గించటం కోసం కేవలం సాంకేతిక పరిజ్ఞానంపైనే ఆధారపడటం కాకుండా అవసరమైన ఇతర చర్యలు కూడా తీసుకోవాలి. భూగోళం మానవాళికి సురక్షితమైన ప్రదేశంగా ఉండకుండా జరుగుతున్న మార్పులను నిరోధించాలి.

ప్రస్తుతం ప్రపంచంలో జరుగుతున్న విద్యుత్ ఉత్పత్తిలో 7 శాతం మాత్రమే సౌర, వాయుశక్తితో ఉత్పత్తి చేస్తున్నాం. మిగతా దానిలో అత్యధిక భాగం శిలాజ ఇంధనాలతో ఉత్పత్తి చేస్తున్నాం. శిలాజ ఇంధనాలతో ఉత్పత్తి చేయటానికి సాంకేతిక పరిజ్ఞానం అనువుగా ఉండటంతో సౌర, వాయు శక్తితో విద్యుత్‌ను ఉత్పత్తి చేయటాన్ని ప్రోత్సహిస్తున్నప్పటికీ శీఘ్ర ప్రగతిని నిరోధిస్తున్నది. కార్బన్ ఉద్గారాలను తగ్గించటానికి కార్పొరేట్ సంస్థలు అనుసరిస్తున్న విధానం ఉత్పత్తితో పోల్చుకున్నపుడు ఉద్గారాలను తగ్గిస్తున్నప్పటికీ, మొత్తంగా ఉత్పత్తి పెరగటం వలన ఉద్గారాలు కూడా పెరుగుతున్నాయి. అడవులను విస్తరించటం, అడవులను నరికిన చోట తిరిగి పెంచటం, భూసారాన్ని పరిరక్షించటం, జీవులు, ప్రకృతి మధ్య సమతుల్యాన్ని పరిరక్షించటం తదితర జీవసంబంధ, ప్రకృతి రక్షణ కోసం తీసుకొంటున్న చర్యలు తక్షణ భవిష్యత్తు పట్ల ఆశను కలిగిస్తున్నాయి. దీనికి భిన్నంగా కార్బన్ డై ఆక్సైడ్‌తో వాయు కాలుష్యం, గనుల తవ్వకాన్ని తీవ్రం చేయ టంతో పెరిగే కాలుష్యం, సముద్రాలలో రసాయనాల ప్రభావం పెరగటం, బయో ఎనర్జి, కార్బన్‌ను సేకరించటం, నిల్వ చేయటం తదితరాలకు అవసరమైన శాస్త్ర, సాంకేతికాభివృద్ధి లేకపోవటం, అధికవ్యయం తదితరాలు ప్రమాదకరమైన పర్యవసానాలకు దారితీస్తున్నాయి. దీనిని పరిష్కరించటానికి అణుశక్తిని ఉపయో గించటంలో

**"అభివృద్ధి చెందుతున్న దేశాలు 2010లో విడుదల చేసిన గ్రీన్‌హౌస్ వాయువులలో 46 శాతం, 2015లో విడుదల చేసిన గ్రీన్‌హౌస్ వాయువులలో 41 శాతం అభివృద్ధి చెందిన దేశాలకు ఎగుమతి చేయటానికి ఉద్దేశించిన ఉత్పత్తుల వలన ఉద్భవించినవి. అంటే కాలుష్య వాయువులు ఉత్పత్తి ప్రాతిపదికపై కాక, వినియోగం ప్రాతిపదికపై ఉద్భవిస్తున్నాయని స్పష్టమౌతు న్నది. వైమానిక రంగంలో వస్తున్న కాలుష్య వాయువులలో సగం ఒకశాతం ధనికుల వలన ఉద్భవిస్తున్నాయి."**

అనేక ఆటంకాలు, ప్రమాదాలు ఉన్నాయి. అందువలన పర్యావరణ మార్పులను తగ్గించటంలో అణుశక్తి, కార్బన్ రిమూవల్ సాంకేతిక పరిజ్ఞానాల పాత్ర ప్రశ్నార్థకంగా ఉన్నది.

ఆ విధంగా పార్ట్ మూడులోని వెల్లడైన భాగాలలోని ''ప్రమాదాల తగ్గింపు''లో ఆర్థికవ్యవస్థలోని అన్ని విభాగాలలోనూ విద్యుత్, ఇతర ఎనర్జీల వినియోగాన్ని పరిమితం చేయాలని, తక్కువ శక్తిని వినియోగించే, అతి తక్కువ శక్తితో ఉత్పత్తి చేసే పద్ధతుల కోసం తీవ్రమైన ప్రయత్నాలు చేయాలని తదితర డిమాండ్ సైడ్ వ్యూహాలను అమలు చేయాలని ఐపిసిసి నివేదికలో మొదటి సారిగా చెప్పారు. నగరాలను అవసరాలకు అనుగుణంగా పూర్తిగా "నూతన నగరాలు"గా నిర్మించాలని పేర్కొంది. రవాణారంగంలో స్పోర్ట్స్ వాహనాలు, ఎక్కువ గ్యాస్‌ను వినియోగించే వాహనాలను పక్కన పెట్టి, ప్రజా రవాణా వాహనాల వైపు దృష్టి మళ్ళించాలని, ఎలక్ట్రిక్ కార్లు, బైక్‌లు, ఆటోలు తదితరాల వినియోగాన్ని పెంచాలని చెప్పింది. ఎక్కువగా మాంసాన్ని వినియోగించే ఆహారాలను తగ్గించాలని, ప్లాస్టిక్ ఉత్పత్తులను భారీస్థాయిలో తగ్గించాలని పేర్కొంది. "ప్రజల సంక్షేమాన్ని కొనసాగిస్తూ, మరింత మెరుగుపరుస్తూనే తక్కువ విద్యుత్ వినియోగించే క్రమంలో 2018 నాటికన్నా 2050 నాటికి 40 శాతం డిమాండ్ తక్కువగా ఉండేలా చూడాలని'' నివేదికలో పేర్కొ న్నారు. ప్రపంచస్థాయిలోనూ, ప్రతిస్థాయిలోనూ ఉత్పత్తి, వినియోగ విధానంలో మౌలికమైన మార్పులను తీసుకురావటం అవసరం. వాతావరణ విధానాలలో వేగవంతమైన మార్పుల కోసం పూర్తిగా నూతనమైన, స్థిరమైన అభివృద్ధి విధానాల వైపు మళ్ళాల్సి ఉంటుంది. ప్రస్తుత యధాతథ విధానాన్ని కొనసాగించే క్రమమైన మార్పుల స్థానంలో సమూలమైన మార్పులను తీసుకువచ్చే విధానాలను ప్రవేశపెట్టాల్సి ఉంటుంది.

మూడవ భాగంలోని''విధాన నిర్ణేతలకు విజ్ఞప్తి''లో పర్యావరణ సమస్యలో పర్యావరణ అన్యాయం కేంద్రస్థానం ఆక్రమిస్తుందని నొక్కి చెప్పారు. ఆ విధంగా దిగుస్థాయిలోని 10 శాతం ప్రజలక కన్నా పై స్థాయిలోని 10 శాతం మంది తలసరి 10 రెట్లు ఎక్కువ కాలుష్య వాయువులను విడుదల చేస్తున్నారని నివేదికలో చెప్పారు. ప్రపంచంలోని 10 శాతం ధనికులు 36-45 శాతం కాలుష్య వాయువులను విడుదల చేస్తుండగా, 10 శాతం అత్యంత పేదలు 3-5 శాతం కాలుష్య వాయువులను విడుదల చేస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు 2010లో విడుదల చేసిన గ్రీన్‌హౌస్ వాయువులలో 46 శాతం, 2015లో విడుదల చేసిన గ్రీన్‌హౌస్ వాయువులలో 41 శాతం అభివృద్ధి చెందిన దేశాలకు ఎగుమతి చేయటానికి ఉద్దేశించిన ఉత్పత్తుల వలన ఉద్భవించినవి. అంటే కాలుష్య వాయువులు ఉత్పత్తి ప్రాతిపదికపై కాక, వినియోగం ప్రాతిపదికపై ఉద్భవిస్తున్నాయని స్పష్టమౌతున్నది. వైమానిక రంగంలో వస్తున్న కాలుష్య వాయువులలో సగం ఒకశాతం ధనికుల వలన ఉద్భవిస్తున్నాయి.

మూడవ భాగంలోని "విధాన నిర్ణేతలకు విజ్ఞప్తి"లో కార్మికసంఘాలు ముందుకు తెచ్చిన "న్యాయమైన పరివర్తన" భావనను తప్పనిసరిగా పర్యావరణ మార్పుల విధానంలో భాగంగా చేయాలని పేర్కొన్నారు. వాతావరణ ప్రతికూలతలను తగ్గించే విధానాలలో అన్ని స్థాయిలలోనూ అసమానతలు చోటు చేసుకుంటున్నాయి. వాతావరణ మార్పులకు దారితీసే విధానాలను శక్తివంతంగా అమలు చేయాలంటే కార్బన్‌ల విడుదలను తగ్గించే క్రమంలో కార్మికులు, వివిధ సమూహాలు, బలహీనమైన వారిని వెనుక వదిలివేయకుండా కలుపు కెళ్ళటానికి, సమన్యాయం కల్పించటానికి ప్రయత్నాలు చేయాలి. మహిళలు, జాతి, సమాజంలోని దిగువస్థాయి గ్రూపులు భాగస్వాములు కావటం పెరగటంతో వాతావరణంపై కార్యాచరణ వేగం పుంజుకొంటున్నది. గుర్తింపు పొందిన, గుర్తింపు లేకుండా పర్యావరణ పరిరక్షణ కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థల ద్వారా పెరుగుతున్న ఉద్యమాలు, జీవన విధానాలలో మార్పుల కోసం అనధికారికంగా జరుగుతున్న ఉద్యమాలు కూడా వాతావరణ మార్పుల కోసం జరుగుతున్న ఉద్యమాల శక్తిని పెంచుతున్నాయి. పర్యావరణ పరిరక్షణ కోసం జరుగుతున్న ఉద్యమాలలో 180 దేశాలలోని యువత భాగస్వాములయారు.

మూడవ భాగంలోని చాప్టర్ ఒకటి ప్రధానంగా కాలుష్యాన్ని తగ్గించటంపై ఈ మధ్యకాలంలో వచ్చిన సాహిత్యాని విశ్లేషించటానికే పరిమితమైంది. ఇంతకు ముందు వచ్చిన ఐపిసిసి నివేదికలతో పోల్చుకున్నపుడు అనేక అంశాలపై విమర్శలు చేయటం, రాజకీయ, ఆర్థిక అంశాలు, విద్యుత్ రంగంలో శిలాజ ఇంధనాలతో ఉత్పత్తి చేసిన విద్యుత్ ఆధిపత్యం, ప్రపంచంలోని అసమాన మార్పిడులు, పెరుగుదలను తగ్గించటంలో న్యాయబద్ధత తదితర మౌలికమైన అంశాలను ప్రస్తావించింది. పెట్టుబడిదారీ సమాజం తీసుకొచ్చిన అభివృద్ధి సమాజం భరించలేనిదిగా తయారైందని అనేకమంది రాజకీయ, ఆర్థికవేత్తలు చేసిన విమర్శలను నివేదికలో ప్రస్తావించారు. వాస్తవంగా వెల్లడైన వివేదికలోని చాప్టర్ ఒకటిని జాగ్రత్తగా, విమర్శనాత్మకంగా చదివితే మానవజాతి మనుగడ సాగించాలంటే వ్యవస్థను పూర్తిగా మార్చటం ఒక్కటే మార్గమని స్పష్టమౌతుంది. నూతన ఐపిసిసి నివేదికను విడుదల చేస్తున్న సందర్భంలో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి అంటోనియో గుటెరస్ "ప్రమాదాన్ని గురించి మానవజాతికి ఇది హెచ్చరిక" అని ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. మానవజాతి మనుగడకు ప్రధాన అవరోధంగా ఉన్న పెట్టుబడిపై అన్ని ప్రాంతాలలోనూ ప్రజలు దృఢ నిశ్చయంతో పోరాడితేనే ప్రపంచ ప్రజానీకానికి భవిష్యత్‌పై ఆశలు ఉంటాయని నివేదిక స్పష్టం చేస్తున్నది.

**(స్వేచ్ఛానువాదం:ఎ కోటిరెడ్డి)**

# పెట్టుబడిని వేగంగా సమీకరించుకోవడానికి క్రోనీయిజం ఒక మార్గం

## సందేహాలు సమాధానాలు



బి.వి. రాఘవులు

**గౌరవనీయులు బివి రాఘవులు గారికి,**
**ఈ మధ్య కాలంలో 'క్రోనీ కాపిటలిజం' అన్న మాట తరచూ వినబడుతోంది. 'క్రోనీ కాపిటలిజం అంటే ఏమిటో తెలియజేయగలరు**

**దుంపల కృష్ణారావు, బారువా గ్రామం,**
**శ్రీకాకుళం జిల్లా.**

క్రోనీ అన్న ఆంగ్ల విశేషణానికి తెలుగులో 'ఆశ్రిత' / సన్నిహిత' అన్న అర్థం చెప్పుకోవచ్చు. అప్పుడు క్రోనీ కాపిటలిజం అన్న మాటను ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంగా పేర్కొనవచ్చు.

ఇందులో ఆశ్రయించేవారు వ్యక్తులు, సంస్థలు. ఆశ్రయం ఇచ్చేది పాలకులు అధికారంలో వున్న రాజకీయవేత్తలు/పార్టీలు, పాలనలో కీలక స్థాయిల్లో వున్న నిరంతర అధికార బృందం కలిసి వ్యక్తులకు, సంస్థలకు ప్రయోజనం కల్గించే పద్ధతిలో నిర్ణయాలు చేస్తూ వుంటే అటువంటి ఆర్థికవ్యవస్థను క్రోనీ కాపిటలిజం అంటాం. మరో రూపంలో చెప్పాలంటే వ్యాపార ప్రయోజనాలు, రాజకీయ ప్రయోజనాలు బహిరంగంగా పెనవేసుకుపోయి పని చేస్తుంటే అటువంటి పరిస్థితిని మనం క్రోనీ కాపిటలిజంగా పిలుస్తుంటాం. పెట్టుబడిదారులు రాజకీయ పలుకుబడితో పన్ను రాయితీలు పొందడం, సబ్సిడీల రూపంలో నగదు సహాయం పొందడం, ఉచితంగా లేక కారుచౌకగాలట భూమి, గనులు పొందడం, ప్రభుత్వరంగ సంస్థలను కారు చౌకగా కొనడం వగైరా క్రోనీ పద్ధతికి ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. బిజెపి, మోడీ ప్రభుత్వం ప్రకటించిన ప్రైవేటీకరణ, నగదీకరణ (మానిటైజేషన్) ప్రణాళికలు క్రోనీయిజానికి పరాకాష్ట

ప్రభుత్వం ప్రజల ఆస్తులను, వనరులను, ఆదాయాలను ఉచితంగానో, కారుచౌకగానో పెట్టుబడిదారులకు దోచిపెట్టే పద్ధతులలో సహజంగానే ఆనాటి పాలకుల స్నేహితులకు, ఆశ్రితులకు ఎక్కువ లాభం జరుగుతుంది. వారిలకుపయోపడే విధంగా నిబంధనలు రూపొందిస్తారు. ప్రభుత్వ బ్యాంకులలోనిల ప్రజాధనాన్ని అప్పులు తీసుకొని కైంకర్యం చేసినవారిని రక్షిస్తారు. అదేమంటే సంపద సృష్టించాలటంచే వారిని ప్రోత్సహించాలని ఇటువంటి పరాన్న భుక్కులను వెనకేసుకొస్తారు. మోడీ హయాంలో అంబాని, అదానిలు రాకెట్ వేగంతో సంపన్నులయ్యారంటే సంపద సృష్టించి కాదు. పాలకులతో సాన్నిహిత్యాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వ, ప్రజల సంపదను కొల్లగొట్టడం ద్వారా సంపదను పోగుజేసుకున్నారు. అందుకే వారిని మోడీ హయాంలో పెరిగిపోయిన క్రోనీయిజానికి ప్రతీకలు/సింబల్స్‌గా చూస్తాం.

క్రోనీ కాపిటలిజం అన్న మాటను 'చెడ్డ' అర్థంలో వాడుతుంటాం. అసలైన పెట్టుబడిదారీ విధానం ఒకటుందని అది సమంజసమైనదని, దానికి భిన్నంగా తప్పుడు పద్ధతుల్లో, 'హనికరమైన పద్ధతుల్లో క్రోని కాపిటలిజం పనిజేస్తుందన్న అర్థం ఈ పదంలో ఇమిడి వున్నది. అందుకే వామపక్షవాదులతో పాటు అనేకమంది బూర్జువా ఆర్థిక నిపుణులు కూడా క్రోనీయిజాన్ని తీవ్రంగా విమర్శిస్తుంటారు.

అయితే క్రోనీ కాపిటలిజాన్ని వీరు విమర్శించే తీరు పెట్టబడిదారీ విధానపు నిజ స్వభావాన్ని మరుగుపర్చి, క్రోనీయిజం లేకపోతే పెట్టుబడిదారీ విధానం సమ్మతమైనదనే భావం కల్గిస్తుంది. క్రోనీయిజం పెట్టుబడిదారీ విధానానికి సహజ సిద్ధమైంది కాదని, కొంతమంది స్వార్థపరులైన పెట్టుబడిదారులు, రాజకీయవాదుల కుమ్మక్కు వలన జరుగుతున్న దుష్పరిణామమన్న ధోరణి కన్పిస్తుంది. కాని క్రోనీయిజం కృత్రిమమైంది కాదు. పెట్టుబడిదారీ విధానానికి అంతర్గతమైన లక్షణం. పెట్టుబడిని వేగంగా సమీకరించుకోవడానికి అదొక మార్గం. అంతేకాదు. ప్రజల భూములను, ఆస్తులను, అదాయాలను కొల్లగొట్టటం ద్వారా వాళ్ళను దివాళా తీయించి, శ్రమను అమ్ముకోవాల్సిన పరిస్థితుల్లోకి నెట్టడం పెట్టుబడిదారి విధాన మనుగడకు అవసరం. అందుకు క్రోనీ కాపిటలిజం ఉపయోగపడుతుంది. ఉత్పత్తి కార్యకలాపాల ద్వారా పెటుబడి పెరుగుతుందా, క్రోనీయిజం ద్వారా పెరుగుతుందా, ఎది ఎప్పుడు ప్రముఖ పాత్ర నిర్వహిస్తుంది అన్నది ఆయా స్థల, కాల పరిస్థితులను బట్టి ఉంటుంది. కాని రెండు పద్ధతులూ నిరంతరం పనిజేస్తుంటాయి. అదే పెట్టుబడి పెరుగుదలకు అవసరం.

ప్రభుత్వరంగం ప్రధానంగా వుండి, ప్రభుత్వం సంక్షేమ కార్యకలాపాలకు కొంత బాధ్యత వహిస్తున్న కాలంలో క్రోనీయిజం ప్రముఖంగా కన్పించదు. సరళీకరణ విధానాలొచ్చి, ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించే విధానాలను చేపట్టిన తర్వాత శరవేగంగా పెట్టుబడిదారులు బలపడడానికి ప్రజల, ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టు కోవడానికి అనువైన వాతావరణం ఏర్పడింది. అందువలన ఇప్పుడు మనం జూస్తున్న గనులు, భూములు, బ్యాంకుల కుంభకోణాలు, అవినీతి వ్యక్తుల దురాశ వలన జరుగుతున్న పరిణామాలు కాదు. విధానంలో అంతర్భాగమే. మోడి నాయకత్వాన బిజెపి అధికారానికి వచ్చిన తర్వాత క్రోనీయిజానికి కొత్త నిర్వచనం ఇస్తున్నారు. క్రోనీలందరిని సంపద సృష్టికర్తలుగా ప్రశంసిస్తున్నారు. ఈ క్రోనీల డబ్బుతోటే ఎన్నికల్లో వేలకోట్లు ఖర్చు పెట్టి, ఎన్నికల ప్రక్రియనే ఒక ప్రహసనం జేస్తున్నారు. ఈ క్రోనీల లూటీని రక్షించేందుకే ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారు. ప్రజలను చీల్చి ప్రతిఘటనను బలహీనం జేసేందుకు హిందూత్వ పేరుతో మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్నారు. దేశవ్యాపితంగా ఎక్కడైనా నిరాఘాటంగా సంపద లూటీ జేసుకోవడానికి ఆటంకంగా వున్న ఫెడరలిజాన్ని ధ్వంసం జేస్తున్నారు.

ఏ సమాజంలో నైనా శ్రమ సంపదను సృష్టిస్తుంది. పెట్టుబడిదారీ విధానంలో పెట్టుబడిని, శ్రమశక్తిని వినియోగించి నిర్వహించే ఉత్పత్తి, వ్యాపార కార్యకలాపాలు అదనపు ఉత్పత్తిని సృష్టిస్తాయి. దాన్నుండి పెట్టుబడిదారులకు లాభాలొస్తాయి. వారి వద్ద సంపద పోగవుతుంది. దీన్ని మార్క్సిస్టు పరిభాషలో చెప్పాలంటే అదనపు విలువను దోపిడి జేయడం ద్వారా పెట్టుబడి పెద్దదవుతుంది. ఈ పద్ధతిలో శ్రమ దోపిడీ వున్నా సామాజిక సంపద అదనంగా సమకూరుతుంది. అయితే పెట్టుబడిదారుల వద్ద సంపద పోగవడానికి మరో పద్ధతి కూడావుంది. ఉత్పత్తితో గాని, అదనపు సంపద సృష్టితో లగాని సంబంధం లేకుండా ఇప్పటి సమాజంలో ఉన్న సంపదను, వనరులను హస్తగతం జేసుకుని, తద్వారా పెట్టుబడిని, సంపదను పెంచుకోవడం. ఈ మార్గం ద్వారా కూడా పెట్టుబడిదారుడు సంపదను పోగుజేసుకుంటాడు. ఈ పద్ధతిలో అదనపు విలువ/అదనపు సంపద సృష్టిగాదు. ఉన్న సంపదే పునఃపంపిణీ అవుతుంది. క్రోనీ క్యాపిటలిజంగా పేర్కొంటున్న దాంట్లో ప్రధానంగా జరిగేదిదే. మార్క్సిస్టు పరిభాషలో చెప్పాలంటే దీన్ని పురాతన సంచయం (ప్రిమిటివ్ అక్యుములేషన్) అంటాం.

# 1958 పార్టీ ప్రత్యేక మహాసభ

**(2వ పేజీ తరువాయి)**

ప్రధానమైన మార్పులు చేయాలని, ఫలితాలు సాధించే విధంగా ప్రతిరంగంలోనూ కార్య క్రమాలు నిర్వహించాలని మహాసభ నిర్ణయిం చింది. అందువలన 'ప్రతి పనికి కామ్రేడ్, ప్రతి కామ్రేడ్‌కి పని' అనే నినాదం ఇచ్చింది.

పూర్తికాలం కార్యకర్తల సంఖ్యను పెంచా లని మహాసభ నిర్ణయించింది. వారి పనిని క్రమం తప్పకుండా సమీక్షించాలని, వారి కనీస అవసరాలు తీర్చుకునేందుకు, మందుల ఖర్చు లకు సరిపడా భృతి చెల్లించాలని నిర్ణయిం చింది. పూర్తికాలం కార్యకర్తలతో పాటు ఆనాటి లక్షణమైన మెజారిటీ పార్టీ సభ్యులు క్రియారహితంగా ఉండటాన్ని సరిచేసి, చురుకైన సభ్యులుగా మార్చాలని చెప్పింది. పార్టీ విద్య, ప్రజారంజకమైన పార్టీ సాహిత్యాన్ని రూపొందించడం, దేశాన్ని గురించి అవగాహన పెంపొందించేందుకు కార్యకర్తలకి రాజకీయ తరగతులు నిర్వహించాలని ప్రణాళిక రూపొం దించింది. పార్టీ చేసే ఆందోళనల తీరు కూడా మెరుగుపరచాలని నిర్ణయించింది. పార్టీ నిర్వహిస్తున్న అనేక పత్రికలలో వ్యాసాలు జీవం లేకుండా ఉండడాన్ని, పడికట్టు పదాల వాడుక, వాస్తవాలను చిత్రీకరించక పోవడాన్ని మహాసభ తెగనాడింది. పార్టీ తీర్మానాలు సహితం నిర్దిష్టంగా కాక సుదీర్ఘంగా ఉంటున్నాయని, "లక్షలాది మందికి మార్గదర్శకంగా ప్రజా పార్టీగా పెరుగుతున్నామని, కోట్లాది ప్రజలు పార్టీ మార్గదర్శకత్వం కోసం ఎదురు చూస్తున్నా రన్న చైతన్యంతో రాయాలని" పేర్కొంది.

అన్ని స్థాయిలలో నాయకులుగా ఉన్న వారి పనిని కూడా మహాసభ ఆత్మ విమర్శనా పూర్వకంగా సమీక్షించింది. ఉద్యమ అవస రాలకు అనుగుణంగా నాయకత్వం ఎదగాలని, అన్ని స్థాయిలలో కమిటీలను సమర్థవంతంగా పని చేయించాలని నిర్మాణంపై ఆమోదించిన తీర్మానంలో పేర్కొంది. అణకువ, సహనం, స్నేహశీలత, విమర్శను సానుకూలంగా స్వీకరిం చటం, మాటలు చేతలకు మధ్య అంతరాన్ని తగ్గించటం, ఒంటెత్తుపోకడలకు వ్యతిరేకంగా పోరాడటం, క్రమశిక్షణను అమలు చేయడం పార్టీ ముందున్న ప్రధాన కర్తవ్యాలుగా గుర్తిం చింది. విమర్శ, కింది నుంచి వచ్చిన సలహాల పట్ల ఉదాసీనత ప్రదర్శించడం పార్టీ లక్షణంగా తయారయిం దని, వీటితో పాటు ముఠాలు కట్టడం, ప్రాంతీయవాదం, ఫెడరల్ ధోరణు లపై పోరా డాలని నిర్ణయించింది. కేంద్రీకృత ప్రజా స్వామ్యం, కార్మికవర్గ నియంతృత్వ సూత్రాలను ప్రశ్నించడం సంస్కరణవాద వ్యక్తీకరణ అని, దానిపై పోరాడవలసిన అవసరం ఉందని చెప్పింది.

అయితే ఈ నిబంధలనలలో ఎక్కువ శాతం అమలుకాలేదు. ఓట్లు పొందిన దామాషాలో సభ్యత్వం ఉండాలని, తద్వారా ప్రజా పునాదిని పెంచుకోవాలనడం వలన పార్టీ సభ్యులను చేర్చుకునే ప్రక్రియ పలచన చేయబడింది. ఇవన్నీ కలిసి పార్టీలో సంస్కరణ వాద ధోరణులు పెరగటానికి దారితీశాయి.

ఈ కాలంలో పెరిగిన కార్మికవర్గ పోరా టాలు, ముఖ్యంగా రెండో పే కమిషన్ డిమాండ్ సాధించుకున్న పోస్టల్, టెలిగ్రాఫ్ కార్మికుల పోరాటాన్ని పార్టీ రాజకీయ తీర్మానం గుర్తించింది. కార్మిక సంఘాల ఐక్య పోరాటా లను నిర్మించడంలో ఏఐటియుసిలో ఉన్న పార్టీ సభ్యులు ప్రముఖ పాత్ర పోషించారు. అస్సాంలో చమురు రిఫైనరీ కోసం జరిగిన పోరాటంలో పార్టీ ప్రముఖ పాత్రను పోషిం చిందని కూడా మహాసభ గుర్తించింది.

భారత ప్రభుత్వం విదేశాంగ విధా నంలో మార్పుకు, సత్వర పారిశ్రామికీకరణ గురించి రెండో పంచవర్ష ప్రణాళికలో ఉన్న కొన్ని 'అభివృద్ధి కాముక అంశాలకు' రాజకీయ తీర్మానం మద్దతు తెలిపింది.

ఈ కాలంలోనే స్వతంత్ర పార్టీ అనే మరో బూర్జువా పార్టీ కూడా ఆవిర్భవించింది. అప్పటికి అదింకా అప్రధాన శక్తిగానే ఉన్నప్పటికీ పార్టీలోని సంస్కరణవాదులు ఈ స్వతంత్ర పార్టీని ఒక పెద్ద ముప్పుగా చూపు తూ, ఆ సాకుతో కాంగ్రెస్‌తో కుమ్మక్కు అవ్వాలని ప్రతిపాదించారు. అమృతసర్ మహాసభ వీరి ఆశలపై నీళ్లు చల్లింది. ఈ వాదనని తోసి పుచ్చుతూ కాంగ్రెస్ ప్రభుత్వ మితవాద, ప్రజా వ్యతిరేక విధానాలు రాజ కీయ, ఆర్థిక రంగా లలో అత్యంత మితవాద శక్తుల పెరుగుదలకు దోహదం చేస్తాయని, ఎంతో పట్టుదలతో, ధైర్యంతో ఏకకాలంలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కూడా పోరాటం చేయటం ద్వారానే ఈ శక్తులను ఓడించటం సాధ్యమౌ తుందని పార్టీ విధానాన్ని మహాసభ వివ రించింది.

అమృతర్ మహాసభ ముగిసిన తరువాత కూడా విభేధాలు కొనసాగాయి. పార్టీలో ఒక వర్గం కాంగ్రెస్ పార్టీ యెడల మెతకధోరణితో సంస్కరణవాద వైఖరిని అవలంభించింది. కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూల్చి వేయడం వారిని దిగ్భ్రాంతికి గురి చేసినా, అది తాత్కాలికమే అయింది. తిరిగి సంస్కరణవాద దారిలోనే వారి పయనం కొనసాగింది.

### 1959 బెంగాల్ చారిత్రిక ఆహార భద్రతా ఉద్యమం

బెంగాల్ ప్రజలు ఆహారం కోసం సాగించిన పోరాటం ప్రజల రక్తంతో తడిసింది. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే పోరాటం ఇది. జీవించే హక్కును రక్షించుకోడానికి పీడిత ప్రజలు ఆవేశంతో కదిలి, కార్యాచరణకు దిగిన సందర్భం. 1959 జులై 13 న ఆహారం కోసం మొదలైన ఈ పోరాటం సెప్టెంబర్ వరకు కొనసాగింది; ఈ పోరాటంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగించిన దమనకాండకు డజన్ల కొద్దీ ప్రజలు బలయ్యారు; వందలాది మంది గాయపడ్డారు; వేలమంది నిర్బంధించబడ్డారు. బెంగాల్ ప్రజానీకం అంతా ఉవ్వెత్తున ఎగసింది. లక్షలాది మంది కదిలారు– ఈ పోరాటం కలకత్తా, జిల్లా కేంద్రాలకు మాత్రమే పరిమితం కాలేదు. పల్లె పల్లెకూ వ్యాపించింది. రైతాంగం, కార్మికులు, విద్యార్థులు, మధ్యతరగతి, వృత్తిదారులు, ఇతర తరగతుల వారు వేలాదిగా పోరాటంలో మమేకమయ్యారు.

పశ్చిమ బెంగాల్ మొదటి ముఖ్యమంత్రి డాక్టర్ బి సి రాయ్ పాలిస్తున్న కాలంలో ఆహార సంక్షోభం తీవ్రమైంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కరువు పరిస్థితులు భాగంగా మారాయి. రాష్ట్రాన్ని నిత్యం కరువు పీడిస్తున్న పరిస్థితులవి. 1955 తరువాత ఆ పరిస్థితి మరింత దిగజారి సంక్షోభం తీవ్రమైంది; ముఖ్యంగా 1955 ఏప్రిల్ –సెప్టెంబర్ మధ్య కాలంలో ఆహార కొరత తీవ్రరూపం దాల్చింది. 1955 డిసెంబర్‌లో రూ. 382 ఉన్న ధరల సూచి 1956 డిసెంబర్‌కి అమాంతంగా రూ. 532 కి ఎగబాకింది. 1959 మొదలయే సరికి పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చింది. ఆకలి కేకలు, చావులు, ఆత్మహత్యలు పెరిగాయి. లక్షలాది మంది ఆహారాన్ని, ఉపాధిని వెదుక్కుంటూ గ్రామాల నుండి పట్టణాలకు, ముఖ్యంగా కలకత్తా నగరానికి వలస బాట పట్టడం నిత్యకృత్యంగా మారింది. ప్రజలు సమస్యల నుండి బయట పడే మార్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం చూపకపోగా వాటిని మరింత పెంచే విధానాలను అనుసరించింది; రైతాంగం భూములను, ఉద్యోగస్తులు ఉ ద్యోగాలను కోల్పోయారు; పేదలు మరింత పేదలయ్యారు.

ఈ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ మహత్తరమైన పాత్ర పోషించింది. ధరల పెరుగుదల, కరువు నివారణ కమిటీని(పి ఐ ఎఫ్ ఆర్ సి) ఏర్పాటు చేయడంలో పార్టీ చొరవ చూపింది. పి ఐ ఎఫ్ ఆర్ సి ద్వారా నిర్ణయాలు తీసుకోడంలోనూ, వాటిని అమలు చేయటంలో కూడా నిర్ణయాత్మక పాత్ర పోషించింది. తీవ్రమైన సంక్షోభ సమయంతో

సహా, ఎల్లప్పుడూ పరిస్థితిని పూర్తిగా తన అదుపులో ఉంచుకుంది. లాఠీ ఛార్జ్, కాల్పులు, గుండాలతో పోరాటాలు జరుగుతున్నా, వారి ఏజెంట్లు రెచ్చగొడుతున్నప్పుడు కూడా పి ఐ ఎఫ్ ఆర్ సి కార్యకర్తలు ఎల్లప్పుడు ప్రజలతోనే ఉండేవారు. ఆగ్రహంతో ఊగిపోతున్న ప్రజల క్రోధ ద్వేషాలు అవాంఛిత మార్గాలకు మళ్లిపోకుండా ఉంచేందుకు ప్రయత్నాలు చేసేవారు.

శాసనసభకు ఎన్నికైన కమ్యూనిస్టు పార్టీ నాయకులు రాష్ట్రంలో ఆహార సంక్షోభాన్ని నివారించడానికి పిఐఎఫ్ఆర్సి చేసిన సూచనలను, ఫిబ్రవరిలో శాసనసభలో చర్చించారు. కానీ ప్రభుత్వం చర్యలు తీసుకోడానికి నిరాకరించింది. అందుకు బదులుగా వ్యాపారస్తుల ప్రయోజనాలను కాపాడే పనిలో పడింది. సరఫరాలు తగ్గడం మొదలవగానే ధరల నియంత్రణను పూర్తిగా గాలికి వదిలేసింది; ఆ విధంగా నల్ల వ్యాపారాన్ని, అధిక లాభాలార్జించడాన్ని చట్టబద్ధం చేసింది. రైతాంగం నుండి నేరుగా అవసరమైన మేరకు ధాన్యం, బియ్యం కొనుగోలు చేయడానికి నిరాకరించింది; అలాగే మిల్లులో జరిగే ఉత్పత్తిపై లెవీని పెంచి, మిల్లర్ల నుండి వసూలు చేయడానికి కూడా నిరాకరించింది. శాసనసభలో కమ్యూనిస్టు పార్టీ ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం, కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క ప్రజావ్యతిరేక, నల్ల బజారు అనుకూల ఆహార విధానాలను పూర్తిగా బట్టబయలు చేసింది.

పి ఐ ఎఫ్ ఆర్ సి సమర్పించిన విస్తారమైన ప్రత్యామ్నాయ ఆహార విధానాలను కమ్యూనిస్టు పార్టీ చర్చ కోసం ప్రభుత్వం ముందు పెట్టింది. రాష్ట్రంలో పంట దిగుబడి పెరగడానికి తీసుకోవలసిన చర్యలు, రైతాంగం నుండి ప్రత్యక్షంగా కొనుగోలు చేసి ప్రజలకు పంపిణి చేయటం, పంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలుచేయడం, ముసలి వారికి, నిరుద్యోగులకు, వికలాంగులకు వెసులు బాటు కలిగించటం ఈ ప్రత్యామ్నాయ విధానాలలో ఉన్నాయి. కేరళలో పాలిస్తున్న కమ్యూనిస్టు ప్రభుత్వం అనుసరిస్తున్న ఆహార భద్రతా కమిటీలను ఇక్కడ కూడా అన్ని స్థాయిలలోను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. భూమిలేని పేదలకు, రైతులకు మిగులు భూమిని పంచాలని, అవసరం ఉన్న ప్రతి వారికీ రేషన్ దొరికే విధంగా ఆహార పంపిణి చట్టాన్ని సవరించి, విస్తృత పరచాలని, ఆహారం అందరికీ అందుబాటులోకి తేవాలని సూచించింది; ధాన్యం నిల్వలు సమకూర్చుకోవాలని, ధరలు తగ్గించాలని, నల్లబజారును, సట్టా వ్యాపారాన్ని నివారించడానికి చర్యలు తీసుకోవాలని సూచించింది.

ఈ డిమాండ్లను ఆమోదించడానికి బదులుగా, కమ్యూనిస్టు పార్టీ, పిఐఎఫ్ఆర్సి సలహాలను, ప్రతి డిమాండ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా తిరస్కరించింది. ఆహార పరిస్థితి మరింత దిగజారడంతో కమ్యూనిస్టు పార్టీ, పిఐఎఫ్ఆర్సి ద్వారా ప్రజాసమీకరణకు పూనుకుంది. రాష్ట్రవ్యాప్తంగా నిరసన ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించింది; కొద్ది కాలంలోనే ఉద్యమం రాష్ట్ర స్థాయికి చేరింది. దీని తరువాత సాధారణ సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ నిరసనలేవీ మూర్ఖపు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కదిలించలేదు.

మరో మార్గాంతరం లేక పిఐఎఫ్ఆర్సి ప్రత్యక్ష కార్యాచరణకు పిలుపునిచ్చింది. ఈ పోరాటం జులై 13 న మిద్నపూర్ జిల్లాలో ప్రారంభమయి, పది రోజులలోనే మిగిలిన అన్ని జిల్లాలకూ వ్యాపించింది. ఆగష్టు 8 న రాష్ట్ర ఆహార సదస్సు జరిగింది; ఆగష్టు 20 నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష కార్యాచరణకు సదస్సు పిలుపునిచ్చింది. ఆ రోజు నుంచి ఉద్యమం మరింత వేగాన్ని పుంజుకుని రాష్ట్రమంతా వ్యాపించింది.

బిసి రాయ్ ప్రభుత్వం ఉద్యమానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. ఎఆగష్టు 25 నుండి రాష్ట్ర వ్యాప్తంగా దమనకాండకు శ్రీకారం చుట్టింది. సెప్టెంబర్ 1 నుండి విద్యార్థులు నిరసనలో పాల్గొన్నారు. కలకత్తాలోని కాలేజ్ వీధి భీకర పోరాటానికి కేంద్రంగా మారింది. ఆగస్టు 31– సెప్టెంబర్ 4 తేదీల మధ్య పోలీసుల కాల్పులలో గాని, లాఠీ చార్జీలో గాని 80 మంది అమరులయ్యారు; 3,000 మందికి పైగా గాయాల పాలయ్యారు. కనీసంగా 200 మంది కనిపించకుండా పోయారు; వేలాదిమంది ఖైదు చేయబడ్డారు.

ఐక్యతను భంగపరచడానికి పోలీసులు కార్మికులుండే వీధులపై దాడులు చేశారు; ఇళ్లలో ఉన్న వారిని చితక బాదారు. అంతటితో సంతృప్తి చెందకుండా బజార్లను టియర్ గ్యాస్‌తో నింపారు. అయినా కార్మికవర్గం వెనుకడుగు వేయలేదు; సాధారణ సమ్మెలో కార్మిక వర్గమంతా పాల్గొంది. ( ఈ చర్యలేవీ కార్మికవర్గ ఐక్యతను దెబ్బతీయలేదు. రైతాంగానికి, కార్మికవర్గానికి మధ్య ఉన్న ఐక్యతను విడదీయలేదు. ఈ ఉద్యమంలో ప్రధాన అంశం ఇది.

ఖైదు చేయబడిన వారిలో 75 శాతం రైతులే. మిగిలిన వారు కార్మికులు, విద్యార్థులు, మధ్యతరగతి ఉద్యోగులు. జైళ్ళకు వెళ్ళడానికి సిద్ధపడిన వారిలో వేలాది మంది మహిళలు ఉన్నారు.

ప్రత్యక్షంగా, వ్యక్తిగతంగా బి సి రాయ్ ప్రభుత్వ నాయకత్వంలోని పోలీసుల పాశవికత అంతకు ముందెన్నడూ కని విని ఎరుగని స్థాయికి చేరింది. చాలాచోట్ల పోలీసులు వెనుదిరిగి పారిపోయే దారులన్నీ మూసేసి, నిరసనకారుల చుట్టూ కందకాలు తవ్వి కిరాతకంగా కొట్టారు. ఖైదు చేయబడిన వారిని కూడా పోలీసులు జైళ్లలో చిత్ర హింసలకు గురిచేశారు. వాళ్ళు చేసిన సామూహిక హననాలు బయట పడకుండా, సాక్ష్యాలు మాయం చేయడానికి మరణించిన వారి నందరినీ అర్ధరాత్రే దహనం చేశారు. కలకత్తా–హౌరా ప్రాంతాలు ఈ ఘాతు కాలను 'తుడిచిపెట్టే చర్యలకు' నిలయాలుగా మారాయి.

ఈ నిరసనల కాలమంతటిలో కమ్యూనిస్టు పార్టీ వీరోచిత పాత్ర పోషించింది. పార్టీ దినపత్రిక స్వాధీనత పోషించిన పాత్రను ముఖ్యంగా చెప్పుకోవాలి. ఆ పత్రికలో పనిచేసే కామ్రేడ్లు, పత్రికను నిజమైన ప్రజావాణిగా తీర్చిదిద్ది, పోరాటం యొక్క అత్యంత శక్తివంతమైన ఆయుధంగా మలిచారు. తీవ్ర సాహసోపేతమైన చర్యలు చేపడుతూ, ఆశ్చర్యం గొలిపే నివేదికలను సేకరించారు; పోలీసుల దుశ్చర్యల ఫోటోలు సేకరించి, పత్రికలో ముద్రించి ప్రజలలో ఆగ్రహజ్వాల రగిలించారు.

పార్టీ కేంద్ర కమిటీ, బెంగాల్ ప్రజల పోరాటాన్ని కొనియాడింది; దేశ వ్యాప్తంగా సౌహార్ద్ర ప్రచారానికి పిలుపునిచ్చింది. దేశమంతా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ దుశ్చర్యలను ఖండించారు. ఈ కాలంలోనే 'ప్రజాస్వామ్యాన్ని రక్షించడమనే' పేరుమీద కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని రద్దు చేయడంతో కాంగ్రెస్ అసలైన వర్గ స్వభావం బట్టబయలయింది. బెంగాల్‌లో ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజాతంత్ర సూత్రాలను అతిక్రమిస్తూ, ప్రజాతంత్ర హక్కులను నిర్దాక్షిణ్యంగా కాలరాస్తున్నది.

కాంగ్రెస్ కపటత్వంతో పాటుగా, కాంగ్రెస్‌కి, కమ్యూనిస్టు పార్టీకి ఉన్న వ్యత్యాసం కూడా స్పష్టంగా బయటపడింది. 1959 ఆహార భద్రతా ఉద్యమ ప్రభావం కమ్యూనిస్టు పార్టీలో అంతర్గతంగా జరిగే చర్చలపై, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎడల అనుసరించాల్సిన వైఖరిపై పడింది.

ఉద్యమంలో అసువులర్పించిన వారి జ్ఞాపకార్థం ఒక స్థూపాన్ని ప్రత్యేకంగా నిర్మించడానికి 1959 సెప్టెంబర్ 26 పునాదులు వేశారు. అదే రోజు ఆహార ఉద్యమాన్ని ఉపసంహరిస్తున్నట్టు పి ఐ ఎఫ్ ఆర్ సి అధికారికంగా ప్రకటించింది. మరచిపోలేని విధంగా కలకత్తాలో నిశ్శబ్ద ప్రదర్శనను నిర్వహించి, పోలీసు అకృత్యాలపై బహిరంగ విచారణ నిర్వహించాలని, మృతుల కుటుంబాలకు తగిన నష్ట పరిహారం చెల్లించాలని, రాష్ట్ర ఆహారమంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆహార ఉద్యమం ఇచ్చిన ఉత్తేజం, దాని ప్రతిస్పందనలు ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటాయి.

**(అనువాదం: కె ఉషారాణి)**

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-10-2021 (36 pages) Postal Regd. No D/VJ/172/2021-23

# రోజుకు 2 డాలర్ల కన్నా తక్కువ ఆదాయంతో బతుకుతున్న 80 శాతం భారతీయులు



ప్రపంచంలోని మొత్తం 199 దేశాల లెక్కలు తీస్తే తలసరి ఆదాయంలో భారత దేశం 143వ స్థానంలో ఉంది. మన పొరుగునే ఉన్న శ్రీలంక, బంగ్లాదేశ్‌ల కాన్న మన ప్రజలు పేదరికంలో ఉన్నారు. 2020 లెక్కల ప్రకారం మన దేశ పౌరులు సగటు ఆదాయం ఏడాదికి 1900 డాటర్లు (అంటే సుమారు రూ. 1,42,000). దేశంలో కోటాను కోట్ల రూపాయల గడించే అత్యంత ధనికులు, రోజు తిండికి లేని పేదలు.. అందరి ఆదాయాల మొత్తాన్ని దేశ జనాభాతో విభజిస్తే వచ్చేది తలసరి ఆదాయం. అంటే సంవత్సరానికి 1900 డాలర్ల ఆదాయం కూడా లేని వారి సంఖ్యే ఎక్కువ ఉంటుంది. దేశ జనాభాలో 68.8 శాతం (సుమారు 80 కోట్ల మంది) ప్రజలు రోజుకు 2 డాలర్ల కన్నా తక్కువ ఆదాయంలో బతుకుతున్నారు. అంటే వీరి తలసరి వార్షికాదాయం 770 డాలర్లు మాత్రమేనన్న మాట. 30 శాతం మంది భారతీయులు రోజుకు 1.25 డాలర్లకన్నా తక్కువ ఆదాయంతో బతుకుతున్నారు. అంటే వీరి తలసరి వార్షికాదాయం 450 డాలర్ల కన్నా తక్కువే. మన దేశం కన్నా శ్రీలంక (3.770), బంగ్లాదేశ్ (2,010) ప్రజలు ఆదాయంలో ముందున్నారు. చైనా వార్షిక తలసరి ఆదాయం 10,610 డాలర్లు, అమెరికా 65,910 డాలర్లు.

మన దేశంలో పేదరికంలో మగ్గుతున్న సుమారు 80 కోట్ల మంది ప్రజలు పౌష్టికాహార లోపం, విద్య, వైద్యానికి నోచుకోకపోవడం, అత్యధిక శిశుమరణాలు, అంటువ్యాధులతో బాధపడుతున్నారు. దేశంలో 14 లక్షల మంది పిల్లలు 5 ఏళ్లు నిండకుండానే చనిపోతున్నారు. 6.1 కోట్ల మంది పిల్లలతో సహా మొత్తం 20 కోట్ల మంది ప్రజలకు శరీర పోషణకు కావలసిన ఆహారం అందడం లేదు. అందువల్ల 78 లక్షల మంది పిల్లలు 2.5 కిలోల కన్నా తక్కువ బరువుతో పుడుతున్నారు. 2018లో ప్రపంచ సగటు ఆయుఃప్రమాణం 72.56 సంవత్సరాలు కాగా భారత్‌లో అది 69.42 సంవత్సరాలు మాత్రమే. సగటు ఆయుఃప్రమాణం భారత్‌తో పోలిస్తే మన పొరుగున ఉన్న భూటాన్‌లో 71.09, బంగ్లాదేశ్‌లో 71.8, చైనాలో 75.73 సంవత్సరాలు ఉన్నది.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు ..................................................

వీధి..................................................

గ్రామం..................................................

మండలం లేదా పట్టణం ..................................................

జిల్లా..................................................

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.16, No.5. Published on October 1, 2021